THE BOOK WAS DRENCHED

OSMANIA UNIVERSITY LIBRARY
Call No. T82 P29P
Name of Book పెద్దాపురము ముట్టడి
Name of Author పిల్లలమర్రి ...
UNIVERSAL LIBRARY
OU_204347
UNIVERSAL LIBRARY

మనోహరగ్రంథనిలయము ౧.

# పెద్దాపురము ముట్టడి.

ఆంధ్రచారిత్రాత్మక నవలాకారము.

కర్త:

బుద్ధవరపు పట్టాభిరామయ్య.

శ్రీ

కాకినాడ

సిటీ ముద్రణాలయమునందు

ముద్రితము.

౧౯౨౫.

వెల ౧ రు.

*All Rights] [Reserved.*

# ప్రకటన.

లిఖితరూపకమైన నాయనుమతిని పొందినవారీనాటకమును ప్రదర్శించుకొనవచ్చును.

గ్రంథకర్త.

ప్రథమముద్రణము.

ఈ గ్రంథప్రతులు కావలసినవారిట్లు వ్రాయునది:—

బుద్ధవరపు పట్టాభిరామయ్య,
గాంధీనగరము,
కాకినాడ.

ఏ సుగుణరాశి జననముచే

పంతులూరివంశము పావనమయ్యెనో,

ఏ సాధ్వీమణి పాణిగ్రహణముచే

సింహాద్రి జగపతిరాజచంద్రుఁడు ధన్యుఁడయ్యెనో,

ఏ త్యాగశీల కరుణాచంద్రికలచే

ఆర్తజన కష్టాంధకారము పటాపంచలయ్యెనో

ఏ పవిత్ర పాలనాప్రభావముచే

కొత్తాము సంస్థానము శోభాన్వితమయ్యెనో

అట్టి

ఘని సంస్థాన మహారాజ్ఞీమణి

శ్రీ రాజా వత్సవాయ వెంకట సుభద్రయ్యమ్మ జగపతి

రాణీ బహద్దరు వారికి

ఈ రూపకరాజమును

భక్తి గౌరవచిహ్నముగ సమర్పించుకొనుచున్నాను.

గ్రంథకర్త.

# గ్రంథకర్తృ విజ్ఞాపనము.

పెద్దాపురము చిరకాలము నా వాసగృహము; నాకు విద్యావివేకసంపదనొసగిన కల్పవృక్షము; నా యభిమానమునకు తావలము.

పౌరుషప్రతాపకీర్తిస్ఫూర్తులకాలవాలమై నిజవైభవకాంతులచే శత్రురాజుల కన్నులకు మిఱుమిట్లుగొలిపి యొకనాడు మహేంద్రనివాసమో యన విలసిల్లిన పెద్దాపురదుర్గము నేడు సాంద్రకంటకగుల్మలతాపరివృతశిథిలమందిరకుడ్యములతో శివారణ్యములతో ఘూకసందోహసంచారముతో భీభత్సాకారమును దాల్చి దుర్గమమైయుండ గాంచినపుడెల్ల నామనస్సు విచలితమయ్యెడిది. అనేక రణములకు రంగస్థలములై శత్రువీరస్కంధావారములకు యోగ్యస్థానములైన పాండవులమెట్ట మొదలగు ప్రదేశములు, దర్శించినపుడెల్ల నాహృదయమున కుద్రేకము కలుగజేయుచుండెడివి. ఏప్రదేశముల విహరింపనేగినను అవి-దేశభక్తులై, త్యాగశీలురై, విశాలహృదయులైన యాంధ్రవీరవరేణ్యుల పవిత్ర శోణితముచే నార్ద్రములైనవే యను విషయము జ్ఞప్తికివచ్చెడిది.

నాభావోద్రేకమున కనుగుణ్యముగ పెద్దాపురవాస్తవ్యులైన నా బాల్యమిత్రులు కొందఱు కథాభాగమును నాకుజూపి నాటకము వ్రాయుమని 1922 సంవత్సరమునుండియు నిత్యము నన్ను వేధించుచుండుటచే నిప్పటికైన దీనిని వ్రాయక తప్పినదికాదు. ఇట్లనేకవిధముల నీ నాటకరచనమునకు నాకుగలహక్కు అపారమైనదని మా చదువరులకు మనవిచేసికొనుచున్నాను.

ఈనాటకమును చక్కగాను సంపూర్ణముగాను చదివి హృదయోత్సాహానందముల సుపోద్ఘాతరూపకముగా వెల్లడించి కావ్యమున కమితగౌరవమొసగూర్చిన, చెన్నపట్టణపు ప్రెసిడెన్సీ కాలేజీపండితులు, బ్రహ్మశ్రీ విస్సా అప్పారావుపంతులు, యమ్. ఏ., యల్. టి., గారికి కృతజ్ఞతానేకనమస్కారము లాచరించుచున్నాను

పెద్దాపురసంస్థానచరిత్రాంతర్గత కథాభాగము నీసమవాకార రూపమున గానముచేయు భాగ్యము తొలుదొల్త నాకు లభించినందులకు ధన్యుడను.

# ఉపోద్ఘాతము.

'పెద్దాపురము ముట్టడి' అను మూఁడంకముల నాటకమును రసవంతముగాను, ద్రాక్షాపాకముగాను, ఆంధ్రచారిత్రాత్మకముగాను వ్రాసిన శ్రీ బుద్ధవరపు పట్టాభిరామయ్యగారు, ఆంధ్రులకృతజ్ఞతకెంతయుఁ బాత్రులు. ఆంధ్రదేశమున, గోదావరీ మండలమున 16 వ శతాబ్దము మొదలుకొని 19 వ శతాబ్దాదివఱకు, పేరునకెక్కిన పెద్దాపుర సంస్థానముయొక్క చరిత్రములోని రసవంతమగు నొకపట్టు నాటకరూపముగా నిట్లు వ్రాయఁబడినది. ఇందలికథ వీరరసప్రధానమై ఆంధ్రవీరుల యుత్సాహము, శక్తి, సామర్థ్యము, ఔదార్యము, రాజ్యాంగతంత్రనైపుణ్యము వేనోళ్ళఁజాటుచున్నది. ఇట్టి చరిత్రలను వినుటగాని, చదువుటగాని నేఁడరుదైనది. ఇట్టిచో, మనపూర్వరాజులచరిత్రను గుఱించిన యీనాటకము చదువుటవలన మనకందఱకును పూర్వపు టౌన్నత్యము మొదలగు మహత్తరవిషయము లొక్కమారు స్మరణకు రాకపోవు. దానివలనఁగలుగు మనోవృత్తులనంతములు. అవి పాఠకులుచదివి యనుభవింపఁదగినవికాని నేను వ్రాయఁజాలినవికావు. ఇదియే యీనాటకమువలనఁగలుగు గొప్పలాభమని నాయభిప్రాయము

నేఁటి నాటకములన్న, సర్వసాధారణముగా, శృంగారరసప్రధానములై, పారసీమట్టు మొదలగు పాటలతోనిండి, యేదో యొక పురాణగాథనో, మఱిదేనినో యాధారముచేసికొని, చదువరుల మనస్సునకొక క్రొత్తవికారమును బుట్టించుచున్నవి. ఈనాటక మట్టిదారిని గాక, జనోపకారమగు దారిపట్టియున్నది. ఇట్టివి ఆంధ్రవాఙ్మయమున పెక్కులులేవు. ఈనాటకము మొదటనుండి తుదవఱకును, ఏకరీతిని మనస్సు నాకర్షించుచున్నది. స్వభావమును వదలక, మితిని మించక, సత్యమునకు దూరముగాక, కథ పోషింపఁబడినది. రాజ్యకాంక్షాలోలత్వముచే, ద్రోహియు, దుర్మార్గుఁడునగు రుస్తుము యొక్కయు, రాజభక్తిపరాయణతచే, శూరుఁడును, వీరుఁడునగు నూరుద్దీను యొక్కయు, నిరుపమాన రాజసేవాతత్పరతచే రాజ్యాంగతంత్ర కోవిదుఁడును, పురోహితుఁడునగు కొంపెల్ల సుబ్రహ్మణ్యసోమయాజి యొక్కయు, మాతృవాక్యపరిపాలనాశీలురై, కళానిధులును, పరాక్రమవంతు

లును, నిష్కపటులునగు రాజసోదరులయొక్కయు, స్వలాభాభిలాషచే కపటియగు అన్వర్దీన్‌ఖానుయొక్కయు, ధర్మరాజ్యపరిపాలనోత్సాహియగు నైజామ్-ఉల్-ముల్క్ యొక్కయు, ఉదారశీలుఁడును, వీరుఁడునగు విజయరామరాజుయొక్కయు, పాత్రములు మిక్కిలి చక్కఁగా పోషింపఁబడినవి. రాఘవమ్మాదేవిగారియొక్క అమాయకమైన ధర్మపరిపాలనము సముచితముగా చూపఁబడియున్నది. తుదకు, ఆమెకు సంభవించినదుర్గతి దుఃఖాంతమై, మనస్సున కత్యంతభారముగా నాటుచున్నది. రాజమాతయొక్కకోర్కె మనమున నిడికొని, తరములనుండి తమ్ముఁగాపాడుచున్న సంస్థానమును నిలుపుటకై, రాజశిశువుయొక్క యెంగిలిస్తైన తినుటకసహ్యపడక, కష్టములెన్నివచ్చినను లెక్కపెట్టక, సాహసమును, యుక్తిని, ఆశ్చర్యమగు రీతిని చూపిన లక్ష్మీసోమిదమ్మ మహత్తరచరిత్రమెంతయు ప్రశంసనీయము.

నా చిన్నతనమున పెద్దాపురములో నామేనత్త భర్తయగు భావరాజు సుబ్బారాయకవిగారు నాకీకథ చెప్పఁగా వినియున్నాను. ఆకథ వినుటయందుఁగల నాఁటియుత్సాహము నేఁటికిని మఱపునకు రాదు. ఈచరిత్ర యిప్పటికిని, పల్లెటూళ్లలో, స్మరించుకొనినప్పుడెల్ల, కంటఁదడిపెట్టుకొనని వారుండరు.

ఎన్నఁడో మఱచిన యీ సంస్థానచారిత్రము నిరూపకముగ, చదువరుల మనముల నాకట్టునట్లుగా వ్రాసినందులకై శ్రీ పట్టాభిరామయ్యగారు మిక్కిలి ప్రశంసనీయులు. ఆంధ్రులీపుస్తకము సఫలకముగా నాదరించి, పట్టాభిరామయ్యగారు పడ్డశ్రమను సార్థకమొనర్పఁగలరని నమ్ముచున్నాను.

ఆంధ్రవాఙ్మయమునందలి వాత్సల్యముతప్ప మఱియే యధికారమును లేనివాఁడనగు నేనీనాటకమునకుపోద్ఘాతము వ్రాయఁబూనినందులకు పాఠకమహాశయులు నన్ను మన్నింతురుగాక. ఆంధ్రులెల్లరును ఈనాటకమునుచదివి తమపూర్వుల ప్రతిభాసామర్థ్యములు స్మరించుకొని, గుణపాఠముల గ్రహించి సంపొందుదురుగాక !

తిరువళిక్కేణి,
చెన్నపట్టణము,
18-2-1929

ఇట్లు,
సుజనవిధేయుఁడు,
వి స్సా - అ ప్పా రా వు

*

# అవతారిక.

ఆనాఁడు ఔరంగజేబు ఉత్తరహిందూస్థానమునకేగాక యించుమించుగా దక్షిణహిందూదేశమునకంతకునుగూడ ప్రభుత్వముచేయుచుండెను. అతఁడు దక్షిణదిగ్విజయయాత్రను ముగించి క్రొత్తగా సంపాదించిన రాజ్యముల బరిపాలించుటకై కుమ్రుద్దీన్ అసఫ్ జా అనువానిని ప్రతినిధిగా నియమించెను. ఆప్రతినిధిక్రింద రాజమహేంద్రవరము, శ్రీకాకుళము మొదలగు నిరువదిరెండుపరగణాలుండెను.

ఇట్లు కొంతకాలముగడచినవెనుక 1707లో ఔరంగజేబస్తమించెను. ఇతనివెనుక ఢిల్లీశులైన యీతనికొమరులు దుర్బలులైనందున కుమ్రుద్దీన్ అసఫ్ జా 1723లో స్వతంత్రప్రభువైనట్లుప్రకటించి నైజామ్—ఉల్—ముల్క్ అను బిరుదువహించెను.

1714లో పెద్దాపురంసంస్థానాధీశులైన యుద్దండరాయజగపతిరాజుగారు కాలగతినొందఁ ఆయనసతీమణి (రాగమ్మదేవిగారను) రాఘవమ్మాదేవిగారు బాలురగు తనయులపక్షమున రాజ్యమును పాలించుచుండిరి. అందు జ్యేష్ఠులు తిమ్మజగపతిరాజుగారు. రెండవవారు బలభద్రరాజుగారు. తండ్రిగారు కాలముచేయునప్పటికి తిమ్మజగపతిరాజుగారికి పదియేండ్లవయస్సుమాత్రమే.

రాగమ్మదేవిగారట్లు మంత్రిసామంతపురోహితదండనాథాగ్రణులసాహాయ్యమున దక్షతతో రాజ్యమునుపాలించి తిమ్మజగపతిరాజుగారుచేతికందివచ్చుటతోడనే రాజ్యమునాతనివశముచేసిరి. కాని కళాబిరుదాంకితులగు తిమ్మజగపతిరాజుగారు రాజ్యాంగవ్యవహారములను తల్లిగారియందలిగౌరవముచే నామెయాలోచనమును ఆనతిని బొందుచు చక్కబెట్టుచుండిరి.

ఈసమయమున రాఘవమ్మదేవిగారికరుణచే నామెకొలువులో చేరి యున్నతపదవినలంకరించిన యొకమహమ్మదీయవీరుడు కలడు. ఇతడే రుస్తుంఖాన్! ఇతనికొమరుడు నూరుద్దీనుకూడ రాఘవమ్మదేవిగారి కొలువులోనేయుండెను. తండ్రికొమరులిరువురును రాఘవమ్మదేవిగారియాప్తకోటిలో గణనకెక్కిరి. కొలువులోచేరిన కొన్నియేండ్లకు రుస్తుంఖానునకు పెద్దాపురసంస్థానమునపహరించు దుర్బుద్ధికలిగి రాజకుమారునివధించి సంస్థానమునుహరించుటకు కుమారునితోడ్పాటుగోరెను. కాని నూరుద్దీనందులకంగీకరింపక తండ్రిదురాలోచనకు కోపింప రుస్తుము వానిని మాయమాటలతో శాంతింపజేసి తనపై వానికనుమానము కలుగకుండజేసికొనెను. కుమారునివలన తనకార్యము నెరవేరకపోవుటచే నిజాముతో నుత్తరప్రత్యుత్తరములజరిపి నిజాముతనాహ్వానించినంతనే పెద్దాపురమున కొలువుచాలించుకొని హైదరాబాదేగెను.

ఆకాలమున పశ్చిమదేశమున మహారాష్ట్రులు సాహు పీష్వా బాజీరావుమొదలగువారి నాయకత్వమున బలవంతులై వీలుచిక్కినచో గోలకొండరాజ్యమును మ్రింగజూచుచుండిరి. నిజామును, మహారాష్ట్రరాజ్యవ్యవహారములలోకలుగజేసికొని వారిలోవారికి భేదముకల్పించి వారిరాష్ట్రమును హరింపజూచుచుండెను.

స్వాతంత్ర్యమువహించిన పదునొకండుసంవత్సరములనుండియు నైజామాంధ్రరాజులను కప్పముచెల్లింపుడని కోరుచుండ వారందులకు నిరాకరించి నిజాముపైదండెత్తిరావలసినదని ఢిల్లీశునకు వార్తలనంపుచుండిరి. తమ ప్రభుత్వధిక్కారమునుగావించిననిజామును శిక్షింపవలెనని ఢిల్లీశుడును యత్నించుచుండెను.

అందువలన జామూంధ్రరాజులపై స్వయముగా దండెత్తిపోవుటకు వలనులేక అందులకు తగినవారినిగానక పదునొకండేండ్లూరకొనవలసివచ్చెను.

ఇట్టియపూర్వసమయమున నాటిరాజకీయపరిస్థితుల చక్కగ గ్రహించి పెద్దాపురసంస్థానమునుండి రాజ్యాంగవేత్తయు వీరుడునగు రుస్తుంఖాను బయలుదేరి సంకల్పసిద్ధికొఱకు నిజామునాశ్రయింపననుచరయుతుడై హైదరాదునగరమును బ్రవేశించెను. ఇది పూర్వగాథ: ఉత్తరగాథ యీ దృశ్యకావ్యముననే వర్ణింపబడినది.

పెద్దాపురసంస్థానచరిత్రములో నీకథాభాగము మిక్కిలిప్రసిద్ధికెక్కియున్నది. రుస్తుంఖాను పెద్దాపురరాజకుమారులనిరువురను మోసముచేసి తన పటకుటీరమునకురప్పించి చిత్రవధగావించి (1734 సంవత్సరములో) కోటను స్వాధీనముచేసికొనుటయు రాఘవమ్మదేవిగారంతఃపురస్త్రీలతో అగ్నిప్రవేశముగావించుటయు సోమిదమ్మగారు బాలరాయజగపతిరాజుగారిని తంత్రముచే చెఱదప్పించి పూసపాటివారికొప్పజెప్పుటయు కథలుగాజెప్పుకొని యీప్రాంతముల కంటదడివెట్టనివారులేరు. కృష్ణా, గోదావరి, విశాఖపట్టణముమండలములయందు, ముఖ్యముగా గ్రామములలో, నీకథ మిక్కిలిప్రచారములోనున్నది. దేశాభిమానస్వాతంత్ర్యగౌరవసంపన్నులై ప్రజాక్షేమైకతత్పరులై ధీరోదాత్తలక్షణులై ఆంధ్రసామ్రాజ్యపాలనాధురంధరులై యశశ్శరీరులైన వత్సవాయవంశప్రదీపకులవీరచారిత్రము లేయాంధ్రుని హృదయమును రంజింపజేయవు? అట్టివారిపతనమున కెవ్వానికన్నులు చెమ్మగిల్లవు?

ఈనాటకమును నేను చరిత్రమునననుసరించి వ్రాసినప్పటికిని స్వాతంత్ర్యమునువహించి కొన్నియెడల మార్పులుగావింపసాహసించితిని. కవియొక్కపని కేవలము చరిత్రమును తుచతప్పకుండ మక్కికి మక్కి వ్రాయుటగాదు. కాలానుగుణ్యముగ పాత్రానుకూలముగ స్వభావానుసారముగ నాయాభాగములననుసరించి అసందర్భ, అస్వాభావిక, అనౌచిత్యములను రంగస్థలమునకయోగ్యములైనవానిని చరిత్రాంశములైనను పరిత్యజింపవలయును. రసపోషణకై కొంతకల్పింపవలయును. లోపములయుధాయోగ్యముగా పూరింపవలయును. చరిత్రకారుడట్లుగాక యెట్లున్నదట్లువ్రాయవలయును. ఇదియే కవికిని చరిత్రకారకునకునుగలభేదము

మఱియు నేటిపాఠకులకుగాని ప్రయోక్తలకుగాని చదువరులకుగాని యక్కరలేని యర్థానుస్వారనియమమును పాటింపక ధ్వనిప్రధానమగుపట్టులమాత్రముపయోగించితిని.

నాకథారచనమునకు మహారాజరాజశ్రీ శ్రీ వత్సవాయి రాయజగపతివర్మగారి "పెద్దాపురసంస్థానచరిత్రము"ను బ్రహ్మశ్రీ కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రిగారి "పెద్దాపురసంస్థానచరిత్రవిమర్శనము"ను ముఖ్యాధారములు. చిరకాలపరిశోధనాఫలితముగ నీచరిత్రగ్రంథములు రచించి దేశమునకును మావంటికావ్యకర్తలకును మహోపకారమును గావించిన నీయిరువురు మహనీయులకు కృతజ్ఞతాభివందనములర్పించుచున్నాను.

శ్రద్ధానురాగములతో నీకావ్యమును సంస్కరించి కావ్యమునకు వన్నెవెట్టిన పండితకవులు, కాకినాడ పి. ఆర్. కాలేజీప్రధానాంధ్రోపాధ్యాయులునగు బ్రహ్మశ్రీ శృంగారకవి సర్వారాయడుగారికిని యు

క్తమగుమార్పులనూచించి నాకుహితమొనరించిన కవివర్యులగు నామిత్రోత్తములకును, నాట్యాచార్యులకును, ఈగ్రంథమందలి మూడుఛాయాపటములను గ్రహించుటకువలయు సౌకర్యములన్నిటినిగావించి నాకత్యంతముదోడ్పడిన శ్రీఆంధ్రసేవాసంఘము, కాకినాడ,వారికిని పదునారు నెలలక్రిందటనే వ్రాయబడిన యీనాటకము నిప్పటికి ముద్రించుటకుకారకులైన నాహితవర్యులు శ్రీమాన్ కిళాంబి కృష్ణమాచార్యులుగారికిని నేనంజలిగూర్చుచున్నాను.

* ఈగ్రంథముయొక్క ముఖపత్రముపై చిత్రింపబడిన "చిహ్నము వత్సవాయప్రభువులు సరిహద్దుటాలు మున్నగువానిపై జిత్రింపించిన రాజచిహ్నమైయున్నట. "జగపతిరాజు" అను శబ్దములయాద్యక్షరసమ్మేళనముకలదైయున్నది. మొత్తమున శ్రీకారముకలదై శ్రీజగపతిరాజను భావమునిచ్చునదియైయున్నది."

దైవకృపచే నేను వ్రాయగలిగినదేమో వ్రాసితిని. నాప్రయత్నమునందెంతవరకు కృతకృత్యుడనైతినో తెలుపుభారము సహృదయులగు పాఠకమహాశయులపై నున్నది. దీనిని ప్రకాశింపజేయుభారము సమర్థులగు ప్రయోక్తల భుజస్కంధములందున్నది.

గాంధీనగరము,
కాకినాడ,
5-10-1928.

బుద్ధవరపు పట్టాభిరామయ్య.

* పెద్దాపుర సంస్థానచరిత్రవిమర్శనము, పుట 371.

# పెద్దాపురముముట్టడి.

## పూర్వరంగము.

సూత్రధారుడు—(ప్రవేశించి సభ్యులవంక దిరిగి)

గతులతివక్రతం దనరగా, గ్రహదుష్టులు చుట్టుముట్ట, దు
ర్మతమున దాకవచ్చిన యరాతిబలంబుల త్రుళ్ళడంచి యే
క్షితిపతులీవసుంధరను సుఖింపగ నేలుచునుందురా జగ
త్పతుల ప్రతాపతేజముల వశ్యమునిచ్చుత మీకు భద్రముల్ !

సభాస్తారులగు నో మహాజనులారా !

సీ. ప్రాచీనతమ భానువంశాబ్ధిచంద్రులై
ప్రఖ్యాతిగాంచు భూపాలవరులు
శ్రీకాకుళముదొట్టి కృష్ణావగాసీమ
గలభూమినేలిన క్షత్రవరులు
నిఖిలశాత్రవధారణీశాటవినిగాల్చి
హాసికెక్కిన మేదినీశవరులు
సర్వప్రజాసౌఖ్య సంవర్ధనంబుగా
రాజ్యమేలిన మహారాజవరులు

గీ. వైభవపురందరులు మన వత్సవాయ
జగపతులు ! వారిపావనచరితమిపుడు

తమ సమక్షంబునందు బ్రదర్శనంబు
సలుపఁబూనితి మత్యంతసాహసమున !

కావున, సావధానచిత్తమున గ్రహింతురుగాక ! వీరరసప్రధానమగు నీనవనాటకమును ప్రదర్శించుటకుముందు కృతికర్తయగు బుద్ధవరపు పట్టాభిరామకవి తనవాక్యములుగా తమకిట్లు విన్నవింప నాకాదేశించి యున్నారు:—

మ. పరిపూర్ణంబగు పాండితీగరిమసంపాదించుటన్ గాదు గా
ని, రసజ్ఞానుల సేవచేయుటను దీనిన్ వ్రాసితిన్ నేర్చిన
ట్లు, రసోదంచితమై కథాసరణి యెట్లో మీకు హర్షంబుచే
కుఱగాఁ జేసిన నాపరిశ్రమకు కల్గున్ సార్థకత్వంబొగిన్.

ఉ. నాకవితాకుమారి యెటునాట్యము సల్పిన నేమి కాని, ము
న్నే కమనీయరాజ్యము మహేంద్రపురంబన జాలి దివ్యసౌ
ఖ్యాకరమై, విరోధిజనకంటకమై వెలుఁగొందె నట్టి య
స్తోకమహీమహేంద్రుల యశోవిమలామృతమింతగ్రోలరే !

ఉ. మీరువిమర్శకాగ్రణులు మీరువిమర్శనచేయబూన నె
వ్వారల కావ్యరాజము లువాసికినిల్చును ? గాన మీమదిన్
గౌరవభావమూని తమకంబునఁగాంచితిరేని నాకథా
ధారిణి మాకునింపగు కుతూహలమున్ గలిగింపకుండునే !

ఇంకనే నేగి కోటాలోపమున హైదరాబాదు రాజవీధినిబడి అనుచర ముఖ్యుడగు రసూల్ ఖానుతో సంభాషించుచువచ్చు రుస్తుంఖానుని ప్రవేశపెట్టెదను.

(నిష్క్రమించును.)

# ఈ నాటకమునందువచ్చు పాత్రములు.

—: పెద్దాపురమువారి పక్షమున: —

1 కలిదిండి రామరాజు—మొగల్తూరుప్రభువు
2 నూజవీటి సుబ్బన్న—నూజవీటిప్రభుబంధువు
3 వత్సవాయ తిమ్మజగపతిరాజు—పెద్దాపురాధీశ్వరుడు
4 బలభద్రరాజు—తిమ్మజగపతితమ్ముడు
5 రావు (వేంకట) కృష్ణరాయుడు—పిఠాపురముదొర
6 చల్లా రాజన్న—దళవాయి
7 నూరుద్దీన్‌ఖాన్—......
8 కొంపెల్ల సుబ్రహ్మణ్యసోమయాజి—పురోహితుడు
9 పూసపాటి విజయరామరాజు—విజయనగరము రాజు
10 వత్సవాయ రాఘవరాజు—రాజబంధువు
11 రాయజగపతిరాజు—తిమ్మజగపతికుమారుడు (ఏడాదిబాలుడు)
12 రాఘవమ్మాదేవి—రాజమాత
13 రామయ్యమ్మ—తిమ్మజగపతిధర్మపత్ని
14 లక్ష్మీసోమిదమ్మ—సోమయాజిగృహిణి
15 గౌరి—దాసి
16 సేవకుడు
17 ద్వారపాలకుడు
18 సైనికులు

—: రుస్తుంఖాను పక్షమున: —

1 రుస్తుంఖాన్—రాజమహేంద్రవరము సర్‌లష్కర్

2 రసూల్ ఖాన్ — ముఖ్యసర్దార్

3 ఇబ్రహీంఖాన్ — సర్దారు

4 కరీంఖాన్ — .........

5 లోడీఖాన్ — కారాగారరక్షకుడు

6 గౌస్ — ............

7 మొదటిచారుడు

8 రెండవ ......

9 మూడవ......

10 సేవకుడు

11 సైనికులు

—:అన్యులు: —

1 నైజామ్ — ఉల్ — ముల్క్ — గోలకొండసుబేదారు

2 అన్వర్దీన్ఖాన్ — కళింగసర్కార్ మర్లమ్కర్

3 దూత — నైజాము రాయబారి

4 సేవకుడు — నైజాము సేవకుడు

స వ ర ణ.

సుబ్బన్న గారనుటకుమారుగ సుబ్బరాజుగారని యీ గ్రంథమం తటను నుపయోగింపబడినది. చదువరులీపొరపాటును సవరించుకొన ప్రార్థితులు.

బు. ప. రా.

# సవరణపత్రిక.

| పుట. | పంక్తి. | ప్రమాదములు. | మార్పులు. |
|---|---|---|---|
| 1 | 7 | విక్రమోద్ధత | విక్రమోద్ధతి |
| ,, | ,, | శాత్రవవీర | శాత్రవుడైన |
| 2 | 12 | మహాగాష్ట్ర | మహారాష్ట్ర |
| ,, | 13 | సర్వస్వము | సర్వస్వమే |
| ,, | 14 | న్నొక | యొక |
| 5 | 5 | పడు | పను |
| 7 | 5 | నఱుగుదెంచునె | నరుగుదెంచునే |
| ,, | 20 | జూపినాడని | జూపువాడని |
| 11 | 8 | ఘాతంబులన్ | ఘాతంబుతో |
| 15 | 4 | మనమ్మైడె | మనమ్మైథై |
| ,, | 20 | వెట్టిలైతి | వెట్టులైతి |
| 16 | 8 | వలము | వలన |
| 20 | 16 | పృథ్వీశ్వరుండు | పృథ్వీశ్వరుండు |
| 36 | 7 | యుండును. | యుండకూడదా ? |
| ,, | 9 | యుండును. | యుండరాదా ? |
| 46 | 2 | రఃస్తు — | రఃసూ — |
| 61 | 4 | విజనగరా | విజయనగరా |
| 80 | 3 | విజయరామరాజూ | విజయ్ రామ్ రాజూ |
| ,, | 9 | సేయుంపుమని | సేయింపుమని |
| 90 | 21 | త్రుంచ | త్రుంప |
| 92 | 9 | నీకొనగుటకు | నీకొనగుట |
| 99 | 25 | ఖడ్గములొనగి | ఖడ్గములొనగిన |
| 112 | 2 | నిటు | నిట్లు |

# పెద్దాపురముముట్టడి.

## ప్రథమాంకము.

1. రంగము — హైందరాబాదునందొక రాజమార్గము.

[రుస్తుంఖాను, రసూల్ ఖానులు వీరోచితవేషములతో ప్రవేశింతురు.]

రుస్తు — (మార్గమున బోవుచు తటాలున నాగి వెనుదిరిగి రసూలుఖానుతో) రసూల్, ఏమంటివి ?

చ. ఇరువదియైదువత్సరములేగినవాఁడు, సమస్తవిద్యలన్
పరిణతిగన్నవాఁడు, నృపచర్యలయందుఁ బ్రహితుండు బాలుఁడే ?
నిరుపమ విక్రమోద్ధత తృణీకృతశాత్రవవీర రుస్తుమా
సరణి కృతఘ్నుఁడైన తనుజాతుని ధూర్తత సైపఁజాలునే ?

రసూ — ప్రభూ, సూరుద్దీను సహజముగా బుద్ధిమంతుఁడు- చిరకాలమునుండి పెద్దాపురాధీశ్వరులక్రింద పనిచేయుచు వారితో కలసి మెలసి యుండుటచే వారికిహానిగూర్చుటకిష్టపడు సంకోచించు-

రుస్తు — సంకోచింపనీ మాననీ, వానిసహాయముతో నాకింక ప్రసక్తి లేదు. ఆదినములంతరించినవి. వాఁడు తనయుఁడు కాఁడు- నేను తండ్రినిగాను. పెద్దాపురాఖండసామ్రాజ్యము కనుసంజ్ఞచేసినమాత్రమున వచ్చి యొడిలోపడుటకు సిద్ధముగనున్నప్పుడా నిర్భాగ్యుఁడు నాప్రయత్నములకు సహాయపడక పోవుటయేగాక "పెద్దాపురసంస్థానమున కెగ్గుతలపెట్టితివేని నీయైశ్వర్యములనన్నిటిని రాఘవమాంబాదేవిగారికెఱింగింపక మాన" నని నన్ను భయపెట్టకపోయినచో అయిదువేలశ్వదళమునకును, ఏడేండ్లుగజదళమునకును ప్రధానవాహినీపతినై 'కోట' యున్న కోటినుండని సమకూర్పజాలు గుణవిశేషముండి యింతకాలమువరకు వత్సవాయ వారిని పదచ్యుతుల గావించి పెద్దాపురసామ్రాజ్యసింహాసనమున సూరుద్దీనుని గూర్చుండబెట్టి గాద్యసప్తకము సరిథయోల్బణముగ ద్రిప్పుచు నాంధ్రరాజుల

గుండెలలో గాలమునై యుండకుండునా? నేను నేను గజపతాధిపత్యమును త్యజించి యిప్పుడీ హైదరాబాదు వచ్చి కార్యసాధనముకొఱకు నైజాము మీఁద నాధారపడవలసిన దుర్గతి వచ్చియుండునా? కానిమ్ము!—నాఁడు నన్ను బెదిరించి నాప్రయత్నముల కడ్డువచ్చుటలో విశేషములేదు. రేపు నేను గోలకొండ సైన్యముతో పెద్దాపురము కోటను ముట్టడించి భీభత్సగతి వత్సవాయవంశజుల నా నిశితకృపాణధారకు బలివెట్టునప్పుడు నూరుద్దీనేమి చేయునోచూచెదను.

రసూ—ఇంతకును నైజాము తమకు సైన్యాధిపత్యము నిచ్చునను నమ్మకమేమున్నది?

రుస్తు—రసూల్, ఈవిషమసమయమున నైజామున కంతకంటెగత్యంతరమేమున్నది?

మ. ఒకవంకన్ మహారాష్ట్రనాయకకరేణువ్యూహంబు, వేరొక్కచో
సకలోగ్రాకృతి పాదుషాపులియు, నైజాంరాజ్య సర్వస్వము
న్నొకగ్రుక్కన్ గొననుండ నెట్టితఱుగర్వోద్రేకులౌ నాంధ్రసిం
హకిశోరంబుల బిట్టణంచికొనగా నాశించు భూశుల్కమున్?

ఈయద నెఱింగియే-

సీ. ఎన్నాళ్ళనుండియో పన్నునీయక యున్న
ఆంధ్రరాజ్యులు దండనార్హులనియు
విభవ దేవేంద్రులై వెలుగుచుండిన యాంధ్ర
రాజులు భుజబల తేజులనియు
ఇచట రాజమహేంద్రి మచట కళింగంబు
నేలుట కన్వరుచాలడనియు
ఆంధ్రరాజుల గర్వమణచి కప్పముగొన
గలబలశాలి గావలయుననియు
వ్రాసి నైజామునకు బోధ జేసి విషము
తలకు నెక్కించి నాసమున్నతను చెప్పి

నాడ, నికనాంధ్రవీర భూనాయకులను
గాచి అంపాన బెట్టుకాలంబు రాదె ?

రసూల్, రసూల్, వత్సవాయువారి వైభవముల దలచుకొనిననా హృదయము దహించుకొని పోవుచుండును.

గీ. ఆ విలాస వనాంతర హర్మ్యపాళి
ఆమహారత్న ఖచితసింహాసనంబు
ఆ సువర్ణమణీ మయానంతదివ్య
భూషణంబులు నామది పొంగజేయు.

కట్టా ! పదునొకండేండ్లయ్యె యుద్దండరాయ జగపతిరాజు పరలోకమునకు బ్రాతకాపైయుండ, నాపిదప రాఘవమ్మాదేవి, వితంతువు ! రాజ్యపాలనముచేయుచు సంస్థానమును శాసింపదగిన నన్ను శాసించుచుండ—ఆయబల—ఆకాఫరుసేవలో, ఛీ ! కూటికి గుడ్డకు నైగొల్చినదినముల దలచు కొనిన నాలోనాకే లజ్జవొడముచున్నది. ఎఱిగియెఱిగి యీహైందవులను సేవించిన కలుషమునెల్ల క్షాళనము చేసికొందును ? అయ్యో ! ఇంతకాలమునుండి నేను మహమ్మదీయుడననియు వారు కాఫరులనియు గుఱుతింపక మసలిన నా యజ్ఞానమునేమని నిందించుకొందును ? వారిపైపైయాదరణములకు మాయానునయవాక్యములకు నోడలెఱుగని శివముతో వారిని గొల్చిన దినంబులెట్టి దుర్దినములు ! కానిమ్ము !—ఓపెద్దాపుర సామ్రాజ్య లక్ష్మి ! యింకనిన్ను చేజిక్కించుకొనకుండ విడువను !—విడువను !

ఉ. కాలువగట్టరక్తము, ప్రకంపమునొంద నిలాతలంబు, నీ
పాలకులన్ రణావని కృపారహితంబుగ నెల్లసేనతో
గూలిచి, నేటికాంధ్రులను గొల్చెడు భారముదీర్చి, యింక నీ
కేలును పట్టువాడ నృపకేసరు లద్భుతమంది చూడగన్ !

రసూ—ప్రభూ, నైజామువారి దర్బారుభవనమిదియే. దర్బారువేళయైనట్లున్నది, దయచేయుడు.

(ఇరువురునిష్క్రమింతురు.)

2 రంగము—హైదరాబాదులో నైజామ్—ఉల్-ముల్క్ దర్బారు.

[నైజామ్-ఉల్-ముల్క్ సింహాసనమునందుండును. విలాసినుల నృత్యగీతానంతరమున.]

సేవ—(ప్రవేశించి) జయము ! జయము ! సర్కార్ ! పెద్దాపురమునుండి రుస్తుంఖాన్ అనునొక మహమ్మదీయ వీరుడు హుజూర్ దర్శనమునకై వచ్చి హాజారమున వేచియున్నాడు.

నైజా—పెద్దాపురము నుండియా ? వెంటనే ప్రవేశపెట్టుము.

సేవ—అచ్ఛా. (నిష్క్రమించును.)

[రుస్తుంఖాన్ ప్రవేశించును.]

రుస్తు—బందగానే అలీఅస్సలామాలేఖుమ్ !

నైజా—(సలామునందుకొని స్వగతమున) సమర్థుడే! (ప్రకా) రుస్తుంఖాన్, నీవువ్రాసిన విషయములన్నియు సత్యములేనా ?

రుస్తు—చిత్తము.

నైజా—నీవుచెప్పవలసిన దింకేమైన గలదా ?

రుస్తు—చిత్తము.

క. అదిగాక, పెద్దపురమున
పదిలెంకేశులు వసించి పార్థివవరులన్
మదికెక్కనట్లు గొల్చుట
నెదిరి రహస్యముల నెల్లనెఱుగుదు నధిపా !

నైజా—పెద్దాపురము రాజుల కింత యనువర్తనుడవై యుండువాడ విప్పుడు వారికేల ద్రోహముసేయ సమకట్టితివి ?

రుస్తు—సర్కార్, ఏమనిమనవిచేయుదును ! ఇప్పుడు పెద్దాపురము సంస్థానమును రాఘవమ్మాదేవి యను నొకవితంతువు యుక్తవయస్కులగు కొమరులు లిద్దఱున్నను, సర్వాధికారములు తానే

వహించి పాలించుచున్న విషయము తామెఱుగనిది కాదు. ఆమెకు మహమ్మదీయులన్న కట్టడు. స్వామిభక్తిపరాయణులగు సేవకులను కులభేదమాత్రమున కంటగించుకొను నదేటి పాలకురాలు? ఇదిగాక— ఊరకొన్నచో—నేటేట నాలుగులక్షల కరకువరహాలపన్ను చెల్లింపవలసిన ఆంధ్రసామంతరాజులు తమకు పదునొకండేండ్లనుండి పన్ను చెల్లింపకపోవుటయేగాక శరత్కాలానంతరమున గోలుకొండపై దండయాత్రకు రానున్నారు. స్వజాత్యభిమానప్రేరితుడనై గోలుకొండకు రానున్న మహోపద్రవమును దిలకించి మహమ్మదీయులన్న మండిపడు తెనుగురాజుల కూడిగము సేయుచు గూరుచుండ జాలక, తమ సేవచేయుచు గోలకొండ రాజ్యరక్షణార్థము శక్తికొలది పాటుపడవలయునను కుతూహలముతో పెద్దాపురమునందలి గజదళాధిపత్యమును వదలుకొని తమ సన్నిధికేతెంచితిని.

నైజా—మంచిది. నీజాతీయాభిమానమునకు మెచ్చితిని. మాకిప్పుడు మహారాష్ట్రవిజృంభణము వలన ప్రతినిమిషము నొత్తిడి కలుగుచుండుటచే నీకిప్పుడేబది వేలకంటె నెక్కుడు సైన్యమిచ్చియుంపజాలను.

రుస్తు—సర్కార్, క్షమింపవలెను; నాకు నలువదివేలసైన్యమే చాలును.

నైజా—సెబాస్! మఱియుమంచిది. అన్వర్ఖానుని తొలంగించి నిన్నిప్పుడే రాజమహేంద్రవరము సర్కారునకు షర్లష్కర్‌గా నియమించుచున్నాను. (ఆజ్ఞాపత్రమును వ్రాసియిచ్చి) మహమ్మదీయుడసత్యమాడడను విశ్వాసముచే నంతగ విమర్శచేయకయే నీవాక్యముల నమ్మి నిన్నిప్పుడు పేష్కసు వసూలుచేసికొని వచ్చుటకు నియోగించుచున్నాను. కాని యిది జ్ఞప్తియందుంచుకొనుము. ఆంధ్రరాజులతోడి చెలిమియే మనకు ప్రధానముగాని విద్వేషముకాదు.

ముందు సామమున కార్యసాధనోపాయము నాలోచించిన పిదప గాని యాహవ మొనర్పకుము. మాకనమ్మతమగు విధానమున నడచితివేని నీశిరము ఖండింపబడును.

రుస్తు—సర్కార్, తమ యాజ్ఞాక్షరముల బాలింతునని యిదే కత్తి ముట్టి బాసజేయుచున్నాను.

నైజా—మంచిది. సైన్యములగొని యింక నీవు పోవచ్చును.

రుస్తు—చిత్తము. (సలాముచేసి నిష్క్రమించును)

నైజా—(సభవంకదిరిగి) ఈరుస్తుంఖాను ప్రయత్నములచే నీ పదునొకండు సంవత్సరముల కప్పము నాంధ్రరాజులు మన కర్పించిన చో నింక నీమహారాష్ట్రుల క్షణక్షణ విజృంభణముల కలజడిపడ వలసిన పనియుండదు; ఆంధ్రులవలన భయము కూడ నుండదు.

(తెరపడును.)

3 రంగము—పెద్దాపురము కోటలోని రాజమందిరము.

---

[తిమ్మ జగపతిరాజు బలభద్రరాజులు కూర్చుండి యుందురు.]

బల—అన్నా, రుస్తుముఖా నెంతదార్జన్యమున కొడిగట్టినాడు!

సీ. ఎదురైన యాంధ్రుల హింసించి వారల
తలలతో గోపురంబులను గట్టి
పతులచెంగట నున్న భామలచెఱగొని
పలుబాములను బెట్టి భంగపఱచె
కనులపండువుసేయు గ్రామంబులను గాల్చి
కొంపలజొరబడి కొల్లగొనియె

కాలిక్రోలది బాఱు కనుగందులను బట్టి
ఖండించి మొంశెముల్ గాలఁజిమ్మె
గీ. నాటిమొదలింత వరకు నిష్వేటబ్రితికి
ఏమి! పెద్దాపురీరాజ్యమే హరింప
నలుగు దెంచునె నేను ఖలాత్మ్ముఁ డితఁడు
కారణంబును ధర్మంబు గానకుండ!

తిమ్మ—బలభద్రా, దురాశాపీడితులకు కారణము-ధర్మము గావలయునా?

గీ. ఘోరపన్నగమైన నకారణముగ
హాని చేయదు జనులకు, గాని మాన
వుండు స్వార్థపరుండైన చెండకున్నె
తనయునైనను సతినైన తల్లినైన?

బల—ఇంతకు, నిట్టివక్రహృదయుని గొలువులో చేర్చుకొనుట అమ్మగారిదే దోషముగాని వానిది కాదు

తిమ్మ—పాపముశమించుగాక! అమ్మగారి దోసమిందేమి యున్నది?

సీ. అశ్వ శిక్షాతంత్రమాద్యంత మెఱిగిన
జగజెట్టి యితఁడని సరసఁజేర్చి
సమరకళా పరిశ్రమయందు చాతుర్య
మును జూపినాఁడని వినుతిజేసి
అసమాన భక్తి నిరంతరంబును గొల్చు
విశ్వాసి యని చాలప్రేమజూపి
విక్రమంబున బులివేటలో పేరెన్న
కనుగాంచినాఁడని గౌరవించి
గీ. అమ్మ సర్వవిధమ్ముల నాదరించె
కాని, వీఁడిటు విశ్వాసహీనుఁడగుచు

తిన్న యింటి వాసంబుల నెన్న ననుచు
నించుకంతైన యామె యూహించెనయ్య!

బల—ఔనుకాని—యీరుస్తుముఖానుని తాకనరిగిన మొగ ల్తుర్తి నూజివీటి ప్రభువుల ప్రయత్నము లెంతవరకు సఫలము లైనవో!

తిమ్మ—రామరాజు సుబ్బరాజుగార్లింత సులభముగా రుస్తుంఖాను దళమున జంతురనుటకు సాధ్యముగాకున్నది. ఏమూ ?

మ. ఘనసామ్రాజ్యరమాకరగ్రహణకాంక్షాలోలుడై వచ్చు దు
ర్జనుడీతండదరు దేర డిచ్చుటకు భాస్వత్స్థైర్యసంయుక్త వా
హినులన్ దోడ్కొనికాని, యాతడుమ టెంతే వంచనవ్యూహముం
దున బ్రజ్ఞాఢ్యుడు వీరలెట్లుచటశత్రువ్యూహమున్ జీల్తురో !

బల—అన్నా, నిన్న మొన్నటిదాక మన యుప్పాదిని చెడబెరిగిన యీతని శక్తియుక్తులు మన మెఱుగనివా ? వీని మదమణచుటకు రామరాజు సుబ్బరాజుగార్ల బాహుపటిమ చాలదా ? అనవరత విజయలక్ష్మీసముపార్జిత యశోధురంధరులగు నీయాంధ్ర వీరవరేణ్యులకే నాడు రుస్తుంహతకుని చేతులలో పరాజయమూ ?

తిమ్మ—అట్లుకాదు, చిన్న పామునైనను పెద్దకఱ్ఱతో గొట్టవలయునుస్మమా !

బల—నిజమేగాని, తగినబలము తోడులేకుండుటచే వారి నాతడు విజయవాడ కడ పరాజితుల జేయ జాలినను పెద్దాపురమునందడుగు వెట్టినచో ప్రాణములతో బోగలడా ?

సీ. ఫాలాక్షుడెదురైన బట్టి పల్లార్చెదు
ప్రథిత బలాఢ్యులు రాచవారు
ఎట్టి వ్యూహమునైన నిట్టె చీల్పగజాలు
వీరవరేణ్యులు వెలమవారు

కరమున ఖడ్గంబు గ్రాలభండనభూమి
కదలనిధీరులు కమ్మవారు
శరపరంపరలచే శత్రుమస్తకముల
గూల్చు ప్రవీణులు కోయదొరలు
గీ. బ్రాహ్మ్యసుక్షాత్ర రాజితుల్ బ్రాహ్మణులును
వీరవర్యాలి కెందఱో వేనవేలు
బ్రతికియుండగ పెద్దాపురంబునందు
కాలుమెట్టునె రుస్తుముఖానుడన్న !

( తెరలోకలకలము. )

తిమ్మ—(విని) ఏమీకలకలము ? అదిగో వీరవరేణ్యులగు రామరాజు సుబ్బరాజుగార్లు ! ఏమిచెప్పుదూ నిరుత్సాహులై వచ్చుచున్నారు ?

[రామరాజు సుబ్బరాజులు వీరోచితవేషములతో ప్రవేశింతురు.]

బల—దయచేయుడు.

రామ | చిత్తము. (కూర్చుందురు.)
సుబ్బ |

రామ—తిమ్మజగపతిరాజా, నిజమే, రుస్తుంఖానునిచే పరాజితులమై వచ్చిన మాకు నిరుత్సాహముగాక-ఉత్సాహమెక్కడిది ?

సుబ్బ—మహాసైన్యసమేతుడగు రుస్తుమును మేమేలూరుకడ నెదుర్కొన—

బల—(ఆశ్చర్యక్రోధములతో) ఏమి! రుస్తుము—కృష్ణానదిని దాటి వచ్చెనా ?

తిమ్మ—అయిన మీరాతని విజయవాడకడనే దాకక యింత వరకేల రానిచ్చితిరి ?

సుబ్బ—నాయనా, సముద్రమున కానకట్ట నెవ్వఁడుకట్టగలఁడు?

రామ—దానికేమి ? అదిసహజమే ! అందాశ్చర్యములేదు. మానవమాత్రుఁడగు శత్రువునెట్లయిన సాధించియుందుము గాని దైవాకృతినున్న యీప్రకృతియే మాతో విరోధించిన నేమి చేయుదుము ?

సీ. ఘోరవృష్టిగతాన దూరంబునందున్న
రాణువ జేర్ప నాలస్యమయ్యె
ఈ విరామములోన నెటులో కృష్ణను దాటి
యేలూరికడ కతఁడేఁగుదెంచె
ఇరువాగు లచ్చట నెదురైనపిమ్మట
పంపినారము రాయబారి నొకని
ఆతఁడు దానిచే నధికరోషంబున
నాలమే ప్రకటించె, సంతలోన
గీ. నుభయసైన్యము లొఱసిన యుద్ధమచట
భీషణమయ్యెను మననాల్గువేలదళము
ఖాను పదివేల దళమును గసిమసంగి
యవని కొఱఁగెను కట్ట ! ఏమనివచింతు !

సుబ్బ—తిమ్మజగపతి రాజా, మేము ప్రాణములతో నిచ్చటకు వచ్చుట తప్ప మాలోపమిసుమంతయు లేదు.

గీ. ప్రాణముల నాసవీడి పోరాడినాము
పన్నవలసిన తంత్రముల్ పన్నినాము
కాని, మాశక్తియుక్తులు వాని పీచ
మడచుటకుఁజాలవయ్యె రవ్వంతయేని.

తిమ్మ—రామరాజా, ఇందు మిమ్మనవలసిన పనియేమున్నది!

ఉ. ఆలము తప్పదయ్యె, సమయంబునకున్ దరిలేవు వాహినుల్
చాలినయన్ని, శత్రువు ప్రచండదళంబులతోడ వచ్చుచే
జాలక కృష్ణదాటె, మనసైన్యములా కడు వేళదప్పి దు
ష్కాలమునందు మార్గనిరిఖానుని, ఎట్లుజయంబు కల్గెడున్?
గతజలసేతు బంధన మింతటితో వదలి

శా. ఇద్ధాత్రీశలమేలు కాంతునిటకుద్వృత్తి న్విజృంభించు నీ
యుద్ధోన్మత్త మదేభమున్ చటులఖడ్గోదగ్రఘాతంబులన్
ఔద్ధత్యంబణగించుటో మనకు కార్యంబట్లు గాకిప్పుడే
సిద్ధంబాటయొ సంధికింతమదిలో జింతించి వాక్రువ్వరే ?

బల—అన్నా, మన రాజ్యమును కబళింప నరుదెంచు దురాత్మునితో సమరమా సంధియా యను విచారణమేల ?

గీ. నిన్న నేలూరికడ దాకి నిఖిలసైన్య
తతుల సమయించి విజయమదంబుతోడ
కన్నుగానని రుస్తుముఖాను వేడ?
సంధిమనతోడ నెఱపెను నరణియేడ ?

ఈదుష్టాత్ముడొకవేళ మనతో సంధిగావించుకొన రాయబారమంపినను ఈతనితో నెయ్యమునను౦డుట కియ్యకొని సూర్యవంశమునకు మాయని మచ్చదెచ్చుటకంటె నీతని మరల ఢీకొని యందు విజయమును గొనవలయు, కాదేని వీరస్వర్గమున కేగుటయే గౌరవము.

రామ—సెబాస్ ! బలభద్రా ! సెబాస్ !

ఉ. పేరుమహమ్మదుండు తనచేతుల నొక్కసువర్ణఖడ్గ మిం
పార నొసంగువేళ తనహస్తమునిమ్మగనందె, నట్టి దు
ర్వార ప్రతాపు తిమ్మపతి వంశమునందుదయించి వంశపున్
గౌరవమొప్ప బల్కితివి క్షాత్రముదీప్తివహింప భార్గవా ।

తిమ్మజగపతిరాజా, మనమీ విషయమును అమ్మగారికి తెలుప కుండ నెట్లు స్వతంత్రించి కార్యనిర్ధారణముచేయగలము?

తిమ్మ—నిజము, చక్కగాజ్ఞప్తికి దెచ్చితిరి. దయచేయుడమ్మగారియభ్యంతరగృహమునుగూర్చి పోవుదము. ఇంతలో మన యాశ్వికసైన్యాధ్యక్షుడు చల్లా రాజన్న పిఠాపురమేగి పీఠికాపురాధీశ్వరులగు రాజా రావు వేంకట కృష్ణారాయనింగారిని కూడగొనివచ్చి మనల జేరగలడు. బలభద్రా, గురుదేవుడు కొంపెల్ల సుబ్రహ్మణ్య సోమయాజిగారిని గజదళాధ్యక్షుడగు సూరుద్దనుని కూడ మనయాంతరంగిక సభకాహ్వానింపుము.

బల—చిత్తమన్నా!

(అందఱొక వంకను బలభద్రుడొకవంకను నిష్క్రమింతురు.)

౪ రంగము.—అంతఃపురము.

---

[రామయ్యమ్మదేవి జగపతిని ఉయ్యాలలోనుంచి యూచుచు జోల పాడుచుండ గౌరి తమలపాకులందించుచుండును.]

[రాఘవమ్మాదేవి ప్రవేశించును.]

రాఘ—రామమ్మా, బాబింకను నిదురింపలేదా?

రామ—(లేచి మందహాసముతో) ఈజగపతి కింతలో నిదుర వచ్చునలవాటున్నదా? మీరు రావలెను—జోలపాడవలెను—లేకున్న పోరుమాని నిదురించునా?

రాఘ—(హాసముతో బాలునివంకదిరిగి) బాబూ, నామీద నీకింత ప్రేమయెందులకోయి? జోలపాడెద నింకనిదురింపుము. (జోల

పాడి) జగపతికప్పుడే నిద్రవచ్చినది. (జగపతివంకజరిగి) బాబూ, నీతండ్రివలెనే నీవును నామాటయన్న నిప్పటినుండియు నెంతయాదరము చూపుచున్నావోయి !

గీ. వల్లకీవేణురవముల తల్లిమధుర
గానమున గూడ నిదురింపబూనకీవు
ఔర ! నే జోలపాడినయంత నిదుర
పోవ మనసేల జగపతీ, పోరుమడిగి ?

రామ—అదిగో! అదియే వీనిలోనున్న విశేషము.

గౌరి—చిన్నబాబుగారు మూడుమూర్తుల తిమ్మజగపతిరాజు బహద్దరుగారేనమ్మా. (రామయ్యమ్మవంక చూపుచు) చిన్నమ్మగారెఱుగరు కాని—పెద్దబాబూగారి వయస్సున నిదేరూపము- ఇదే అల్లరి-ఇదే—

(తెరలో "గౌరీ, అమ్మగారేమి చేయుచున్నారు ?")

రాఘు—తాళు-తాళు-గౌరీ, అది పెద్దఅబ్బాయి మాట వలెనున్నది. పోయిచూడుము.

గౌరి—(ప్రక్కకేగి) బాబూ, ఇటు, ఇటు, (విని) చిత్తము. (తిరిగివచ్చి రాఘునమ్మాదేవితో) అమ్మా, ఏలూరినుండి తిరిగివచ్చిన మొగల్తుర్తు నూజవీటిప్రభువులు తమ దర్శనము కొఱకు వేచియున్నారట !

రాఘు—(ఆతురముతో) మంచిది. వారినందఱిని కార్యాలోచనాభవనమునందుబ్రవేశపెట్టుము. నేనిప్పుడేవచ్చెదను.

గౌరి—అట్లేనమ్మా. (నిష్క్రమించును.)

రాఘు—అమ్మా, దుస్తుముఖాను దురాగతము నడపనేగిన యీవీరద్వయ మేమిమొనర్చిరో పోయి తెలిసికొనివచ్చెదను. (ఆశ్చ

ర్యముతో) ఇదేమి! నా కుడికన్ను దరుచున్నదమ్మా, యిది అశుభసూచకముగాదా ?

రామ—అత్తయ్యా, మరణమన్న తృణప్రాయముగా జూచు వీరరఘుకుల క్షత్త్రియ కాంతాశిరోమణులమగు మనకీదుర్నిమిత్తములవలన భయమేల ? సర్వేశ్వర లీలలగుటచే శీతోష్ణ సుఖదుఃఖాది ద్వంద్వములన్నియు మనకు తుల్యములే కాదా ?

రాఘు—సందేహామేమి ? ఆకస్మికముగ నగ్నిజ్వాలలుదరికొని బ్రదికి యుండగనే భస్మముచేయుచున్నను చలింపని యీ రాఘువమ్మ యీనాడీ యశుభసూచకములకు భయపడునా ? (జగపతివంకదిరిగి చిఱునగవుతో) బాబూ, పోయివత్తునా ? మాటిమాటికి నాకీరాజకార్యముల గొడవయే లేకున్న నిరంతరము నీముఖచంద్రుని జూచుకొనుచు నడుగైనకదలకుండ నీచెంతనే యుందునుగదా ! అమ్మా, పోయివచ్చెదను. (ప్రేమతో బాలుని చూచుచు నిష్క్రమించును.)

రామ—అక్కటా ! తెరల మఱుగున బడి యుండవలసిన తెఱవనైపుట్టుటచేగాని—

గీ. ఆడుపులి యట్ల కుప్పించి యాజిరంగ
మందు నరి వీరవరులను మ్రంద జేసి
విజయమున్గాన నాకెంతొ ప్రీతి, యట్టి
యాసలడియాసలయ్యె నే నతివనగుట !

(తెరపడును.)

## ౨ రంగము— కార్యాలోచనా మందిరము.

---

[తిమ్మజగపతిరాజు, బలభద్రరాజు, రామరాజు, సుబ్బరాజు
రాఘవమ్మాదేవి గార్లు యథోచితాసనముల నుందురు.]

రాఘ—(అందఱిని కలయజూచి) పరాజయమాత్రమున మన మధైర్యపడవలసిన పనిలేదు (ఉత్సాహముతో)

గీ. ఎపుడు పెద్దాపురీరాజ్య మపహరించు
పూన్కి రుస్తుము మనకోట ముట్టడించు
నాడె వానికి ఆయువు మూడకున్న
అతనియత్న మాతనితోడ నంతరింప ?

(నిర్వేదముతో) అక్కటా ! కాలవృక్షమెట్టి విషఫలముల నొసగుచున్నది !

గీ. ఎవని నాసోదరుండని యెంచినానొ
ఎవని నారక్షకుండని యెంచినానొ
ఎవని నాయాప్తుడంచు నేనెంచినానొ
వాడె నాకొంప చిచ్చిడ వచ్చువాడె !

(కోపముతో) ఓకుత్సితుడా, కృతఘ్నుడా, రుస్తుం,—

గీ. స్వామిభక్తికి నిర్మల స్వాంతమునకు
నైకమత్యంబునకు స్థానమగుచు దనరు
నట్టి మహితాన్వయంబున బుట్టి ఘోర
రాక్షసుడ వెట్టిలైతి క్రూరా ! దురాత్మ !

కానిమ్ము—రామరాజా, అంత మీరు రుస్తుంఖానుని కేమని సమాధానమిచ్చితిరి ?

రామ—అందులకు మేము:—" మేము ఢిల్లీపాదుషాల యేలుబడిలోనివారముగాని మీ నవీనప్రభువులగు గోలకొండ సుబేదారులకు

తాబేదారులము గాము. ఢిల్లీశ్వరునికైనను మేము పేరునకు సామంతులమే గాని యెన్నడు నొక్కకాసయైన జుమ్మా చెల్లించియుండలేదు. కావున, మేము మీకు పన్ను చెల్లింపవలసిన పని లేదు ; చెల్లింపము. న్యాయవిరుద్ధముగా మీరు రణమున కాయత్తమైనచో నందులకు మేము సిద్ధముగా నే యున్నా" మంటిమి.

రాఘ—(ఆలోచించి) సరే. అయినయిప్పుడు రుస్తుము తన రాజధానియగు రాజమహేంద్రవరము వచ్చినపిదప గదా మనరాజ్యము నపహరింప తంత్రము పన్నుచున్నాడు! అతని వలన నేహానియు బొందకుండునట్లు మనము కాపాడుకొనవలసియున్నది

సుబ్బ—అదిగో, సమయమునకు కృష్ణారాయనింగారును రాజన్నయు వచ్చినారు.

[కృష్ణారాయుడు రాజన్న ప్రవేశింతురు.]

కృష్ణా<br>రాజ } —(రాఘువమ్మాదేవికి నమస్కరింతురు.)

కృష్ణా—(తిమ్మజగపతి నుద్దేశించి) బాబూ, నారాక ఆలస్యమైనదా ?

తిమ్మ—లేదు. సకాలమునకే వచ్చినారు, దయచేయుడు. రాజన్నా, కూర్చుండుము.

రాఘ—కృష్ణారాయ, ఏలూరియుద్ధపర్యవసానమును రుస్తుంఖానుని దురాలోచనలను ఈ రాజన్న వలన తెలిసికొనియే యుందువు- ఇందులకు కర్తవ్యమేమాలోచించితివి ?

కృష్ణ—అమ్మా, శాత్రవసైన్య పరిమితిని తెలిసికొనకుండ నాకేమనుటకును తోచకున్నది. పిఠాపురమునందిప్పుడున్నమట్టునకు రెండువేల సైన్యమును గూర్చుకొని వచ్చితిని. ఇచ్చట తమ ప్రయత్నము లెట్లున్నవి ?

తిమ్మ—మూలబలముగాక యిరువదివేల సైన్యముకంటె ఎక్కువలేదు. ఇంతవరకమ్మగారి యనుజ్ఞలేక మనసామంతుల పిలువనంపలేదు. హస్తముసైన్యము పదివేలున్నట్లు అందలుగారియున్నారు గండుకోలవారు మదనిన్నట్లు మదరాసురాజుగారు చెప్పుచున్నారు.

బల—యుద్ధమేకగత్యమయిన నిర్ధారణమైనచో చిక్కవోలు, గొంతెమూరు, జగ్గంపేట, కిర్లంపూడి, వీరవరము. కత్తిపూడి, కోటపల్లి, తాటిపాక, కొత్తూరు మొదలగు సమీపపు మాఱులనుండియేగాక రామచంద్రపురము, కోరుకొండ, ముమ్మిడివరము, గోపాలపురము, రాజోలు మొదలగు సీమలయందలి జమీందారులనుండికూడ సైన్యములు రావించుకొనవలసియుండును గాన తామిప్పుడే చేయవలసినది తెల్పవలెను.

రాము—(తిమ్మనతో)—రాజానా, ధర్మారావు నూజివీటి కచ్చేరి నగరుకు పోయెను?

జగ—నాగన్నదొరవారు మనసామంతులను సైన్యసమేతులై తమ రాచపురమున కావలెనని జాబులు వ్రాయుచున్నారు.

రాము—(లేచి ముగ్గి) తమ్మరాజా, నా యనుజ్ఞలేని యాలోచన లేల?

తిమ్మ—(ఎదురుగా చూచి) ఇదిగో, గురుదేవుడు సుబ్రహ్మణ్యశాస్త్రులు గారు వచ్చుచున్నారు.

[యుద్ధాభిషేకమున సుబ్రహ్మణ్యశాస్త్రి సమయమున ప్రవేశించును.]

అందరు—(నిలువబడి నమస్కరింతురు.)

సుబ్ర—విజయోస్తు! విజయోస్తు! అమ్మా, మీ యాజ్ఞను బడయకుండ, స్వాతంత్ర్యము వహించి పనిబడిన సమయోచితముగ చెప్పవలసిన యనుగ్రహము నీ కార్యమున నియోగించినది చేసెను. పనియంతయు ముగియకపోయినను; అంతవరకు చెప్పుచుందును.

రాఘు—అయ్యా, యీపీఠము నలంకరింపుడు. మీ సమయజ్ఞత్వమును మేమభినందించుచున్నాము.

సుబ్బి—(కూర్చుండి) ఇదిగో నూరుద్దీను వచ్చినాడు.

[నూరుద్దీను లేఖలతో లేఖనీమషీపాత్రలతో బ్రవేశించును.]

రాఘు—(నూరుద్దీనుతో) అబ్బాయీ రమ్ము.

నూరు—[కూర్చుండి] చిత్తము.

రామ—కృష్ణారాయని సైన్యము రెండువేలును ఏలూరినుండి తిరిగివచ్చిన సైన్యము మూడువందలును పిఠాపురము సైన్యము మూడువేలును నూతనముగా చేర్చుకొన్న సైన్యము తొమ్మిదివందలును కలిసి యేడువేల సైన్యమిప్పుడు సిద్ధముగా నున్నది. రుస్తుంఖానుని పదివేల దళములో ఛావగా మిగిలినదాదాపు తొమ్మిదివేలుండును గాన మన యేడు వేలదళము శత్రుసైన్యమును జయించుట కంతమాత్రమును సందియము లేదు. కాబట్టి యుద్ధమే మనకు శ్రేయము.

సుబ్బి—శయనగృహమున తాచుపామువలె శత్రువు మన రాజ్యమున జొచ్చుచుండ వానిని, తెగటార్పకుండ నూరకొనుచుండుటయు విపత్కరము!

రాఘు—(మందహాసముతో) బలభద్రా, నీవు మాటాడవేమి! రణప్రియుడవగు నీకు కదనమే—

బల—[ఉత్సాహోద్రేకములతో] సందేహమేమి? అయ్యా,—

గీ. ఎదిరి నెదిరించు సామర్థ్యమింత లేక
యింట గూర్చుంట శూరుల కేమి లగ్గు?
విక్రమంబున పగతుర విదళనంబు
చేసి జయలక్ష్మిగొంటయే చెల్లుగాని.

కృష్ణా—తగినంత సైన్యము లేక పరబలాబలములు దెలియక యిదివరకు రామరాజు సుబ్బరాజుగార్లు సలిపిన సమరము చాలదా

మూలబలమున కండగను నిలువవలసిన సేనాపతులైన నిరువురను మనతో గొనిపోయిన మూలబలమునకు ముప్పు కాదా ? అధిక సైన్యము లేనప్పు డెచ్చటికో ముట్టిపోవుటకంటె యిచ్చటనే యుండి శత్రువిచ్చటకు వచ్చిన నెదుర్కొనుట సమంజసము నిరపాయమునగు మార్గము కాదా ? ఒకవంక మనము రాజమహేంద్రవరమేగ మఱియొక వంక శత్రుసేనలు మన రాజ్యమున జొరబడిన—

తిమ్మ— జొరబడిన ?- అంతలో నేమయ్యె ! కృష్ణరాయ, శత్రు బలము వచ్చు మార్గము తెలిసియు నిట్లాడెద వేమి ! ఏడువేల యాంధ్ర వీరు. ఎనిమిదివేల ముసల్మానుదళమును సదమదము చేయజాలని పిఱికిపందలా !

సుబ్బి— శత్రువు దుర్వృత్తి తెలిసినపిదప వానిని మాపుమాప కున్న నావల నీటితో తుంపవలసినదానిని గొడ్డంటితో దీర్పవలసి వచ్చునుగా.

రాజు— ఋణశేషమును శత్రుశేషమును నుంచరాదు.

సూరు— వాడిప్పుడు పెద్దాపురసామ్రాజ్యాపహరణవాంఛతో వచ్చెను. నిజమైన నాతని నిటకు రానీయకుండ విరోధించుటే యుచితము.

రాఘు— నిజము కుమారా, నిజము. ప్రతిఘటనమే మన కిప్పుడు పరమకర్తవ్యము. మన యేడువేల చమూసమూహమును గొని రామరాజు సుబ్బరాజు కృష్ణరాయనింగారిపుడు రాజమహేంద్రవరమేగి రుస్తుంఖానుని గోదావరిదాటి రానీయకుండ నరికట్టవలెను. అట్లయినచో మన సైన్యమేడు వేలును పరబలము పదునైదు వేలున్నను నిగ్రహింపగలము. మొండికలవంటి పెద్దాపుర పిఠాపుర వీరులు సాధింపజాలని దేమియు లేదు. తిమ్మజగపతి బలభద్రుడును రాజన్న సూరుడీను లిచ్చటి కోటను సంరక్షించుట కుండవలెను. మనసర్దారులం

తెలో స్వాస్థ్యములు గానిపిస్తున్నవి. గాని నిన్నువిచ్చుటి మహానుభావుల నిక
మును తొలగించినను భయము లేదు. నా దృష్టిని, నిన్ను వారించియుం
చిన శాత్రవులపై మహాముద్రలు వేయించి తత్క్షణమే స్వర్గారు లెల్లరకు
బంధువులు. రాజనాథ, నీవిచ్చుటకు స్వాస్థ్యములకు దగిన రాజ్యము నిచ్చుచు
సార్వభౌమత్వమును భాగము చేయుము. తిమ్మరాజా, ప్రసిద్ధములు నా
యకులగుటకు కొనియాడించి రణశూరులుగా నిలుపుము. జిల్లేదారా, సాల
గ్రామకోటపరదనములగు సాయుధముల తొండ్రభాగము నియమించి.
యున్నవర్మా, గూఢచారులకు సామాన్యాధిపత్యమును వహింపు. శ్రీగిరి
నాయనా నే. కృష్ణరాయా, తుష్టబుద్ధులగు వారిని వారించి సిద్ధపరచ
యీ రాజమహేంద్రవర యుద్ధమునందు సర్వసేనాయక స్థానము
వహింపగోరెదను. సిద్ధ కోట్యేశ్వరా, మనయుద్ధప్రయత్నము ప్రోత్సా
హము తెంచు.

సీ. రక్తతుల్య నవనంధి రాజాత్మ నీటయు
 లింపజగపతి భాగ్యరాజ్యంబు
దాయపురాధీశ విశ్వంభరుడు బహిమాన్య
 లింపజగపతి హృదిస్థనగరంబు
స్వప్న నగరి వాసని తోచెదురిది నగ్గ
 రాయబారిచర్మ రాజమాళి
మాధవ పతిగళ్ళ దొరాధురాగారిత ను
 ద్దండరాయపరాజ పరగోధవృత

గీ. నిన్నునేమి చేసు కాదె? నీవుమాను
 నిష్టదైవము వేకాదె? యిప్పుడు నగై
రణమునకు నెగుడ మమ్ము నిందితులగు
 జేయు నే తండ్రి! లక్ష్మీస్వరూపమహాత్మ!

లంకేలు—జయ! వస్త్రాభరణసామ్రాజ్యలక్ష్మీకాంతా! జయ! ఆంధ్రమాతృసుజనా!

(తెరపడును. బలభద్రుడు ముందునకు వచ్చును.)

బాల—(వేదనతో) అయ్యో, నా కంతయు నాశాభంగ మైనది!

గీ. సమరకాంతుడటంచు విమలాంధ్రులెల్ల
బోరనమ్ముచు నను బొంగి వాడ,
కాని, యమ్మహాంధ్ర సిక్కి విఘ్నమువన్న
ఎట్టులోర్తు? ఇంక నేమనర్తు?

(నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము.

# పెద్దాపురముముట్టడి.

## ద్వితీయాంకము.

1. రంగము — పాండవులమెట్టపై రుస్తుంఖాను శిబిరము.

[విశ్రాంతివేషముతో రుస్తుంఖాను పాలుక్కు-పీల్చుచు విహరించుచుండును. సమీపమున యాసనమును వ్రాతబల్లయు దానిమీద వ్రాతపరికరములు నుండును.]

రుస్తు — (స్వాలోచనముగ) శత్రుసైన్యములొకవేళ పరిమితిని మించి ముంచుకొనివచ్చి నలుప్రక్కల ముట్టుముట్టి ఆకస్మికముగ పైబడినను, అవలీలగా నెదుర్కొని నుఱుమాడుటకు పాండవుల మెట్టవంటి నిరవగుప్రదేశమీ ప్రాంతమున నింకొండులేదు. ప్రసన్న శీతల కమనీయ తరతారకల సుధాంశుకౌముదీప్రభాప్రభాసితమగు నిశాసమయము ప్రశాంతమై కార్యాలోచనమున కెంతయు దగియున్నది. ఈ ధరాభాగముప్పొంగి యచలాకృతి వహించుటయు హేమాంశుమనోజ్ఞచంద్రికల నోజల్లుచుండుటయు ఫాకీనలువలయములుగల మనోహర దృశ్యముల జూపులకేగావలయును..............ఓహో!

సీ. సైనికదళము విశ్రాంతినందగజాలు
తావిది కాదె పాండవులమెట్ట!
మహామహీయుల వెల్ల మహితమౌ మాన్యమై
మించిన గవ్వలకుప్ప యదియొ!
శత్రుదుర్భేద్యప్రశస్త గర్వోన్నతి
కొమరారు బురుజులకోటయదియొ!
మార్గముచెంత నిసర్గలావణ్యంబు
గల్గి నెల్లుపడె రాగమ్మ చెఱువు!

గీ. [illegible]
[illegible] !
సకల సంపత్తి [illegible] సంస్థాపనము [illegible]
[illegible] పెద్దాపురంబు !!

ఈ సంస్థానమును హస్తగతము గావించుకొనుటకు తలపెట్టిన మహా కార్యములెల్ల ఫలోన్ముఖములగుచున్నట్లే(?) శుభమయముగఁ దోఁచినది. కాని, నేనింతవరకు సాధించినదంతయు నొకయెత్తు, ఇంక ముందు సాధింప వలసినది యొకయెత్తు. సైన్యమునకు దండయాత్రవలన కలుగు ప్రయాసమును [illegible] నలువది మైళ్ళు [illegible] వచ్చి పదివేల సైన్యముతో [illegible] విదళితము చేయుటయు, తరువాత నొకఁ గోదావరిని దాఁటి రాజమహేంద్రవరదుర్గము నాక్రమించుకొనుటయు, [illegible] రాజులతో పదువేల దళముతో వచ్చి యెదిరించిన కృష్ణారాయునిపై మన సైన్యముతో బడి యవలీల నోడించి పెద్దాపురము [illegible] కోటపల్లి మన్యములకు పారఁద్రోలుటయు నొక యెత్తు కాదా. ఇంతవరకు నేననిపిన సమరములందు పదివేల సైనికులు [illegible] ముప్పదివేల దళ మింకను కలదుగదా! ఇంకను [illegible] సైనికులతో నిప్పుడు నేను పెద్దాపుర దుర్గమును వశపఱచుకొనలేనా? ఆఁ, సాధింపలేనిదేమి? [illegible] పిఠాపురాధీశ్వరులు సైన్యములనంపుదనని వారివారి సద్దారులకు వ్రాసిన లేఖలవన్నియు చేజిక్కించుకొనుటచే దుర్గములో నిప్పుడున్న మూలబలము మూఁడువేలును క్రొత్తగా చేరిన సైన్యమైదు వేలును [illegible] తెచ్చిన [illegible] మొక రెండువేలును మొత్తము పదివేలకు తప్పి యింక రాదు. కానిదుర్గము భేద్యమగుటచే నీపదివేల సైనికులను నా ముప్పదివేలను సంహరింపవచ్చును. అందువలన నాబలము విశేషముగ నశింపకుండ కోటను సాధింప మార్గమేము

న్నది ? సరే ! గాసుదయ్యా దేవ నెంత యమదాస్యరా తెవడు నాకు
కులశర్మరి ప్రత్యక్షింపగలిగిన పాట్ సిద్ధాంతకేసిని దాద్రియు-ఏమి చేయ
గలదు ? ఆయ్యో నాకు దోటు వివేకశాస్త్రమావకశకుండ లభింపగలను
శత్రువుమూపతాలింపు పట్టాభిరాజన్నయొక్క ముఖ్యులేగాని రాజ్యము
ప్రోత్సాదిలమునకే మరొకమూగగలదా ? గాంమరాజు, సుబ్బరాజు,
కృష్ణారాయనింగారేకంక కనుగుపెట్టుటకే పిలుతోకుండ దర్శనపుచేత
ముళును పారదరిదించినిగదా! ఇంక నాశక్తి యుద్ధాలుపయోగించి సాధిం
పవలసినవారు లిపున్ననెని బలభద్రులున్నారు. సరే ! ఇంక చేసిన
దాడ నింతకు పరసింహాశత్రువుల ఖడ్గబంధనిన మంజనముల నిర్మూలం
నీతోన్ పుడునా ? నమ్మినది. ఏ నాడు రాజాదులతో పూర్వమహామాత్యులు
దుర్జనుల యుగంధరుల యోధులైనయుగ శక్తిన లేక్కలేని బుద్ధివిద్య
యుగంధరుడైనమున వానాపటకు కల్పింపలేకుందరా ? రక్షణప్పుడే
యొకలేఖవ్రాసి అన్నిరామతామిత్రులకే పంపవలసిన యుగళ్ళము
మున్నది ? వారిసనట్లనే పంపవచ్చును. కాని ముందరియుద్ధము.
(మరియొక లేఖవ్రాసి) నాలుగువిప విషయమున నవ్రిసువర్ణ
యుండకూడ్న పరిమాణము తప్పదు. రహమాన్ ! రహమాన్ !

రహమా—(ప్రవేశించి) సర్కారు, ఏమియాజ్ఞ ?

రుస్తు—ఈ యుత్తరమును రహస్యముగ నీకుండా నలముందే నాకు
దీనుడకు పంపించు కార్యనుల శేయుము. (లేఖనిచ్చును.)

రహమా—(పుచ్చుకొని) చిత్తము. (పోవుచున్నాడు.)

రుస్తు—ఆయామ. మరియొకమాట. వచ్చినవప్పుడు గబ్రి
సేం, శిరోఖానులకుండ గొనిరమ్ము. ఉపదేశింపవలసిన రహస్యములు
గలవు. మాకొరకు కేనాగృహ సమీపమునగల శిబిరమున నేవి
యుండుము.

రహ—చిత్తము సర్కార్. (నిష్క్రమించును.)

రుస్తు—ముక్కుమూసికొని మూలకూర్చుండక యీముదుసలి సుబ్రహ్మణ్యసోమయాజి తగుదునని తగనిభారమును నెత్తిపైబెట్టుకొని గూఢచారుల పలువురనియోగించి నాగుట్టుమట్టులనెల్ల కనుగొని నన్నుసాధింప జూచుచున్నాడట ! కానీ !

గీ. నా ప్రతాపాగ్ని పర్వతమే ప్రిదిలిన
సకలజగముల నాశంబు సలుపుశనగ
ద్విజుల యింటింట తిరిపెము దెచ్చికొనుచు
బ్రతుకజూచు మందాధుడీ శక్తి యెంత !

(సగర్వముగ నిష్క్రమించును ;

## 2. రంగము—నూరుద్దీను శయనాగారము.

---

నూరు—(పరిక్రమించుచు సాలోచనముగ దనలో) ఇదినిజమగునా ? నాతండ్రి యింతదురాగతమున కొడిగట్టునా ? పండ్రెండు సంవత్సరముల కాల మేతల్లి యుండనువర్ధిల్లి గజదళాధ్యక్షత్వమంతటి గొప్పపదవినిగొనెనో యీ రాఘవమ్మదేవికే చేటుగూర్ప నీతడు వచ్చుచుండెనా ? నమ్మజాల నమ్మజాలను ! అట్లయిన, యీరామరాజాదుల వాక్యములకేమందును ? వీరినిస్వయముగా ప్రశ్నించి చూచితినే ! నిక్కువమే కాకున్న రుస్తుము పెద్దాపుర సామ్రాజ్యాపహరణ ప్రయత్నమున వచ్చుచున్నాడని వారేలజెప్పెదరు ? వారికెట్టి పూర్వద్వేషమును లేదే ! అయిన రుస్తుము సంశయింపవలసినవాడేనా ? తనకుమారునకీసంస్థానమూలంబమని యెఱుగడా ? రాఘవమ్మదేవికనేసన్న పుత్రవాత్సల్యముని తెలియదా ? తనయందలి గౌరవానురాగములచేతగదా దేవిగారు తనపదవిని నాకొసగిరి ! దీనికంతకును కృతజ్ఞత చూపవలసినవాఁడిట్లు కృతఘ్నత చూపునా ? ఒకవేళ నేను

తన కుట్రలోఁజేరి తనకు తోడ్పడనంగీకరింపనందున నైజాముని కాంధ్రరాజుల యొద్దనుండి కప్పముగొని తెత్తునని యాసజూపి యాసైన్యముతో నీరాజ్యమును జయింప నిశ్చయించెనా ? అనంభవము ! ద్రోహముచే నార్జితమైన సింహాసనము నాకుపలదని యేకపుత్రుడనైననేను తనహితమును త్రోసిపుచ్చినపుడీ రాజ్యము నెవ్వరికొఱకు సంపాదించును ? తనయొక్కనిపొట్టయు రాజ్యమున్న నేగాని గడువదా ? కాకున్న నీతడధికారముకొఱకు పాకులాడుచున్నాడా? ఈసంస్థానమునందు గజదళాధిపత్యమును ఇచ్ఛాపూర్వకముగా త్యజించి నైజామునొద్ద షర్లష్కరుగానున్నను రాజ్యపాలనమందే కాంక్షయున్నదా ? లేకున్న నీతనికిప్పుడీ పెద్దాపురయాత్రయేల ? ఈ సైన్యపారావారమేల ? ఎందులకింత కాయక్లేశము ? పోయి యతనితో యొకసారి మాటాడివత్తునా ? ఛీ ! ఇదియిప్పట్లననుచితము. అనుమానములకాకరము ! ఇంకనీతని యంతరంగమెఱుంగుట కేమియుపాయముకలదు ?

సేవ—(ప్రవేశించి) సలామ్, సర్కార్, హుజూరునకమ్మని తమ తండ్రిగారి సేవకుడొకడీ లేఖనిచ్చి పోయినాడు. (లేఖనిచ్చును.)

నూరు—(అందుకొని) సరే, నీవుపొమ్ము.

సేవ—(నిష్క్రమించును.)

నూరు—ఇంత రాత్రివేళ నాయనగారి యొద్దనుండి లేఖయా! ఇదిగో యివి నాయనగారి స్వహస్తాక్షరములే ! (కన్నులకద్దుకొని) ఈ యక్షరములవలె నాయనగారి హృదయముకూడ సుందరమైయుండెనా నాజీవితమెంత ధన్యమైయుండును ! (లేఖనుచదువును.)

"ప్రియ కుమారా,

అల్లాకృపచే నీవుచిరంజీవివై వర్ధిల్లుదువుగాక ! ఇపుడు నాదశ తిన్నగలేదు. లేని రాజ్యవ్యామోహము నా కారోపింపబడినది. నే

నోసర్పని తలంపని దురంత ఘాతుక కృత్యములకెన్నిటికో కర్తనని నిం
దింపబడితిని. నేనెట్లు రామరాజాదుల కుట్రకుపాల్పడితినో రేపుకొ
లువుకూటమునకు నేనుపంపులేఖవలన నీకుసుగతముకాగలదు. కాని
నీకుచెప్పవలసినది మఱియొకటిగలదు. ఇంతదనుక నాకొకదుర్భవసన
మునకలిగిన రాజ్యపాలనాసక్తి నేను నవాబునొద్ద షర్లమ్కరుపదవి
సంపాదించుటచే నశించినది. నాకు నేడు రాజపుత్రులయెడ నెట్టిభేద
బుద్ధియులేదు. ఇటకునేవచ్చుట కేవలము శ్రీవారలదర్శనముచేసి
వారి నాశీర్వదించి చనుటకే. రేపు శ్రీవారలదోడ్కొని నీవుకూడ
నాగుడారమునకు వచ్చితివేని మనము ముఖాముఖిమాట్లాడుకొనవ
చ్చును. అప్పుడు నీవు నాయంతఃకరణనైర్మల్యమునెఱింగి సంతసింప
గలవు. ప్రయాణక్లేశముచే నస్వస్థుడనైయుండుటచేత మిమ్మేరమ్మని
కోరవలసివచ్చినది. కన్నులకఱవుదీర మిమ్మొక్కసారిగాంచి తనివి
దీర గాఢాలింగనమొనరించుకొనుదాక నాశుష్కహృదయమునకు
శాంతికలుగదు.

అల్లాకరుణచే మనకు సుప్రభాతమగుగాక !

రుస్తుం."

సెబాస్ ! అనుకొన్నట్లు నాజనకుని మనస్సు అకళంకము. ఇప్పుడీ
లేఖగాంచుటచే నాహృదయశల్యమూడినది. దీనినిబట్టి రామరాజా
దుల అభిప్రాయములు ప్రమాదజనితములని తోచుచున్నవి. ఇంక
రాబోవు లేఖయందేమియుండునో చూచెదను.

సేవ—(ప్రవేశించి) సలామ్, సర్కార్, కార్యాలోచనా
సభకు దయచేయవలసినదని మహారాజుగారిసెలవైనది.

నూరు—మంచిది. నీవుముందేగుము.

సేవ—(నిష్క్రమించును.)

నూరు—(నడచుచు) పెద్దాపురముకోటను ముట్టడింపవచ్చు

చున్నాడని వినినప్పుడాందోళన మొందిన నా డెంగమునకీ లేఖ కొంత శాంతిచేకూర్చినది. ఇంక మహారాజునకువచ్చు లేఖ నాకు సంపూర్ణానందమును సమకూర్పకుండునా ?

(నిష్క్రమించును.)

## ౩ రంగము—సభాభవనము.

---

[రాఘవమ్మాదేవి, తిమ్మజగపతిరాజు, బలభద్రరాజు నూరుగ్గురు, రాజన్న, సోమయాజిగార్లాసనములనుండెదరు.]

రాఘ—గురుదేవా, రాజమహేంద్రవరము యుద్ధమునుండి తిరిగివచ్చిన వేగులవాండ్రు రామరాజు, సుబ్బరాజు, కృష్ణారాయనింగార్ల జాడ తెలియనేలేదని చెప్పిరా ?

సుబ్ర—అమ్మా, అట్లే, వారిజాడనరయుటకై నేను విశ్వప్రయత్నముచేయుచున్నాను-ఆంధ్రలోకమునంతను గాలించుచున్నాను.

రాఘ—సరేకాని-మన రాజ్యమునపహరించుటయే పరమావధిగా బెట్టుకొని యింతదూరమరుదెంచినరుస్తుము, కోటనుముట్టడింపక పాండవులమెట్టపైవిడిదిచేసి యూరకకూర్చున్నాడేమి ?

రాజ—అతడొకవేళ మనతోకయ్యమునకుదలంపక నెయ్యమునకే చూచుచున్నాడేమో ?

బల—(వికటహాసముతో) ఈదురాత్ముడా మనతో నెయ్యమునసుండగోరువాడు ?

సేన—(ప్రవేశించి) జయము ! జయము ! మహారాజా, రుస్తుముఖానుసర్లష్కర్ యొద్దనుండి లేఖనుగొనితెచ్చి సేవకుడొకడు తమదర్శనమునకై వేచియున్నాడు.

తిమ్మ — మంచిది. వెంటనే ప్రవేశపెట్టుము.

[రుస్తుముఖాను సేవకుడు ప్రవేశించును.]

రుస్తు. సేవ — (లేఖను తిమ్మజగపతిరాజునకిచ్చును.)

తిమ్మ — (అందుకొనును.)

బల — (కోపముతో) ఓరీ, మ్లేచ్ఛాధమా, —

గీ. ఎవ్వఁడేలూరు రాజమహేంద్రములను
మోసమున రామరాజాది భూమిపతుల
సైన్యములఁజంపె నట్టిరాక్షసచరిత్రు
డింకనుఁ క్షేమముగనుండెనే వచింపు!

తిమ్మ — తమ్ముఁడా, హేళనమాడుట మనకుఁదగదు. ఓరీ, మా ప్రత్యుత్తరము కొఱకు నీవు వేచియుండనక్కఱలేదు, పొమ్ము.

రుస్తు. సేవ — (నిష్క్రమించును.)

బల — (కోపముతో) హేళనమాడుటే మనకుఁదగదా ? ఇంక మనకుఁదగినదేది?-తగదు తగదని అయినదానికిని కానిదానికిని యూరకొనుటవలననే మనకార్యములన్నియు దగ్ధములగుచున్నవి. ఏదురాత్ముఁడచ్చుబోసివిడిచిన యాఁబోతువలె మదోన్మత్తమాతంగమట్లు నిరంకుశగతి నాంధ్రలోకమునవిహరించుచు పెద్దాపురరాజ్యాపహరణమునకై ప్రచండ సేనాసమూహముతో పాండవులమెట్టపై కాచుకొనియున్నాఁడో ఆకృతఘ్నుఁడు—ఆచండాలుఁడు పంపినదూతను పట్టిబంధింపకుండ విడువవచ్చునా ? వీఁడు రుస్తుమువేగులవాఁడుగాని నిక్కపువార్తావహుఁడా ? ఇట్టికార్యములన్నియు మనకుతగినవేనా ?

రాఘ — (విసువుతో) అబ్బా ! అబ్బాయీ, మాటిమాటికి నీవిట్లడ్డు వచ్చుచున్న రాజకార్యములుసాగునా ? అందును దూతనవమానింపుమనియా నీ యన్నగారికి నీతిగఱపెదవు? ఊరకొనుము

బల—(లేచి) వంకమాటలు నాకుఁదెలియవు, ఉచితమైనది కయ్యము. మీవైఖరిగాంచిన సంధికోడబడునట్లుఁదోఁచుచున్నది. బిచ్చపుకూడు నాకుబనికిరాదు. ఇచ్చటినుండి మీకార్యములకడ్డురాను. ఇదేపోయెద, కాని—

గీ. తిన్నయింటి వాసములెన్ను ధీరవరుడు
ఆంధ్రవీరుల శిక్షించినట్టి ఘనుడు
కోటకాపాడవచ్చిన మేటివీరు
డతని శరణొందు టేలకయ్యంబుమీకు?

(కోపమున పోబోవును.)

తిమ్మ—(అడ్డుకొని) తమ్ముడా, తమ్ముడా,

గీ. అమ్మగారియాజ్ఞయన్న నౌదలదాల్చి
యసువులైననిచ్చునట్టివాఁడ
వకట! తెంపుచేసి యామెపై గోపింప
బుద్ధియేలపుట్టె నిద్ధతగనె?

సుబ్రి—నాయనా, బలభద్రా,

గీ. ఎఱిఁగియుండిన క్షాత్రంబు నెఱుగకున్న
బ్రాహ్మణుఁడ, శాస్త్రమెఱిగినవాఁడనగుట
వినుమునామాట, లేఖనువినుము మొదట
అవలయోజింతమోయన్న యంబమాట.

రాఘ—(మందహాసముతో) వెఱ్ఱివాడు!—వెఱ్ఱికోపము!—గురుదేవా, వానిమాటలకేమిలెండు—లేఖనుపఠింపుడు.

సుబ్రి—అమ్మా, సావధానులుగండు. సభ్యులారా, వినుడు.
"శ్రీమన్మహా—"

రాఘ—ఆర్యా, బిరుదములనువదలి చదువుడు.

సుబ్రి—చిత్తము. (చదువును.)

" అమ్మా రాఘవమ్మాదేవి,

తమరు కొందఱుదుష్టులకొండెములనువిని నాపైదురభిప్రాయమునుగలిగియున్నారనివింటిని. కాని యదియంతయుగల్ల. నేనిచ్చటకు మీపై కత్తిగట్టవచ్చినవాఁడనుగాను. కళింగ రాజమహేంద్రవరముసర్కారుల రెండింటిని పాలించుటకన్వర్ధనసమర్థుఁడని తెలిసికొని నైజామువారునన్ను రాజమహేంద్రవరముసర్కారునకు సర్లష్కరుగానియమించి నలుబదివేలఫౌజును రాజమహేంద్రవరముదుర్గరక్షణార్థమొసగిపంపుటచే నేనురాజమహేంద్రవరమువచ్చుచుంటిని. కాని అక్కటా! కాలమెంతవక్రమైనది! మ్లేచ్ఛుఁడ నైజన్నిమించినమాత్రమున దుర్మార్గుఁడనగుదునా? నాకుమాత్రము హృదయములేదా? దారాపుత్రులులేరా? నేనుకల్లామైనరులగట్టించి గ్రామములగాల్చి దోచుకొని ఆంధ్రరమణులనవమానించితిననియు, తుదకు నేను భక్తిప్రేమగౌరవములతో చిరకాలము సేవించిన తమసామ్రాజ్యము నే ఆసించివచ్చుచుంటిననియు ఎవ్వరోచెప్పినవాక్యములను విశ్వసించి రామరాజు సుబ్బరాజుప్రభృతి రాజవరేణ్యులనేకులు నాయాశయముల కనుగొనకుండ నాహితములు లక్ష్యపెట్టక తిరస్కరించి నాపైనపనిందలమోపి నన్నేలూరుకడను మరల కృష్ణారాయనింగారితోవచ్చి గౌతమీతీరమునందునుదాక నేను విధిలేక ఆత్మసంరక్షణార్థము వారితో దలపడి చేజిక్కినవారిని తమమొగముచూచివిడచిపుచ్చి తమకుయథార్థముగ నాసదుద్దేశములనువిచేయవలసినదనియు తమదర్శనముచేసికొన కతిపయదివసములలోవచ్చుచుంటిననియువిన్నవింప వారుసిగ్గుపడి తమతోనింతకుబూర్వము నాపైయసత్యములనుజెప్పియుండుటచే స్వవచనవ్యాఘాతమువచ్చునని భయపడితనుదర్శనముచేయనోడి యప్పటికిచేయునదిలేక నాపైకసిదీరక మారాజమహేంద్రవరముదుర్గమును పట్టుకొని నన్నుసాధించుటకుగాను, సైన్యములగూర్చుకొనివచ్చునభి

లాఘవముతో గోదావరినిదాటి యేలూరువంకకుజనిరి. నేనొనర్చిన యుద్ధములన్నియు ధర్మబద్ధములగుటచే నన్ను మీరు క్షమింపవలెను. నిన్న మొన్నటిదాక నేను మీ సేవచేసినవాడననుమాటను మఱచిపోకుడు. నాకంటె పెద్దాపురరాజ్యాభివృద్ధినిజూచి సంతసించువారులేరు. నైజామువారు నావలన మీధర్మపరిపాలనమును విని సంతసించి ప్రాచీనముగ మీసంస్థానమింతవరకు చెల్లింపవలసిన జుమ్మాను రద్దుపరచితిమనియు మీసంస్థానమును సర్వస్వాతంత్ర్యముగల సోదరరాజ్యముగా నంగీకరించి మీకు స్థిరపరచి రమ్మనియు నన్ను నియోగించిరి. ధర్మమూర్తులును-వీరావతారులును. నాకును విశేషించి నాకుమారుడు నూరుద్దీనునకు ప్రభువులగు తమరు నేను మహమ్మదీయుడనని శంకింపక సేవకుడనని నిరసింపక తమ సేవవిడిచితినని కోపింపక నాయందనుగ్రహముంచి నాప్రమాదములక్షమించి తమకుమారరత్నముల దర్శనమిప్పించితిరేని వారికి నాకష్టసుఖములమనవిచేసికొని కృతజ్ఞతాప్రీతిపూర్వకవందనములనర్పించి తమక్షేమాదంతమును దెలిసికొని నైజామువారియాజ్ఞానుసారము తమసంస్థానమును తమకు స్థిరపరచి ధన్యుడనై రేపటిప్రాతఃకాలమున రాజమహేంద్రవరమేగెదను. అయ్యా, నేనెట్టి అకల్మషహృదయముతో నీలేఖవ్రాసితినో అట్టివినిర్మలమానసముతో తమరీకమ్మను పఠింప మఱిమఱి ప్రార్థించుచు శ్రీవారలదర్శనము కొఱకుత్కంఠతతో నెదురుచూచు తమ విధేయుడు, రుస్తుంఖాన్,
రాజమహేంద్రవరము షర్లమ్కర్.

బల—సెబాస్! చిరకాలము మనరాజ్యములోనుండి గడించిన యాంధ్రభాషాపాండిత్యమీతనికిప్పుడీ లేఖారచనమునందెంత చక్కగా వినియోగించినది!

రాఘ—గురుదేవా ఇదియంతయు విచిత్రముగానున్నదే! రామరాజాదుల సంధిప్రయత్నములు మృషలా? వారు తిరోహితులగుటకు రుస్తుము చెప్పినదే కారణమా? అవిరతప్రియమింత దురాగతము-ద్రోహముచేసి మనల వంచించుట సత్యమా? రుస్తుమువాక్యములెంతవరకు విశ్వసనీయములు?

సుబ్రి — అమ్మా, ఈవిషయమును ఆపీరత్రియమును స్వయముగ ప్రశ్నించి తెలిసికొనుకాలమువచ్చువరకు నిర్ధరించుటకు వీలులేదు. కాని రుస్తుమునకు రాకొమరులదర్శనమిప్పించుటలో తమయభిప్రాయమేమి?

రఘు — నాయభిప్రాయమింకేమున్నది! రాజపుత్రులనటకు బంపుటయే యుక్తమని నాకుదోచుచున్నది. ఏమన్నా, రణనిహతులైనవారుగాక ముప్పదివేలసైన్యము రుస్తుమునకు కలదనికదా మనకిప్పుడు విశదమైనది. మనసర్దారులలో నొక్కరు నింతవరకు సైన్యమునుగొనిరాలేదు. మనసైనికులనడపించుటకు తగిన దండనాథులా చాలినందఱులేరు. ఆపీరత్రమునేమైనో మనకింతవనుక తెలియనేలేదు. మనకోటలోనిప్పుడు పదివేలకంటె సైన్యములేదు. నెయ్యమొనరించుకొన నిచ్చగలవానితో సామమున కార్యసాధనమొనరించుకొనక కయ్యమున కాయత్తమగుటకు నాకుదగిన కారణము గనుపించుటలేదు. ఇదివఱకు రామరాజాదుల వాక్యములవిశ్వసించి వారికి మనసైన్యములతోడిచ్చి బహుళసంఖ్యాకులగు సైనికులజంపుకొన్నదిచాలును. ఇప్పుడుమనము రాజకుమారులబంపనిచో రుస్తుమందులకుగోపించి మనకోటనుముట్టడించిన చాలప్రమాదమునకు లోనుగాగలము. లేదా పండ్రెండు పదునాఱులక్షలకపురవరహాల నొక్కసారి నిష్కారణముగ చెల్లించి యింతటినుండి గోలకొండసుబేదారులకు మనము సామంతులము కావలసినదుర్గతిపట్టును. అయాచితముగ నీరూపమున మనకునైజాముతోడిమైత్రిలభింపనుండ కాలద్రోసి కదనరంగమున కుఱికి సైనికులజంపుకొనుటేల? ఇతను మొదట నేమనపై దాడివెడలిన మనమునాహవమునకుసిద్ధపడినచో నందు న్యాయముండును గాని మనతోసఖ్యపడగోరువాని నెదిరింపబోవుట ధర్మవిరుద్ధము. ఇదిగాక, మననూరుద్దీనునిగూడ రాజపుత్రులతో వానిచెంతకుబంపిన

నింక వానివలన ప్రమాదమురాదని నానమ్మకము—జానా సాహు
ద్దీన్ ?

సూరు—(ఆవేశముతో) అమ్మా, ఆమాటనిశ్చయము.

గీ. అబ్బాయగుగాక అల్లాయెయగునుగాక
దుర్నయంబునకొడిగట్టి దొరలమేను
లంటగాసాహసించునే ? అంబ, సూరు
దీను—కంఠంబునందున ప్రాణముండ ?

ఈతడెంతదుర్జనుడైనను, ఎవ్వరికైన హానిచేకూర్చుగాక—తానె వ్వరివలన నింతదనుకవర్ధిల్లెనో వారికే కీడెంచునా? (స్వగతము) రాజకుమారులమైత్రిగోరుచుంటిననియు, పూర్వముతనకుగలిగినరాజ్యవ్యామోహము షర్లష్కర్ పదవిదొరుకుటచేనంతరించినదనియు నిన్నరాత్రి నాయననాకువ్రాసినలేఖయందుదహరించుటచే నేనిప్పుడు రాకుమరుల నచ్చటకుదోడ్కొనిపోయిన హానిరాదు.

తిమ్మ—అమ్మా, రాజ్యక్షేమమునాలోచించిన మేము రుస్తుంఖానునొద్దకు బేటీకిపోవుటయే మేలు. లేకున్న నైజాముప్రతినిధినవమానించినదోషము మనమీదబడగలదు.

రాఘు—నేనునదే యోజించుచున్నాను.

రాజ—అమ్మా, ఇతడు మనయూరువచ్చి మనకుహానిగూర్ప సాహసి పగలడా ?

బల—(చిడిముడిపాటుతో) హాని హానియని మనుష్యులనంపుటకేలయింతగ సంశయించెదరు ? మేము కత్తిబట్టలేని కనుగందులమా ? ఆడయున్ననడలు ఆడువాండ్రమా ? చేత ఖడ్గములుండ మమ్మోర్పజాలు మగవాడెవడు ?

చ. హరిహరులెత్తివచ్చిన భయంకరవృత్తినెదిర్చి, యూనిపో
పటపటశీర్షముల్ దఱిగి వైరిదళంబుల తీటవుచ్చి, మొ

గ్గరములఁ జిల్చి, యాహవముఖంబుల మాఁజయకేతనంబులన్
స్థిరముగ నిల్పు మే యిపుడు శతధీరులమౌదుమె వీనినోర్వమే ?

తిమ్మ—సెబాస్ ! తమ్ముఁడా, నిక్కముపలికితివి !

రాఘు—గురుదేవా, మీరు మౌనమువహించితి రేల ?

సుబ్రి—అమ్మో, తలచుకొనకుండనుండవలయు నేగాని నూరు ద్దీనున్నంతమాత్రమున రుస్తుము నిశ్చితకార్యమునుమానఁడు. ఇతని వ్రాత వైఖరిజూడ నసత్యమాడి దానినిమఱుగుపరచుటకై ప్రయత్నించుచున్నట్లున్నదిగాని నిర్మలహృదయమునుండి వెలువడిన సత్యవాక్యములుగా బొడకట్టవు. తరచిచూడ నిందనందిగ్ధముల నేకములున్నవి. ఇతఁడు రాజమహేంద్రవరదుర్గమున కేమివిపత్తుసంభవించినదని నలుబదివేల పౌఁజునుగొనితెచ్చెనో నాకు బోధపడకున్నది. మఱియొక్క విషయము. మన వీరతిమ్మయము తన రాజమహేంద్రవరదుర్గమునపహరించుటకై సేనలగూర్చుకొన గోదావరిని దాటిజనిరని తెలిసియు రాజమహేంద్రవరమునువీడి యిచ్చటకువచ్చునంత వెఱ్ఱివాఁడా ? దీనినంతయు దిలకింప నీతఁడా వీరతిమ్మయమువారును మనకుదెలియనీయకుండ నూనసగించుచున్నట్లును పెద్దాపుర రాజ్యాపహరణమునకై ప్రశయవ్యూహమును పన్నుచున్నట్లును స్పష్టపడుచున్నది. మఱియు నీతఁడొనరించిన దారుణకర్మలతో నాంధ్రలోకమంతయు నట్టుడికిపోవుచుండ నీతఁడ దియంతయుగల్లయన్న నమ్మువారెవరు? అందఱు నుత్సాహపడుచుండ నే నేలయిట్టియప్రియమాడవలయునని సంకోచించుచుంటినిగాని రుస్తుమువ్రాతలనమ్మి రాకొమరుల నాతని చెంత కంపుట నాకెంతమాత్రమును సమ్మతములేదు.

బల—గురుదేవా, ఆలోచించినకొలఁది అనుమానమభివృద్ధియగుట స్వాభావికము. రుస్తుమువ్రాసిన మూఁడువాక్యములకు మీరు మీబుద్ధినంతయునినియోగించి ముప్పదిపుటలవ్యాఖ్యానము గావించి

నాకు. బ్రాహ్మణక్షత్రియ రాజులగు మీరింకేయ ధైర్యపడుట త్యాశ్చర్యముగా నున్నది. మీభయము దీర్చుటకైనను మేముపోయివత్తుము సెలవిండు.

రాఘు—తమ్ము తొలగించి రాజమహేంద్రవరదుర్గమునకు రుస్తుమును మండలాధికారిగా నియమించినకోపమున అన్వరుద్దీను తనపై దండెత్తిన ప్రమాదమువచ్చునని భయపడి రుస్తుమింత సైన్యమును దెచ్చియుండును. మనదర్శనము జేసి వీరత్రయము తనకుహాని గూర్పకుండ జేయుడని మనల వేడుటకై యాతడింతత్వరలో నిటకరుదెంచియుండును. ఇక వీరత్రయమువిషయమాతడసత్యమాడి బొముకొనున దేమున్నది? ఇదిగాక నూరుద్దీనప్పట్టు రుస్తుమొరులయెడ నెట్లున్నను తనకొమరునితోపాటు రక్షించిన నాపుత్రులకే హానిదలపెట్టునా? అసంభవము! గురుదేవా, క్షమింపుడు. వీరినిపంపుటకే నిశ్చయింతిని. ఇంక వీరుపోవలసినకాలముకూడ సమీపించుచున్నది. కుమారులారా, రండు నారసింగ్, రమ్ము. గురుదేవా, సెలవు. (పో బోవుదురు.)

సుబ్బ—(లేచి ఆతురముతో) అమ్మా, అమ్మా, ఒక్కక్షణమాగుడు. మీకు మనవిచేయవలసిన దెంతయోగలదు. రుస్తుము విశ్వాసార్హుడుకాడు. అక్రూరుని దౌర్జన్యమును—వంచనమును—దుశ్చర్యలను గూర్చి ప్రమాణములజూపి యిప్పటివిధాన మాతడుపన్నిన దారుణతంత్రముని ఋజువుచేయుటకెన్నియో ఆధారములగపడుచున్నవి. మీరు వానినిలక్ష్యపెట్టక—నాహితమునువినక తొందరపడి యనర్థకరమగు నిట్టిబేరమంగీకరించి కుమారులనాతనికడకంపినచో కూడిరాని కీడుమూడును. ఎంతయు దృఢసంశయమును పరేంగితావగాహనమును లేకుండ నేనింతగ మీకు చెప్పుటలేదు. రుస్తుము మాయావి! గోముఖవ్యాఘ్రము! భీరుడననుడు—పాపుడననుడు—రా

జ్యాంగతంత్రచాతుర్యవిహీనుడనను-నిష్కారణకారకుడనను.- కాని— రాజసుతుల నా రాక్షసుని పటుకటీరమువంకనైన కన్నెత్తిచూడ నీయకుడు. తప్పదేని మరల యుద్ధమే చేయుదను, కాని—

రాఘ—(మందహాసముతో) గురుదేవా, మీకీవెఱ్ఱియేమి? నన్ను మీరు భయపెట్టుచున్నారా లేక పరీక్షించుచున్నారా? రుస్తుము వీరిని మోసగింపడనియే నావిశ్వాసము కాని యొకవేళ యన్యథాజరుగనేయకుడు. అప్పుడు నా బిడ్డలు సహజతేజఃప్రతాపమును ప్రదర్శించి సూర్యవంశమునకు ఖ్యాతిఘటింతురుగాక? ఆర్యా, సెలవు. కుమారులారా, రండు. (నిష్క్రమించును.)

తిమ్మ<br>బల<br>సూరు } —(నిష్క్రమింతురు.)

రాజ—(మఱియొకవంక నిష్క్రమించును.)

సుబ్ర—(నిర్వేదముతో) అక్కటా! అఖండరాజ్యతంత్రజ్ఞరాలని భావించిన రాఘవమ్మాదేవి యింతబేలయగునని యెన్నడెఱుగనైతినే! శర్కరాన్వితమగునీ రుస్తుంఖానునివిషవాక్యఘుటికలే యీ మొసరుచ్యములైనవే! మేధావంతుడని జగత్ప్రసిద్ధినిగన్న నీ కళాతిమ్మజగపతిసార్వభౌముడు కూడ యీవిషయమును గ్రహింపజాలకున్నాడే! తనకుతోచినదే ధర్మమను నిరంకుశాభిప్రాయమూనిన దేవితో నేమిచెప్పిన నేమిప్రయోజనము!......................అయ్యో!

గీ. ఎవరికృపచేతవర్ధిల్లి యింతదనుక
వేదవేదాంగముల, ధనుర్వేదమందు
నద్వితీయకోవిదుడను ఖ్యాతిగంటి
నట్టిప్రభువుల రక్షించుటెట్టులింక?

(మౌనముతో కొంతవడిపరిక్రమించి తటాలుననాగి యెదుటకు జూచి గొంతెత్తి యావేగముతో) రాజన్నా! రాజన్నా!

రాజ—(రభసముగప్రవేశించి) అయ్యా!

సుబ్బి—(ఆవేగముతో) నీతురగమేదీ?

రాజ—కలదీభవనబహిర్భాగమున—సెలవైన—

సుబ్బి—ప్రాణములు వదలగలవా?

రాజ—సంతోషపూర్వకముగ-అదేమట్లు సెలవిచ్చెదరు?

సుబ్బి—పనివచ్చినది. రుస్తుము దుస్తంత్రముపన్నినట్లు మానించుచున్నాను. తత్క్షణమే నీయుద్ధాశ్వముపైబోయి రుస్తుంఖానసభాశిబిరమునచెంతనున్న వృద్ధవటవృక్షముపైకెక్కి రుస్తుంచర్యలగనిపెట్టవలయును. నీహయము నాసమీపమునగల జొన్నచేనులో దాచుము. నేను రాగమ్మచెఱువుకొమ్మగలోనున్న తాటితోపులో నుందును. నీయశ్వముపై నచ్చటకులంఘించి యటనడచినదంతయు నాకెఱిగింపుము. పొమ్ము. క్షణమాలసింపకుము.

(ఇరువురొకసమయమున చెఱియొకవంకకు నిష్క్రమింతురు.)




పుట 38.

### 4. రంగము—పాండవుల మెట్ల సమీపమున.

[చల్లా రాజన్న యోధవేషముతో ప్రాకారోన్ముఖముగ ప్రవేశించును.]

---

రాజ—గురుదేవుడేమేమో నా చెవిని నూదిపోసినాడు గాని. రుస్తుంఖానేమి రాకొమరులకు హానిసలుపుటయేమి? గురుదేవుడు నీటిలోజాడలదీయగల అంఖడప్రతిభాశాలియగుని రుస్తుము విషయములో నీతడనవసరాందోళన మొందుచున్నాడు. సరే! ఇంతలోపోయి నదేమి? ఆర్యుని యాజ్ఞానుసారముగా యశ్వరాజము నాజొన్న చేనిలో నిలిపియుంచితినిగదా! ఇంక నీమఱ్ఱిచెట్టుపైదాగి రుస్తు మేమిచేయునో చూచెదను. గురుదేవుడన్నట్లొక వేళ ప్రభువులకేమేని యాపదదాపరినయెడల నంతలో నాయశ్వముతో నటవాలి వారినిరక్షింపనేలేనా? అదిగో! అప్పుడే రుస్తుముసర్దారులతో నెదురేగి రాకొమరులను నూరుద్దీనని సంభావించి సభాశిబిరములోనికి గొనిపోవుచున్నాడు! (నిష్క్రమించును.)

[అంతట తెరయెత్తబడగా రుస్తుంఖానుని సభాశిబిరము గోచరించును. రుస్తుంఖాను, తిమ్మజగపతి, బలభద్రరాజు, నూరుద్దీను రసూలుఖానులు సముచితాసనముల నుందురు.]

---

రుస్తు—(వినయముతో) తిమ్మజగపతిమహారాజా, యథార్థమేగాకున్న ఆసీరత్రియముపై నేనుదోషారోపణము గావింప సాహసింతునా? అందును—ఇట్లుకల్పించినందువలన నాకు కలసివచ్చునదేమున్నది.

తిమ్మ—దానికేమిగాని నీవిప్పుడు నలుబదివేలసైనికులతో నిటకేల వచ్చితివో ముందుచెప్పెదవా?

గుస్తు—(మందహాసముతో) మీరువలెనే అమ్మగారుకూడ యీవిషయమున నన్ననుమానించిరా ?

తిమ్మ—మేముగాని అమ్మగారుకాని శంకింపలేదు. గుసుదేవుడుమాత్రము.—

బల—అబ్బ ! అన్నయ్యా, ఆగొడవయంతయు నిప్పుడేలనుగు? వచ్చినపని ముగించుకొని పెండ్లికడనే పోవుచున్న నమ్మగారు కోపింపరా ?

రుస్తు—బలభద్రరాజా, ఏమంతగ వేగిరించెదరు ? మీసేవను మిమ్ముమెప్పించుకొనివచ్చి యిచ్చటి వృత్తాంతములనెల్ల నొక్కొటొక్కటె చూపునప్పుడెంతగా వేళయుంచినను నిచ్చటనుండి కదలమని పట్టుబట్టినవారు మీరుకారా ? నేను నేంతను సేవపడిలి నైజాంవారి సేవలో నున్నంతమాత్రమున పరుడనైతినా ? తమకంటె నాకు నైజా మెక్కువవాడైకొంటినా ? ఎందువచ్చినను, హిందువేనన మాసించి యొకులకొల్వచేసియున నన్నుమీరు క్షమింపవలెను—అన్నట్టు,— మహారాజా, సోమయాజులుగారి విషయమున శంకించిరా ? ఔను. వారట్లనుమానించుట న్యాయమే, కాని అందులకు నేనుమనవిచేయు సమాధానముకూడ చిత్తగింపుడు. అన్యాయముగనిప్పుడు తనపదవిని నేనాక్రమించిన యాగ్రహముచే మండిపడుచు నన్ను సాధింపజూచుచున్నాడు. ఇదిగాక ఆంధ్రరాజులలో మీరుతక్క కడమవారందఱు సమయము దొరకిన రాజమహేంద్రవర దుర్గాపహరణమునకై కనిపెట్టుకొనియున్నారు. యింతటి విశేషమేమన నిట్టియవకాశమును మీరే వినియోగించుకొందురేమోయని యెవరిమట్టునకు వారే యీ రహస్యమును మీకు తెలియకుండ కాపాడుకొనుచున్నారు. ఇట్టి దుష్కాలము దాపురించినప్పుడు నైజాముగారు నలుబదివేలసైన్యము నిచ్చి పంపుటలో వింతయేమున్నదో మీరే చెప్పుడు ?

సూరు—నాయనా, అంధ్రరాజులింకెవ్వరు నిటలేని యవకాశమును దీసికొని మా యిట్లువారిపై కొండెముల బలుకుచున్నావు ?

రుస్తు—అబ్బాయీ, యిది కల్పనమైనను గాకున్నను నా తలలో పొడమిన దిమాత్రము కాదు. ఇట్లని నైజాము నాకు చెప్పి పంపుటచే నీయుదంతమింతమాత్రమైనను తెలిసినది. నేనిచ్చటకు వచ్చిన పిదప నైజాము చెప్పిన దంతయు సత్యమే యని నిశ్చయించుటకు దగిన నిదర్శనములు గోచరించినవి.

తిమ్మ—ఆంధ్రరాజులందిట్టి ద్రోహులుందురన్న నేనునమ్మజాలను. అయిన నిందుకు నీనిదర్శనములేమి ?

బల—రుస్తుంఖాన్, నీవిప్పుడెంత అసందర్భముగ మాటాడుచుంటివో గుర్తించుకొనుట లేదు. ఈద్రోహులలో రామరాజాదులు కూడ కలరని నీయభిప్రాయము కాబోలు నేమి ?

రుస్తు—మహారాజా, అయినగావచ్చును. రాజ్యలోభమెంత వారినైన నిట్టి దుర్మార్గులుగాను ద్రోహులుగాను జేయుటయందాశ్చర్యమేమున్నది ?

సీ. మహమదు తొగ్లకు మాన్యజనకు వం
చించి చంపడె రాజ్యచింతజేసి?
ఇస్లముషాపుత్రు నిట్టితుంచి యక్ల
రవణ్లడే నాడు రాజ్యకాంక్ష?
ఆత్రితాపునిజంప నరుగలేదాకో శక్తి
సింహుండు రాజ్యమాసించి యప్పుడు ?
అన్నదమ్ములజంపి యౌరంగజేబట్లు
ప్రబలడే రాజ్య లోభంబువలన ?
గీ. ఇట్టులెందరు ద్రోహులై యాప్సితముల
నెట్లొ నెరవేర్చుకొనుటకు నెంతలేసి
కఠిన దుష్కర్మముల కొడిగట్టిరో
యెఱుగవే తిమ్మజగపతినృపతి, చెపుమ ?

(తెరలో ఖురపుటధ్వానము)

[కరీంఖాను వీరోచితవేషముతో రొజుకొనుచు ప్రవేశించును.]

రుస్తు—(అలజడితో) ఏమిది ?—కరీంఖాన్ !

కరీం—సర్కార్, రమూ రాజు సుబ్బా రాజు కృష్ణ్ రాయు బహద్దర్లే దండూగిండూ సగఫరా సేస్కా నచ్చి రాజమహేంద్రికోటా మే ముట్టడీ-సర్కార్,—ముట్టడీ యేసీ—

రుస్తు—(ఆశ్చర్యముతో) ఏమి !—రామరాజు- సుబ్బరాజు కృష్ణారాయనింగార్లు ముగ్గురును గోదావరిని దాటివచ్చి మనకోటను ముట్టడించిరా ? ఎంతదారుణము !—ఎంతద్రోహము ! (కోపముతో) చేజిక్కినవారిని విడిచినందులకిదియా ప్రతిఫలము ? (తలపంకించి) ఔరా! ఇంతలో నిచ్చటకువచ్చుటవలన నెంతయుత్సాహమూడినది! పిదప?

కరీం—ముట్టడీయేసీ—చకచకా చకచకా మునల్మాన్ సిపాయి ల్నే సఫాసఫా సేసీ—సేసీ—

రుస్తు—కోట లోబడినదా ?

కరీం—నై నై సర్కార్, లడాయ్ ఘోర్ హోపోతోంది, అదం డూ—అరస్తూ—అచ్చా కోటా బుగ్గి సేస్తోంది సర్కార్ !

రుస్తు—సరే, బయటకుబోయి మా యాజ్ఞకై వేచియుండుము.

కరీం—అచ్ఛా సర్కార్ ! (నిష్క్రమించును.)

రుస్తు—మహారాజా, చూచితిరా ? వనమండలము నెయ్యమునసుండ నీక్షత్రియులిట్లు కయ్యమున కాయత్తులగుచు మీతో నైన యోజింపక రాజమహేంద్రవరదుర్గమునిట్లు ముట్టడించుటలో వారి యభిప్రాయమేమో యిప్పటికైన తమకుబోధపడినదా ?

తిమ్మ—ఖాన్‌సాహెబ్, ఏమిది అసందర్భము ?

రుస్తు—ఇందసందర్భమేమున్నది ? నేను మనవిచేయలేదా వీరిప్రకృతిని మీరు గ్రహింపకున్నారని ?

బల—కాని-నీవు మాకు హానిచేయవచ్చుచున్నావని యూహించి యావీరత్రియమ్ముల్లు మీకోటనచ్చట పట్టుకొని మాకుపకృతి జేయ సంకల్పించుకొని రేమో!

తిమ్మ—(అలజడితో) ఏది యెట్లయినను ముందీముట్టడిని మానిపించు ప్రయత్నములజేయుకున్న ముప్పువాటిల్లును. ఖాన్‌సాహెబ్, రసూలుఖానునైనను మఱెవ్వరినైనను బంపి తత్క్షణమే పోరు నాపివేయించుము.

నూరు—కారణమేమి?

రసూ—చేటికివచ్చిన నాతో అవసరవిషయముల గూర్చి ప్రసంగింపకపూర్వమే మేమిట మిమ్ములవిడచియెట్లుపోగలము? ఒకవేళ మేమేగినను వారు మామాటవిని ముట్టడినిమానెదరా?

బల—అవును, నిజమే—పోనిండు మాకు మారుగ నూరుద్దీను నటకంపిన—

రుస్తు—అట్లయిన బాధలేదు. ఇందుకు నూరుద్దీనియ్యకొనునా?

నూరు—ఎంతమాత్రమియ్యకొనడు. అమ్మగారు వీరిని నాసంరక్షణమందొప్పగించినారు.

తిమ్మ—(నవ్వి, గర్వముతో) వెఱ్ఱివాడా, మమ్ములను కాపాడుటకు నీయవసరమిటనేమున్నది? పోయిరమ్ము. అలసించిన నిష్కారణరక్తపాతముకాగలదు.

బల—నూరుద్దీన్, అప్పుడుగురుదేవుడును—ఇప్పుడు నీవును మాక్షేమముకొఱకింత పలవించుట వింతగానేయున్నది! జాగుసేయక పోయిరమ్ము.

నూరు—నన్ను నిర్బంధింపకుడు. మిమ్మొక్కక్షణమైన విడిచియుండుటకు అమ్మగారియనుజ్ఞలేదు.

రుస్తు—(నవ్వుచు) అబ్బాయీ, నీరక్షణమొకటియు నారక్షణ మొక్కటియునా? ఈరాజపుత్రులు నీకేగాని నాకుప్రభులుకారా?

రసూ—ఆలసించినకొలది పోరటఘోరమై హిందూమహమ్మదీయులసంఖ్యాకులు రణరంగమున కాహుతికావలసిన దుర్యోగముపట్టును.

తిమ్మ—నిజము. నూరుద్దీన్, నేనాజ్ఞాపించుచున్నాను. పోయి వచ్చెదవా లేదా? లేక ప్రభువాజ్ఞాధిక్కారము గావింతువా?

రుస్తు—నాయనా, మేమేగినందువలన ప్రయోజనము లేకుండుటచేతను మహారాజకుమారుల నింతలోవిడచిపోయిన గౌరవ భంగము కలుగుననియు కాని-

నూరు—మహారాజా, మీరేయిట్లు నన్ను బలవంతపెట్టి వేధించిన నేను చేయునదేమున్నది? సరే, పోయివచ్చెద లెండు.

రుస్తు—కరీంఖాన్!

కరీం—(ప్రవేశించి) సర్కార్!

రుస్తు—(నూరుద్దీనుని చూపుచు) ఇతడు నాతనయుడు-అదిగాక పెద్దాపురమహారాజప్రతినిధి. నీవితోబోయి వీనియాజ్ఞానుసారము సర్వకార్యముల నిర్వర్తింపుము.

కరీం—అచ్ఛా! సర్కార్!

రుస్తు—అబ్బాయీ, ఆలసింపకుము.

నూరు—రాజేంద్రులారా, అమ్మగారి యాజ్ఞనుల్లంఘించిన పాపమురాకుండ మీరుకోటనుచేరితిరేని నాకదియేచాలును. నాయనా, వీరిని నీకొప్పగించిపోవుచున్నాను. ఇటనుండ వీరికేహానిచేకూరినను నీతల నీకుదక్కదసుమీ మఱచిపోవలదు. అన్నలారా,-సలామ్! నాయనా, సలామ్! (నిష్క్రమించును.)

కరీం—(నిష్క్రమించును.)

రుస్తు—(పకపకనవ్వి) పిచ్చివాడు—నూరుద్దీను మీరక్షణమునందెంత యాసక్తి పడుచున్నాడు! నేను తమవిషయమున తనకంటె నెక్కువబాధ్యత వహింపవలసిన వాడననుట నాతడెఱుగడు. మూర్ఖులకిట్టి అనుమానము మెండు, ఆలోచనమల్పము.

బల—(గర్వముతో) మాకెవ్వరి రక్షణమునుపని లేదు. మా కరవాలములు మాయొద్దనున్నంతవరకు మాకెట్టిభయమును లేదు.

రుస్తు—(ఆతురముతో) అన్నట్లు-కరవాలములన్న జ్ఞప్తికివచ్చినది. పెద్దాపురమున నూతనముగ కర్మాగారమొకటి స్థాపింపబడినదనియు, నందుపనితనముగల కృపాణములు గావింపబడుచున్నవనియు వింటిని—నిజమా ?

బల—(కత్తిదీసి) ఇదిగో! యీఖడ్గమచ్చట చేయబడినదే! (ఇచ్చును.)

రుస్తు—(అందుకొని యాశ్చర్యమునటించుచు) ఓహో! ఏమిఅద్భుతకళావైదుష్యమిందు ప్రదర్శింపబడినది! రసూల్, చూడుము. (ఇచ్చును.)

రసూ—(కైకొనును.)

తిమ్మ—(కత్తిదీసి) ఖాన్‌సాహేబ్, ఇదియునచ్చటగావింపబడినదే! (ఇచ్చును.)

రుస్తు—(అందుకొని) సెభాస్! నిజముగానిది మహారాజహస్తాలంకారము! ఇబ్రహీం!

ఇబ్రి—(ప్రవేశించి) సర్కార్!

రుస్తు—ఈఖడ్గములదీసికొనిపోయి మనసర్దారులందఱకు వీని నిర్మాణనైపుణ్యమును జూపితెమ్ము. (ఇచ్చును.) రసూల్, నీవును పొమ్ము.

ఇబ్రి
రుస్తు } —(ఖడ్గములఁగొని నిష్క్రమింతురు.)

రుస్తు—(నవ్వుచు) తిమ్మా, మాపదునొకండుసంవత్సరముల కప్పము మాట యేమి ?

తిమ్మ—(నివ్వెరపడి) ఇదేటి సంబోధనము ఖాన్‌సాహెబ్ ! ఇదిపరిహాసమా—లేక—అపహాస్యమా ? అందునిప్పుడు కప్పము మాటయేల ? మీకు మేమేలకప్పము చెల్లింపవలయును ?

రుస్తు—(జాలినటించుచు) సంబోధనము ?-కప్పము ? తిమ్మని తిమ్మని చేయువరకీ సంగతులేమి యుబోధపడవు !


బల—ఖాన్‌సాహెబ్, ఇట్లుమమ్మిచ్చట తూలనాడుటకా పిలిపించితివి ? ఇది నీకుతగునా ?

రుస్తు—(కోపమున) ఓరీ, రాచపురుగా, నాకిది తగదేమి ? ధనమదాతిరేకమున విఱ్ఱవీగుచు ప్రతాపముకలదని మావదునొకండు వర్షముల పేష్కసునుహరించి నన్ను తృణీకరించి నైజామునే నిర్లక్ష్యముచేసి కులుకుట మీకుమాత్రము తగుననుకొంటిరేమి ? కానిండు—మీరోగముకుదుర్పగల సిద్ధౌషధము నాయొద్దనున్నది. తిమ్మా, నీ జిహ్వకోయించెదను. భద్రా, నిన్నిప్పుడే ఫిరంగికికట్టి పేల్పించెదను. నేడు పెద్దాపురసామ్రాజ్యమున కుపరాగకాలముదాపురించినది ! తెలిసినదా ?

బల—తుచ్ఛా, నీనాల్కయిట్టి కాఱుకూతల వదరుచున్నదేమి ?

తిమ్మ
బల } —(రుస్తుముపైదూకి కొట్టబోవుదురు.)

రుస్తు—నానాల్కా !-ఇబ్రిహీం, రసూల్, గండు—కట్టుడు—కట్టుడు !




పుట 47.

రసూ, ఇబ్ర — (ప్రవేశించి ఉచ్చులవిసరి రాకుమారులబంధింతురు.)

తిమ్మ— (రోషావేశములతో) రాక్షసాధమా, ధూర్తా, అధమాధమా, మాప్రాణములనే నీవాసించినచో సంతోషపూర్వకముగ నొసగియుందుమే! అందులకిట్టి అమానుష నీచతంత్రము నేలపన్నితివి? ఇందులకా పెద్దాపురసామ్రాజ్యమును వందివలెపొగడి కపటనాటకమాడి మాఖడ్గముల నపహరించితివి? వీరాగ్రేసరుడనని పేరుకొని తుదకాడుదానిపని చేసితివేమిరా? మాప్రాణములను మాకిప్పి మమ్మెదుర్కొనరాదా? అప్పుడు నీప్రతాపము—నీప్రతిభ—నీశక్తి—బోధపడునే! రాజభక్తిపరాయణుడైన నూరుద్దీనిచ్చటనున్న నీదుష్కార్యము కొనసాగదనియా అతనినిచ్చటనుండి వెడలనడచు తంత్రమును పన్నితివి? ఓరీ, రుస్తుం, నీగర్భములో నింతకుళ్ళున్నదనియే మాకు తెలిసిన నీయుప్పదివేలబలమును తెక్కముక్కడకుండగాజేసి సదమదము సలుపకుందుమటరా?

శా. రాజ్యాపేక్ష దురంత దారుణ కఠోర క్రూరమార్గంబులన్
పూజ్యంబై, అకలంకమై, మహితమై పొల్పొందు పెద్దాపురీ
రాజ్యంబున్ గొనజూచెదీవు తులువా, ప్రాప్తించునే? స్వర్గసా
మ్రాజ్యంబున్ గొనుమింక నీతల విదీర్ణంబై ధరన్ గూలగన్!

బల— అరే, క్రూరాత్మా,-

గీ. మగతనంబుండెనేని మామహితఖడ్గ
ములనుమాకిచ్చి మాతోడపోరుమిప్పుడు-
అట్లుకాదేని నైజామునాశ్రయించి
రాణివాసంబుగావ వైళంబజనుము!

తిమ్మ—(సంరంభముతో) తమ్ముడా, రమ్ము-రుస్తుమును ముష్టితో మోది చంపుము. ఓరీ, (కట్లు త్రెంపుకొనుచు) రుస్తుం, యింకెందుబోయెదవురా?

రుస్తుం—అదిగో!-అదిగో! కట్లు త్రెంపుకొంటిరేని మీతలలు మీకు దక్కవు-ఇబ్రహీం,-రసూల్,-చూచెదరేమి ?

[రాజపుత్రులిరువురు హుంకరించి తాళ్ళు త్రెంపుకొని రుస్తుము రసూల్ ఇబ్రహీంఖానుల ముష్టితో మోదపడగొట్టి వారిశిరములదన్ని పటకుటీరమును జీల్చుకొని బయటికతిరయమున లంఘింతురు. ఇబ్రహీం రాజపుత్రుల తఱుముకొనుచు నేగును.]

రుస్తుం—పట్టుడు, పట్టుడు, చంపుడు, చీల్చుడు-రాకుమారుల విడువకుడు!

(తెరలో కలకలము.)

"సర్కార్, సర్కార్, తమవాళ్ళజాగ్రత్తి సేతుల్లోంచి మళ్ళ తిరిగి పోతుంది సర్కార్, బల్ భద్రుడూబలం ఎన్నో బలం సర్కార్-సన్నాంసర్కార్,- సన్నాం"

రుస్తుం—(కలవిలపడుచు) చంపుడు-వారినొక్కని చంపుడు!

(మరల తెరలో కలకలము.)

"సర్కార్, రాజాపుత్రుల్నిమారద్యా సేసినాం సర్కార్!"

రుస్తుం—(నిట్టూర్పువిడిచి సంతోషముతో) అమ్మయ్యా, ఇప్పటికి నాప్రాణములు కుదుటపడినవి. ఇబ్రహీం, ఆశిరముల రెండింటి నిక్కడకు తెమ్ము. ఆపెంకెతలకాయల గాలదన్నువరకు నాకడుపుమంట చల్లారదు.

(ఇబ్రహీం రాకుమారుల శిరములగొని తెచ్చి రుస్తుంఖానున కిచ్చును.)

రుస్తుం—(రాకుమారుల శిరముల నిబ్రహీంచేతులనుండి లాగికొని వానివంకజూచుచు హేళనతో) ఆహాహా! ఆహాహా! ఇప్పుడు మీప్రతాపమెందుబోయినది ? ఏవీమీవీరాలాపములు ? ఇప్పటికి మీపొగరణగినదా ? రుస్తుంఖానుసర్దలష్కర్ నవమానించి యవాకతవాక పలుకుల బలికిన యీతలలేనా ?

గీ. భావిపెద్దాపురీ సార్వభౌమపదవి
గాంచి కాంచన నవరత్నఘటితమకుట
మును ధరించు నా శిరము దన్నిన ఫలంబు
గాంచు నీ శిరములు నేను గాలదన్న !

[అట్లుతన్నబోవ రభసమున రాజన్న అశ్వముమీద ప్రవేశించి రుస్తుము చేతులనున్న శిరములలాగికొని కరవాలమును ఝళిపించుచు రోషోద్రేకములతో విజృంభించుచు]

రాజ — అరే, దుష్టా, — రుస్తుం ! —

శా. ఖండింపన్ గరమూనె, హస్తములఖడ్గాలుండగా వీరలన్ ?
దండన్ వైరిభయంకరప్రథనవిద్యాంసుండు రాజన్నయే
యుండన్? - పావనరాజశీర్షముల నుద్యోగింతువా తన్నగా ?
ఖండంబుల్ పొనరించి నీ శిరము కాకంబుల్ దినన్ వైచెదన్ !

(రుస్తుముగారు మొదలైన మహమ్మదీయులు కేకలిడుచు చెల్లాచెదరై పాఱిపోవుదురు.)

రాజ — ఓరీ పాఱుబోతా, -

గీ. పోయివత్తు నరాధమా, బుద్ధిగలిగి
మెలగుమికనైన రాజను పొందప్రవరము.
నిముసమిట నిల్చితివయేని నీ శిరంబు
గొంకవిడువదు రాజన్న ఘోరవృత్తి !

(తటాలున తురగము నెక్కి నిష్క్రమించును. మహమ్మదీయసైనికులిటు నటు కలవిలపడుచు పఱుగులిడుదురు.)

రుస్తు — (ఆతురముతో ప్రవేశించి అధికారముతో) అరే, అరే, రసూల్, ఇబ్రహీం, రాజన్నను పట్టుకొనుడు - పొదివిచంపుడు - తత్‌క్షణమే పెద్దాపురపుకోటను ముట్టడించుటకు సిద్ధపడుడు - లెండు - లెండు - రాజన్నను వెడలనీయక కోటలోనికి ప్రవేశింపకపూర్వమే నఱికి వేయుడు - త్వరపడుడు - త్వరపడుడు !

(తెర పడును.)

## 5. రంగము—గవ్వాలమెట్టచెంత.

[రాజన్న రాజమస్తకములచేఁగొని దుఃఖించుచు ప్రవేశించును]

రాజ—గీ. ప్రళయనిర్ఘాతమేల నాపైనబడదు ?-
సూర్యతేజుల !-ప్రభువుల !-సుగుణనిధుల
పూజ్యశిరముల నేలగొంపోవ-నకట !
పంచభూతములైన నన్ దుంచవేమి ?

అయ్యో ! ఈదురాత్మ్మెంతదౌర్జన్యమొనరించి నిరుపమాన విక్రమ సంపన్నులగు మారాఘవమ్మాదేవి సంతానఫలముల నిట్లు త్రుంచెను ! (సవితర్కముగా)

మ. కరవాలంబులలాగి రుస్తుమకటా ! ఖండించెనే కాని దు
ష్కరమావీరులదాక నేరికని-ఆఖానుండెకాదల్ల ని
ర్జరనాధుండయినన్ ముఖాముఖిని బోరన్ జాలునే ?-ధారుణీ
వరులీనాటికినిట్లు తంత్రమున జావన్ బ్రహ్మవ్రాలే మొకో !

గురుదేవా, నీపలుకులన్నియు యధార్థములయినవే ! అమ్మగారుకాని మహారాజకుమారులు కాని మీమాటలప్పుడే పాటించి యుండిన నింతచేటు వాటిల్లకపోయి యుండునే ! ఇంతయేల ? సూరుద్దీనుగాని నేనుగాని మీవచనముల విశ్వసించితిమా ? కట్టా ! నేను వటవృక్షమునందుండి మిమ్ములను గనిపెట్టుచుండియు రక్షింపలేని మందభాగ్యుడనైతినే! సూరుద్దీనవలకు నడిపించుటకుగల కారణము నప్పుడే గ్రహింపగల్గిన నాక్షణమునందే యటరాత్రి మిమ్మెట్లయిన రక్షించియుండనా ? అయ్యో ! ఎంతఅపరాధ మెంతయపరాధము ! ఈరుస్తుంఖాను—వత్సవాయ వంశక్షీరరత్నాకర సుధాంశుమూర్తుల పవిత్రశిరముల నవమానింపబోవుటను కన్నులారగాంచియు—రాజశీర్షముల నమ్మగారికడకు గొనిపోవలసిన కఠోరకార్యమొక్కడ నెఱవేఱకపోవునో యనుభయముచే ఆదుర్మార్గునితలను నేలబెట్టి కాల

రాచి ఖండఖండములుగ చీల్చి హృదయరక్తమును భీభత్సగతి కడు పారఁగోలి రావలసిన రాజన్న యిట్లు కన్నగానివలె—భీరునిభంగి—అపరాధివలె—శత్రుస్కంధావారమునుండి శరవేగమున పురివంకకు పఱుగిడి రావలసిన పాపకృత్యమునకు బొల్పడవలసివచ్చెనే! అమ్మా, రాఘవమ్మదేవీ, కుమారునికన్న మిన్నగ నీవెంచు నూరుద్దీను సమయమునకు లేకపోయెను. పిడుగులు గుఱిసినను చలింపక ప్రతివీరుల తెగటార్చునని నీవెంతయు గీర్తించు రాజన్న యింతజేసినాడు! అమ్మా, నీవు రాజపుత్రుల రక్తసిక్తశిరములగాంచి—"రాజన్నా, నీవా మాప్రభువుల నిట్టివిధముగ నిచ్చుటకు గొనితేవలసినవాడ" వని నన్ను ప్రశ్నింప నేనేమని సమాధానమిత్తును? .........హా దుర్భరము! దుర్భరము !! ఏమహారాజ మస్తకముల మహీసురులు హస్తములనుంచి దీర్ఘాయురస్తు విజయోస్తని దీవించిరో—ఏయవనీనాథుల శిరములపై నగర నారీరత్నములు సౌధములనుండి కుసుమాక్షతల వర్షించి సంభావించిరో అట్టి నాప్రభువుల యుత్తమాంగముల నేను కేలగొని పోవలసిన దుస్థితి వచ్చినను బ్రతికియుంటినే! ఓగురుదేవా, యింక నీముఖమెట్లు దర్శింపగలను? ఓరామయ్యామ్మదేవీ, నీపతినార్త నీకేమని తెల్పుదును? (తటాలున నాగి) ఈ శిరములతో కోటలోనికేగి అబలాజనము నార్తనాదమున ముంచుటకంటె మరల శత్రుశిబిరమునకుబోయి రుస్తుంఖాని నాలుక వాలుకలుజేసి శీర్షమును చిద్రపలు జేసి వత్తునా ?............

(తెరలో)

"పట్టో పట్టో, మార్ మార్, హుషార్"

రాజ—(ఆగి) ఓరోరిత్తురద్రి సైనికులారా, (రోషముతో)

గీ. శత్రుశోణితమునుగ్రోలి చాలకాల

మగుట, నాచంద్రహాసము మగుడి వైరి

జనుల జూచినయంత నుత్సాహపడుచు
వెలికివచ్చెదు, జాగేల ! వేగరండు.

[ముగ్గురు మహమ్మదీయవీరులు మార్ మార్ అను కేకలతో పటాటోపముగా ప్రవేశింతురు.]

రాజ—(వికటహాసముతో) మీరటరా నన్నుజంపువారు ?
(రోషముతో)

గీ. తురగమందునిలిచి కరవాలమున్గొని
ప్రళయకాలరుద్రుభంగి పగర
పీచమడచునట్టి వీరుని రాజన్న
హతమొనర్ప బ్రహ్మకైనవశమె ?

(ఇరువురుమహమ్మదీయులచంపి మూడవవాడు 'అల్లా' 'అల్లా' యని పొరలాడుచుండ సత్వరముగ నిష్క్రమించును.)

6. రంగము—లక్క మేడ.

[రాఘవమ్మాదేవి, బాలజగపతినొడిలో నిడుకొని
రామయ్యమ్మ, లక్ష్మీసోమిదేవమ్మ, గౌరి,
దుఃఖచిహ్నములతో ప్రవేశింతురు.]

రాజ—(విచారముతో) అమ్మా, తరువాతనింకేమున్నది ?

ఉ. కట్టినత్రాళ్ళు త్రెంపుకొని కావరమొప్ప నెదిర్చుశత్రులన్
బట్టి కఠోరముష్టిహతి బ్రాణముదీయుచు కాననంబునన్
నెట్టన దంతిమస్తకము నిల్వనజీల్చి కలంచి బొబ్బలన్
బెట్టు, హరీంద్రులట్లు నృపవీరులటన్విహరించిరంతటన్ ?

గీ. కోరలనుదీసినట్టి కాకోదరముల
భంగి, కరవాలములులేని పాపశత్రు
వైరిహస్తములకుజిక్కి ప్రభువులచట
నసువులనుబాసిరకట ! యేమందునమ్మ !

వటము డిగనతికి నేనచ్చటికేగునంతనే రుస్తుము కపటోపాయమున నూరుద్దీను నచటనుండి వెడల నడచుటగాను నింతకల్లోలము జరిగిన పిదప సర్వము పరిసమాప్తియు నగుటచే చేయునదిలేక అచ్చటనున్న నవమానింపబడునేమోయని ప్రభువులమూర్ధములగొని తెచ్చి-

అందఱు—హా! వీరావతారులారా! హా! విద్యానిధులారా! (అని ఆక్రందనముచేయుదురు.)

రాఘు—హా! కుమారులారా! ఎంతలో నెంతవిపత్తుసంభవించినది! కడకు మీచావునకు నేనేమిత్తునైతినే! అయ్యో!-

సీ. అవలీల శితికంఠునైన నాహవమందు
బట్టిచంపెడు బాహుబలముకలిగి
రాజ్యంబునెల్ల సంరక్షింపజాలెడు
చాకచక్యమున బ్రశస్తిగాంచి
అనవరతంబు రాజ్యాంగతంత్రింబున
సరిలేని, తలకని శక్తిగలిగి
సర్వకళలయందఖర్వపాండిత్యంబు
బడసినారని చాలవన్నెగాంచి

గీ. రూపజిత మన్మథులటంచు రూఢికెక్కి
యఖిలరాజన్యులందున ఖ్యాతిగాంచి
యిర్వదేండ్లు పదునెనిమిదేండ్లు చనక
మున్నె దివికేగినారె నాపుత్రులార!

ఓరీ కుత్సితుడా, ద్రోహీ, నరాధమా, యిందరినింతజేసి కడకు నీకన్నకొమరుడు నూరుద్దీనునే మోసపుచ్చి యేమిబావుకొనుటకింత దుర్మార్గము చేయసాహసించితివిరా? విశృంఖలవృత్తి నింతగవిజృంభించుటకు నీకనుకూలకాల మీనాటికగుపించినదా? మేమునీకేమి విసము వోసితిమని మావినాశనమున కిట్లు పూనుకొంటివి? ఓరీ పాషాణహృ

దయ్యా, నీచేతులార పెంచిన జాజిలతలనే యిట్లు కాలరాయుటకు వారు నీ కేమి యుపకృతిచేసినారురా ? అయ్యో ! నీవొక శిశుమాత్రుడవైయున్న కాలమున పిలిచి గారవించి పోషించి యింతవానిగ జేసిన నామేలు నెల్లమఱచి జగదేకవీరులగు నాకుమారులనే కటికతనమూని-నైచ్యమున-మోసమున తెరవాడులనపహరించి దారుణవధకు బాల్పడిన దుష్టయూథ్యుడవై క మాశుద్ధాంతకాంతల ననవమానింపకుండ విడుతువా ? కల్ల ! కల్ల ! ఔరా ! ఎంతలోనెంత విపర్యయముతటస్థించినది ! ఈవార్ధక్యదశయందింత కష్టకోటి భరింపవలసియుండునని తెలిసిన పదునొకండేండ్లకు బూర్వమే పతిననుగమించి యుండెడుదాననే ! అక్కటా ! కుమారులారా, ఎవరికొఱకీజీవములీ శరీరమునందింత వరకు నిలిపియుంచితినో అట్టిమీకును మీసామ్రాజ్యమునకును గల యనుబంధమింతలో భగ్నముకావలసిన యోగమున్నదని నేనెఱుగ నైతినే ! ఓ పెద్దాపురసామ్రాజ్యరమారమణీ,—

సీ. ఆదికాలంబున ఆటవికులగు కి
రాతపతులచేత రాణకెక్కి
యవలను రెడ్డిభూధవులచే నత్యంత
ప్రాబల్యమును వైభవంబుగాంచి
గజపతులంతట నిజభుజశక్తిచే
రక్షింపగా నెంతొ ప్రాప్తిజెంది
పాలింపనిందాక వత్సవాయప్రభుల్
వివిధదేశంబుల వినుతినంది

గీ. అకట ! నేటికి మహామదీయప్రభుత్వ
దారుణానలకీలల దగ్ధమగుచు
నామరూపంబులు నశించు నాడువచ్చె !
ఎట్లు బ్రతికెదవో తల్లి, యింకమీద ?

లక్ష్మి—అమ్మా, రాఘవమ్మా దేవీ, నీవేయిట్లు బెంబేలుపడిన నింకనీకోడలి నూరార్చువారెవ్వరు ? ఊరడిల్లు మూరడిల్లుము!

రామ—హా! నవమన్మథాకారా ! హా! పరాక్రమసదనా! హా ! జీవితేశ్వరా ! లక్ష్మమ్మతల్లీ, ప్రాణములీ శరీరమునందున్నంత వరకీప్రాణికి నూరటయెక్కడిది ?

ఉ. వీరుడె కాదు విద్యను వివేకమునందును బ్రజ్ఞయందు నా
కార విశేషమందును నిగర్వ వినిర్మల జీవితంబునం
దూరనె కాదు లోకమున సజ్జలకీర్తినిగన్న నాథుడే
తీరున ఖానుచేతుల వధింపబడెన్ గ్రహచారమేమియో !

గౌరి—అమ్మా, రామయ్యమ్మ దేవీ, తమరు వీరవరేణ్యులగు కళా తిమ్మజగపతిమహారాజునకు దేవేరులయ్యు సామాన్యులవలె వాపోవదగునా ? ఊరడిల్లు మూరడిల్లుము !

లక్ష్మి—రాజన్నా, యింతకును గురుదేవులేమనిరి ?

రాజ—అమ్మా, ఏమనిచెప్పుదును ? పొంగిపొరలివచ్చు దుఃఖోద్రేకము నెట్టెట్లో యణచుకొని నేవిన్నవించిన విషాదవృత్తాంతమును విని కోటకాపాడు భారమును నాభుజస్కంధములందుంచి ముఖ్యరహస్యముల గొన్నిటి దమకెఱింగింపుమని నాకాజ్ఞాపించి యప్పటికప్పుడే మొగలుసైన్యము నింగినిగప్పు మొగిళ్ళచందంబున దుర్గము వంకకేతెంచుచుండుటచే చేయునదిలేక ముందుగ నన్నేగి వాహినుల హెచ్చరించి దుర్గద్వారముల మూయింపుమని ముదలనొసగి నన్నిటకంపినారు. పనిబడిన రహస్యమార్గమున వచ్చి తమ్మచ్చట కలిసికొనవలసినదిగా సెలవిచ్చిరి.

రాఘ—రాజన్నా, గురుదేవు డిచ్చటికేలరాలేదు ?

రాజ—అమ్మా, వ్యవధిలేకపోయినది. అందును గురుదేవుడు రాజపుత్రుల దారుణవధను వినలేక వినలేక విని విచారభారమున క్రుంగి

పోయి మాన్పడియున్నాడు. ఇదిగాక శాత్రవులునన్ను వెనుదఱుము కొని వచ్చుచుండిరి. అందుచే గురుదేవుకిటకు రా—

(తెరలో కలకలము.)

రాజ—(విని) అమ్మా, అదిగో! అప్పుడే మహమ్మదీయులు కోటను ముట్టడించినారు.

రాఘు—ఏమి రాజన్నా, పెద్దాపురసామ్రాజ్య రవి తేజమస్తమించు కాలము వచ్చినదా యేమి?— అయ్యో! గురుదేవా, సర్వజ్ఞుడవగునీవు మాకుపదేశించినట్లాచరించిన నింతసర్వనాశనము సంభవింపకపోయెడిదే!

గీ. నిజముగా బ్రాహ్మణుడవీవు నీపలుకుల
పాటిసేయక మృత్యువుభవనమునకు
బంపి కొమరుల నీగతి జంపుకొంటి
కటకటా! ఏమనందును కాలమహిమ!

కట్టా! సమయమున కొక్కరును దోడ్పడువారు లేకపోయిరే! సేనానాయకులు లేనిసేన అట్టి ప్రచండ శత్రువరూధిని నెట్లెదుర్కొనగలదు? ఓ లక్ష్మీనృసింహస్వామీ, నిన్ను నమ్మినవారి నిట్లగచాట్ల పాలు గావింతువా? (దుఃఖించును.)

రాజ—అమ్మా, దుఃఖింపకుడు. తమకంట కన్నీరుగారుట చూచి నేనుసహింపజాలను. గురుదేవుడు కోటనురక్షించుభారమును నామీదనుంచుట మఱచితిరా? రాజమహేంద్రవర యుద్ధమునకు వీరత్రయము నంపునపుడు దుర్గరక్షణార్థము చల్లారాజన్న యుండవలయునని చెప్పియుండరా? అమ్మా, నాటిరాజన్న యింకను జీవములతోనుండలేదా? నాకంఠమున ప్రాణములుండగా రుస్తుంఖానుని కోటలో నడుగుపెట్టనిత్తునా? వీరత్రయమేమైన నెందులకు? నూరుద్దీనెందుబోయిననేమి? గురుదేవుని మంత్రాంగముతో పనియేమున్నది? మహారాజుల నాయకత్వము లేకున్ననేమి? అమ్మా, నన్ను పంపుడు. అరాతిబలమునుజూచి శంకింపకుడు. అదిగో, మనదళము

నాయకులు లేమి చింపర వందరమై పరబలమును భస్మముచేయజాల కున్నది. తమ సెలవైన చిటికలో బోయి—

గీ. వెసరి నలుమొగములబాలు సేన జేర్చి
దుర్నిరీక్ష్య తేజోగతి దురమునందు
నిలిచి యాహవమొనరించి కలచివైతు
వైరులను, నాదు ప్రాణముల్ ధారవోసి.

రాఘు—(విచారముతో) వలదు, రాజన్నా, వలదు. కోటసమూలముగకూలి వత్సవాయవంశసౌధము పరశురామప్రీతియగు చరమకాలమాసన్నమైనది. లేకున్న, నాయాజ్ఞయన్న సుగ్రీవాజ్ఞగా దలచుచు సమయమువచ్చిన నేబదివేల సైన్యముతో రాగల సర్దారులుగాని పదివేల సైన్యముతో రాగల జమాదారులుగాని నలుబదివేల సైన్యముతో రాగల రామచంద్రపురము రేకపల్లి రాజులుగాని మన తాకీదులను పాటించి మహోత్కృష్టమైన సహాయార్థము రారా?

రాజ—అమ్మా, క్షమింపవలెను. ఇది వారిదోషముకాదు. వారికి మనము పంపిన లేఖల రుస్తుమపహరించెనని గురుదేవున కిప్పుడే తెలిసినది.

రాఘు—హా! హా! ఎంతదారుణ మెంతదారుణము! రుస్తుం, నీవెంత తంత్రగాడవైతివి! అయ్యో! రామరాజు సుబ్బరాజు కృష్ణారాయనింగార్ల జాడయైన తెలియలేదుగదా!

రాజ—అమ్మా, వారిని రుస్తుము కోటపల్లి మన్యములకు తఱిమివేసెనని చారులవలన గురుదేవు డిప్పుడే గ్రహించినాడు.

రాఘు—అక్కటా! ఇది యేమి విపరీతము! రుస్తుమింకను ఎందఱి ప్రాణానిలములగ్రోలి యెందఱికి ప్రవాసగతి కలిగించి యెందఱి మస్తకములతో కళ్లాపైవరులగట్టించి కులుకనున్నాడో! రాజన్నా, యింతకును ముందీవార్త చెప్పవైతివి! కుమారుడు నూరుద్దీనునట్లు

వంచించి గొనిపోయి రుస్తుము తనపొట్టను బెట్టుకొనలేదుకదా ?

రాజ—అమ్మా, అంతపని జరుగలేదుకాని యతడు రాజానగరములో బంధింపబడి సజీవియైయున్నట్లు గురుదేవుడు తెలిసికొనియెను.

రాఘు—హా కుమారా నూరుద్దీన్! (మూర్ఛిల్లి క్షణముండి చివాలునలేచి అధికారముతో) రాజన్నా, అయిన నింక రణమునాపివేయ నే నాజ్ఞాపించుచున్నాను. అయినవారందఱును పెద్దాపుర స్వస్థాన సంరక్షణమునకై యసువుల నర్పించినప్పుడును అడవులబట్టినప్పుడును కారాగారములపాలైనప్పుడును మేమింకను కోటను పదిలముగ పట్టుకొని ప్రాకులాడుదుమా ? గౌరీ, అంతఃపుర కాంతలనందఱిసిటకు జోహారొనర్ప రమ్మనుము. రాజన్నా, మూయించిన కోటతలుపులు తీయించి మహమ్మదీయ చమూసమూహముతో రుస్తుముఖానుని లోనికిరానిమ్ము. ఈలోన మాకందఱకు చితుల సిద్ధముచేయుము. యవనులచే నవమానింపబడకుండ జోహారుసలిపి అగ్నిహోత్రజ్వాలలయందు భస్మీభూతులమై పవిత్రాత్మలతో పరలోకమున కేగుదుము. రుస్తుముఖానుని వచ్చి యీ పెద్దాపురశ్మశానవాటికలకు ప్రభుత్వము చేసికొననిమ్ము! ...... రాజన్నా, దుఃఖింపకుము. చెల్లెంతటి కొడుకుల దిగమ్రింగిన యీనిర్భాగ్యరాఘువమ్మాదేవి దుఃఖమును దిగమ్రింగు కొనలేదా ? రామమ్మా, బాబుకై విలపింపకుము. ఈ వత్సవాయాంకురమింక పూసపాటి పృథివీశ్వరులవలన బ్రోదిగాంచును లెమ్ము. ఇది యనుల్లంఘనీయమగు దైవనియమము! లక్ష్మమ్మతల్లీ, నీవే యిప్పుడు దుఃఖింతువా ? రాజన్నా, లెమ్ము. మాకు చితులంటించి కోటతలుపులను దీయింపుము. గౌరీ, పొమ్ము. అవరోధజనము నిచ్చుటకు దోడ్కొనిరమ్ము. ఇంకను ఆలసింతురేమి ?

రాజ—(దుఃఖించుచు రాఘువమ్మాదేవి పాదములపై బడి) అమ్మా, అమ్మా,—

గీ. రణతలంబున వైరులరక్తమందు
మజ్జనంబాడుటో — శత్రుమధ్యమందు
ప్రాణముల వీడుటో గాని, అంబ! మెఱుగ
ప్రభువులకు నగ్నిచితుల నేర్పఱచు తెఱగు!

రాఘు — రాజన్నా, లెమ్మా - లెమ్మా - పోనిమ్మా - అందులకు గౌరి యేయున్నది. కాలముతప్పివచ్చినప్పుడింతకంటె చేయవలసినదేమున్నది?.........గౌరీ, ముందు నీవేగి అంతఃపురస్త్రీల నిచ్చటకు బిలిచి చితులనంటించి కోటతలుపుల దీయింపుము. ఇది నీకు తప్పదు, పోమ్మా.

రాఘు — గౌరీ, వచ్చునప్పుడు నాకు హరిద్రావస్త్రముల దెచ్చుట మఱువకుము.

గౌరి — (దుఃఖించుచు) అమ్మా, ఇది నాకు తప్పదా?

రాఘు — తప్పదు. పొమ్మా పొమ్మా. లేకున్న నాయాన.

గౌరి — అమ్మా, అమ్మా, (దుఃఖించుచు నిష్క్రమించును.)

(తెరలో కలకలము.)

రాఘు — ఏమిది రాజన్నా, మహమ్మదీయులప్పుడే కోటలోనికి —

రాజ — అమ్మా, కాదు కాదు. గౌరివలన తెలిసికొని కావలయును, మనసైనికులందఱును కొక్కుమ్మడి దుఃఖించుచు వచ్చుచున్నారు.

రాఘు — అయ్యో! వీరికి నేనేమి సమాధానముచెప్పి పోరు మాన్పింపగలను! (విచారించును.)

[సైనికులు యోధవేషములతో దుఃఖించుచు ప్రవేశింతురు.]

సైని — (ఏకగ్రీవముగా) అమ్మా, అమ్మా, యిది నిజమా తల్లీ, యిది కూడునా? (దుఃఖింతురు.)

రాఘు — బిడ్డలారా, దుఃఖింపవలదు. మీరు వెనుదీయుచున్నారని నేనీయుద్ధమును నిలిపివేయుటలేదు. మీబలము పదివేలును

ముప్పదివేల శత్రుబలముతోఁబోరి కొంతకాలమీ కోటను శత్రుహస్తములబడకుండ కాపాడగలుగుదురుగాని విరోధివాహిని మీకంటె మూడుమడుగులుండుటచే మీరు త్వరలో నశించుటయు నాపిదప మేము యవనులకు జిక్కుటయు దటస్థించును. కాబట్టి మేము ముందుగా జోహారుచేయుటయు పిదప దుర్గద్వారములు దెరచుటయు నిప్పుడవశ్యాచరణీయములు.

సైని—హాహా! దుర్భరము! దుర్భరము! తల్లీ మమ్మెవరికొప్పగించి పోయెదవు తల్లీ! కుమారజగపతి నేమిచేసెదవమ్మా!

రాఘ—కుమారులారా, యిది విచారింపవలసిన సమయము కాదు. మేము పవిత్రముగ జోహారుచేయబోవుచున్నాము. జగపతి శత్రువుల బారిపడకుండ కోటలోనుండి సురక్షితస్థలము చేరగలడు. దానికై మీరు చింతింపకుడు. జగపతిని మరల పెద్దాపురసామ్రాజ్య సింహాసనముపైని ప్రతిష్ఠింప మీరెల్లరు జీవించియుండవలయును; కాన, మీరిప్పుడు యుద్ధముమానక తప్పదు.

సైని—చల్లనిమాటవిన్నాము తల్లీ! అమ్మా, రాజన్నగారిని పంపెదరేని, వారినాయకత్వమున నరాతిబలముల త్రుటిలోనుగ్గునూచముగావించి-

రాఘ—నాయనలారా, మరల యుద్ధవ్యామోహమున నేపడెదరేల? రాజన్నయిప్పుడు వార్తాహరుడై విజయనగరాధీశ్వరుని కడకేగవలసియుండుటచే, నతనినియుద్ధకార్యములందు నియోగింప వీలులేదు. మీధైర్యసాహసపరాక్రమము లమేయములైనను ఇప్పుడింతకంటె చేయవలసినదిలేదు.

(తెరలో కలకలము)

రాఘు—(విని)అదిగో! విరోధులువిజృంభించుచున్నట్లున్నారు! ఇంక నొకనిముషములో కోటలోనికి ప్రవేశింపగలరు. రామమ్మా, బాలునిటు తెమ్ము. (బాలునితీసికొని లక్ష్మమ్మగారి కిచ్చుచు)అమ్మా లక్ష్మమ్మా, ఇదిగో వత్సవాయాంకురము. విజనగరాజాధీశ్వరులగు పూసపాటి విజయరామభూపాలుని ధర్మపత్నియు నీరాయజగపతి పినతల్లియునగు చంద్రయ్యమ్మాదేవికి* నిసుగులనొప్పగించితివేని, వీనికే లోపమునుండను. ఈకార్యభారమును వహించి మావత్సవాయవంశమును నిలువబెట్ట మీపాదములంటి ప్రార్థించుచున్నాను.

గీ. భావిపెద్దాపురీ మహీపాలుడైన
జగపతినిగాచి రక్షించు సర్వభార
మునుభరింపగ బ్రార్థింతు, బుడుతడితడు
మీకొమరుడంట మఱువగాబోకుమమ్మ!

రామ—అమ్మా లక్ష్మమ్మతల్లి,

సీ. పసిడితీగెల మేలివజ్రాల తూగుటు
య్యాలలోనూగెడు నట్టివాడు,
తులలేని మృదుహంస తూలికాతల్పంబు
లందున శయనించునట్టివాడు,
అంబనేనంత బాబయ్యమ్మ పాడిన
యందాక నిదురింపనట్టివాడు,
ప్రియజనంబులు వేనవేలున్న మీయంక
మందెయుండగ గోరునట్టివాడు,

* నిజమునకు శ్రీసీతారామచంద్రరాజుబహద్దరుగారి సతీమణికొప్పగింపుమని కాని చంద్రయ్యమ్మాదేవి కొప్పగింపుమని కాదన్నను కథానుకూల్యతకై యిట్లువ్రాయ వలసివచ్చినది.

గీ. తెన్నెతలంబెల్ల కన్నుల గప్పికొనగ
నెంతో యల్లారు ముద్దుగా నెదిగి-ముక్కు-
పచ్చలారని-తల్లి పాల్పదలనట్టి
బుడుతడీతండు మీ రెట్లు బ్రోవగలరో !

లక్ష్మి—అమ్మా! యింతమాత్రపు బన్నికై నన్ను మీరంత గా ప్రార్థింపవలయునా? ఇది నాకవశ్యాచరణీయమగు కార్యము కాదటమ్మా? ఈ బాలునికై మీరు చింతింపదగునా? నాకంఠమున ప్రాణములున్నంతవరకీ జగపతిని కాపాడుదానని శ్రీలక్ష్మీనృసింహస్వామి సాక్షిగ ప్రమాణముచేయుచున్నాను. నాభర్త యీ బాలరాజును కొలది కాలములలో పెద్దాపురసామ్రాజ్యసింహాసనమున నిలిపి కాని మరణింపడు. ఇంతవరకు తరతరములనుండి మీయాడవద్దిల్లిన యీకొండెపెల్ల వారి కుటుంబము, కృతజ్ఞతయు రాజభక్తి నిచూపునమయ మిప్పుడుగదా కలిగినది. అమ్మలారా, యిక కంటతడిపెట్టకుడు, మాకు సెలవొసగుడు. రాజన్నా, రమ్మా, ఆలసించిన ప్రమాదమగును.

రాజ—(దీనముగ) తల్లీ, మిమ్మెట్లువిడిచి యేగుదును ?

రాఘ—రాజన్నా, నేనుజీవించినంత కాలమును నూరుద్దీనును నిన్నును తగినవిధముగా సన్మానింపనే లేకపోయితిని. కానిమ్మా'—రాజన్నా, గురుదేవుని యాజ్ఞానువర్తివై మెలగుము. ఆయనకునావందనములని చెప్పుము. నీవుపుండేగి యీవార్తను విజయనగరమున నెఱింగించి, జగపతిరక్షణోపాయప్రయత్నములందుండుము. పోయి రమ్మా.

రాజ—అమ్మా అవశ్యమట్లొనర్చెదను.

రాఘ—లక్ష్మమ్మతల్లీ, మీఋణము మేము తీర్చుకొనలేము. మీరు సామ్రాజ్యసంరక్షకులుగాని పురోహితులు కారు. ఆదికాలమునుండి నేటిదాక మీబ్రాహ్మణులు మంత్రులై, దండనాథులై, పురో

హితులై క్షత్రియజాతికమూల్యోపకారమునొనగూర్చుచున్నారు.
బ్రాహ్మణులైనను-

సీ. తనగ్రంథరచనయేదక్క నితరమెఱుం
గక తన్మయతనుండు కవివరుండు,
తనపొలంబును సేద్యమునుజేసికొంటయే
గాని మాటెఱుగని కర్షకుండు,
తనదైవనియతవ్రతాచారములెకాని
యొండెఱుంగని తాపసోత్తముండు,
తన ధర్మమంత్రశాస్త్రములదక్క మఱేమి
యూహింపనట్టి పురోహితుండు,

గీ. కదనమనినంత కత్తులుకరములందు
దాల్చి, వైరులపీచముడుల్చి, రాజ్య
రక్షణార్థము రక్తము రణతలాన
జిమ్మెఱుగమె మేము లక్ష్మమ్మతల్లి!

అట్టిమహీసురులకు సహధర్మచారిణులై మీబ్రాహ్మణవనితలు యుద్ధసమయముల పరమేశ్వరీసమారాధనములు గాని రాజ్యేశ్వరీ సేవాతత్పరహృదయులై మాకుసహాయపడి సామ్రాజ్యము రక్షించినవారుకారా? తల్లి, నీవిప్పుడట్టి దుర్ఘటపావనకార్యమున నియుక్తవైయున్నావు. మీకు శుభమగుగాక, పోయిరండు.

(తెరలోకలకలము.)

లక్ష్మ—అమ్మా, మమ్మింకబోనిమ్మ. అమ్మా సెలవు, అమ్మాయీ సెలవు. రాజన్నా, రమ్మ. (బాలునితో నిష్క్రమించును.)

రాజ—అమ్మా, సెలవు, అమ్మా సెలవు. (నిష్క్రమించును.)

అందఱు—(ఒక్కపెట్టున) హా! కుమారా! హా! కుమారా! (దుఃఖింతురు.)

రామ—హా కుమారా! ఎంతలో మనకు వియోగము ప్రాప్తించెనురా తండ్రీ!

సైని—హా మహారాజకుమారా! నీకెట్టి దుస్థితివచ్చె!

రాఘు—(సైనికులతో) తనయులారా, ఈదుఃఖమును మేము భరింపలేకున్నాము. జోహారుతో గాని యుపశమింపదు. ఈజగపతిని సింహాసముననిలుపుభారము మీయదియని జ్ఞప్తికిదెచ్చుచున్నాను. ఇంకిట నుండకుడు.

సైని—అమ్మా, యీబాలజగపతిమహారాజు నీ సింహాసనమున నిలుప మేము బాసచేయుచున్నాము. తల్లులారా, యింక మీ సేవాభాగ్యమీ మందభాగ్యులకులేదా! (దుఃఖించుచు నిష్క్రమింతురు.)

రాము—హాతండ్రీ, నీకేమిగానున్నదో కదా!

రాఘు—బిడ్డా, విచారింపకుము. విధివిధానమిట్లున్నది! అమ్మా, గురుదేవుడు బ్రతికియున్నంతవరకు వానికి భయములేదు. చేతులారా అందివచ్చినయాత్మజుల యసువులదీసికొన్న నాకిట్టిపమెట్లు నివృత్తికాగలదు? కోడలా, (కోడలిచేతులుపట్టుకొని)

గీ. చేతులారగ నీపతిని జన్నతనయు
నంపె కాలునిపోలికినంపి నీకు
తీరరాని సంతాపముదెచ్చియుంటి
నయ్యొ! ఎట్లూరడింతువో యమ్మ నన్ను?

రాము— అత్తయ్య, దైవదుర్విపాకమునకుమీరేమి చేయుదురు? ఈవిపత్తునకు మీరు నిమిత్తమాత్రులుకారా? రాజ్యరక్షణార్థ మాత్మజభర్తృభ్రాతాదుల బవరములకంపుట మనక్షత్రియకాంతలకదియేతొలిసారమా? ఏమో క్షణకాలము భర్తృవియోగదుఃఖోద్రేకపరవశురాలనై దుఃఖించితిగాక యింకదుఃఖింతునా? నేను మాత్రమురాచపడతినిగానా? వీరమాతయగురాఘువమ్మాదేవి కోడలనుగానా? అత్తా, యింకనేవ్యాకులపడను. నాహృదయమిప్పటికి తెప్పరిల్లినది.

(తెరలో పెద్దకలకలము.)

"అల్లాహో అక్బర్ దీన్! దీన్!"

గౌరి—(రభసముగ ప్రవేశించి) అమ్మా, అమ్మా, తమయాజ్ఞ ప్రకారము కోటతలుపులు తెఱువబడినవి. శత్రువులు సంరంభముతో నిరాటంకముగ లోనికివచ్చుచున్నారు. చితులంటింపబడినవి. రాణివాసస్త్రీలాదెస చితులజేరుచున్నారు. రామయ్యమ్మదేవీ, యివిగో మీకు పసుపుబట్టలు. అమ్మలారా, త్వరపడుడు. (పసుపుబట్టలిచ్చును.)

రామ—(కైకొని ధరించును.)

రాఘు—(వికటహాసముతో) త్వరపడక మేమిట నింకచేయుటకేయున్నది? మాజనమంతయు నగ్నిహోత్రజ్వాలలయందుఱుకుటకు వినియోగింతుము. రామమ్మా, అదిగో! చితాగ్ని సహస్రజిహ్వాలతో నావిర్భవించి మనల నెనలోనికాహ్వానించుచున్నది. ఓ పవిత్రవీతిహోత్రా! ఆపద్బంధూ!-

ఉ. నాడటు సీతశీలము ననంతదయన్బ్రకటించి యాపె గా
పాడినవాడవీవు, కడుపావనమూర్తివి, మమ్మునింక గా
పాడెడువేళవచ్చె నిక వత్సవయాన్వయగౌరవంబు గా
పాడుము నిన్నుజొచ్చెదము పారముదంబున పావకేశ్వరా!

(చితివంకకు నడచును.)

రామ—అత్తా, నేనును వచ్చుచున్నానుండుడు. (కలవిలపాటుతో నిలునటుచూచి అకస్మాత్తుగ గొంతెత్తి) గౌరీ! నాపతిమస్తకమేది? (ఉన్మాదమున పరిక్రమించును.)

గౌరి—(నిష్క్రమించును.)

రాఘు—(పోయి రామయ్యమ్మను పట్టుకొని) రామమ్మా, ఏమది?

గౌరి—(ప్రవేశించి రామయ్యమ్మకు తిమ్మజగపతిశిరము నిచ్చును.)

రామ—(పుచ్చుకొని రాఘవమ్మాదేవిపట్టు విడిపించుకొని రోషముతో) ఎవడురా నాపతిశిరమునిట్లు ఛేదించినఖలుడు? పరాక్రమమునగాక స్వామిద్రోహమున నాపతిమూర్ధమునిట్లు ఖండించిన యీపాపి—యీ రాక్షసాధముడెంతకాలము పెద్దాపురసామ్రాజ్యసింహాసనము నెక్కి పాలింపగలడు?

గీ. ఏదురాత్ముడీమన్నెకమిట్లు వంచ
నంబునన్ జేసి తుంచి దుఃఖంబు నాకు
గూర్చె, నాఖలుకీర్తము కూలుగాక
ప్రక్కలై భువి నచిరకాలంబునందె!

చీ! చీ! పవిత్రమగు దేహాహుతిచేయుచు, నాచండాలుని దలచిన నా పాపము శమించుగాక! .........ఓవనితామానసంరక్షణదీక్షాపరాయణా! వైశ్వానరా!

గీ. ఈ పవిత్రశిరంబుతో నిపుడె నిన్ను
గలియుదును, పరజన్మమే గల్గెనేని
శ్రీకళాతిమ్మజగపతి సేవచేయు
నటులె సన్నోమవే తండ్రి! అగ్నిదేవ!

అత్తయ్యా, దయచేయుడు. (చితివంక కేగును)

అందఱు—లక్ష్మీనృసింహస్వామికిజయ్! (అను సంప్రార్థనము లతో చితులయందుజొచ్చెదరు. అల్లాహో అక్బర్ దీన్ దీన్ అను కేకలతో మహమ్మదీయులు రుస్తుముసహితముగా ప్రవేశింతురు)

(తెరపడును.)

ఇది ద్వితీయాంకము.

# పెద్దాపురముముట్టడి.

## తృతీయాంకము.

1. రంగము—పెద్దాపురముకోటలో రుస్తుంఖానుదర్బారు.

[రుస్తుంఖాను సింహాసనమునందు రసూల్‌ఖాన్,
ఇబ్రహీంఖాన్, కరీంఖానులు యథోచితాస
నముల నుందురు.]

రుస్తు—ఇదేమిచిత్రము రసూల్, ఇందఱుస్త్రీ లొక్కమాఱగ్గిలోనుఱికి మరణించుట నేనెచ్చటను చూడలేదే! వీరు చచ్చుచు చచ్చుచు ఎచ్చటను చోటులేనట్లే చక్కని లక్కమేడపక్కనే చితులంటించుకొని చావవలయునా? పోనిమ్మింక వీరిగొడవయేల? సర్దారులారా, మనకుపట్టుపడి నిర్బంధింపబడిన పదివేలమంది పెద్దాపురిపౌరులను భద్రముగా కాపాడుటయేకాని వారికేహానియు జేయవలదు! ఇది రాజమహేంద్రవరము షర్‌లష్కర్—కాదు కాదు—పెద్దాపురమునవాబ్ రుస్తుంఖానుని ఖరాఖండీహుకుమ్!

రసూ—అదేమి సర్కార్, వారితలల తెగనఱికి అల్లాకుప్రీతిగా కల్లామైనరుల నిర్మింపవలదా ?

ఇబ్రా—తెలంగివాళ్ళ్యాతల్ కాయల్‌తో మామాయుం వండేస్తాం సర్కార్ !

కరీ—సర్కార్, హిందివాళ్ళ్కారక్తా హిందివాళ్ళ్కాఖుంధామే ఎల్లాను సర్కార్, బహుత్ తమాషాగావుంటాది.

రుస్తు—సర్దారులారా, మీరు నుడివినవన్నియు రాజ్యాంగతంత్రకోవిదులగు మనవంటివారొనర్పవలసినవి కావు. రాజపుత్రిల మరణమునకైదురపిల్లు నీరాష్ట్రప్రజలు మనమిప్పుడు కారాగారము

లందుంచిన శత్రుసైనికులసందఱిని నఱకించుట గాంచి రేని, మండి పడి యుత్సాహముగ మనపై తిరుగుపాటు చేసిన ప్రమాదము వచ్చెను. చిరకాలానుభవము వలన నీరీతత్వము నేను బాగుగ నెఱుగుదును. అం [illegible]జలకు గుండెబెదరు గొల్పుటకు గాను మనము ముందుగ నట్టి [illegible]ముల జేసితిమి కాని యింకనట్టి చేష్టలక్కఱ లేదు. సింహాసనము [illegible] బలిగొన్నను, ఎన్నెన్ని దుష్కార్యములు లాచ[illegible], తక్కు లేదు; కాని, ఒకహిందూ రాజ్యమును పాలించు [illegible] ప్రభుప్రమాత్రమిట్టి దురాగతములకు [illegible]కొన్న సింహా[illegible]ము చిరకాలము నిలుచుట కష్టము. ఏదైన నట్టి కార్యమొనర్ప వలసిన యగత్యము కలిగెనా, దాని నత్యంతరహస్యముగా ప్రజలకు దెలియకుండను నిశ్చయమున్న నే గాని చేయరాదు. అందులకే గదా నే నిప్పుడు చిక్కిన బాలజగపతిని మఱియొకలాగు చేయుటకు వెనుదీయు చున్నాను: అన్నట్లు— ఖరీంఖాన్ !

కరీ— సర్కార్ !

రుస్తు— నిర్బంధమునందుంచిన రాయజగపతిని సోమిదమ్మను ఇచ్చటికి దీసికొనిరా! అప్పుడప్పుడు వారినిగాంచుచున్నగాని, నాకు తృప్తి కలుగదు.

కరీ— అచ్ఛా సర్కార్. (నిష్క్రమించును.)

ఇబ్రీ— సోదమ్మా బహుత్ అసాద్దోమనిసీ సర్కార్. జగ్ పతీమెంగిలీ ఖానా నహీ ముమ్మల్ని శౌనా మోహం సేసిందీ సర్కార్.

రసూ— సోమిదమ్మ అంతపెద్దకోక నెందుకుకట్టునో నాకు బోధపడకున్నది.

రుస్తు— బోధపడుట కేమున్నది ? యజ్ఞము చేసినవాని భార్య ముప్పదిమూళ్ళకోక ధరింపవలెనట ! విపరీతశాస్త్రము ! అదియేమొ కాని యామెధోరణి నాకు దురవగాహముగ నున్నది. అదిగో! సోమి

దమ్మగారు వచ్చుచున్నారు! అమ్మా, దయచేయుడు ; బాలమహారాజు క్షేమమా?

[రాయజగపతినెత్తికొని లక్ష్మమ్మయు, వారివెంబడిని
కరీమును, ప్రవేశింతురు.]

లక్ష్మ—సాహేబయ్యా, ఎందుకోయి మమ్మల్నిలాగ కాల్చుకుతింటున్నావు? నాకొడుకునీ నన్నూ యిలా బతకనియ్యవా యేం!

రుస్తు—(మందహాసముతో) అమ్మా, బ్రతుకనిచ్చెడువాడనే గాకున్న యీయన నీపాటికేచంపియుండనా? వెఱ్ఱితల్లివి! నేను పసిపాపలను పరిమార్చునంతటి కసాయివాడననుకొంటివమ్మా?

లక్ష్మ—(సాభినయముగ) అబ్బే-లేదు, పెద్దపెద్దల్నే గుటుక్కున దిగమ్రింగగలవు.

రుస్తు—అమ్మా, తప్పుతప్పు-ఇంత సాహసమా? కప్పముగట్టనందులకు రాజపుత్రులను నేను కొంచెము కఠినముగా మందలింప, అంతలో వారాత్మహత్యచేసికొని చనిపోయిరి. ఇదే కిట్టనిలోకులు గోరంతలు కొండంతలుచేసి, నేనువారికి నూనెకాచిపోసితిననియు చిత్రవధచేయించితిననియు నాపైని అపనిందలుమోపి నన్నునిందించుచున్నారు. ఈకల్లవార్తలనెల్లనమ్మి మీరుకూడ నన్ను దూషించుట భావ్యముకాదు.

లక్ష్మ—(నిర్లక్ష్యముతో) పోనిద్దూ, ఎవరేమయితే నాకేం విచారం? నాకొడుకూ, నేనూ, క్షేమంగావుంటే—

రుస్తు—(వికటముగానవ్వి) మీకొడుకు? ఇతడుమీవాడే నైన వీనియందు తిమ్మజగపతిమహారాజు పోలికలున్నవేమి? అమ్మా, నీరహస్యము నాయొద్ద నెందుకుదాచెదవు? నేనపకారమాచరింతునని యా? వెఱ్ఱిభ్రమ! ఇట్టి యపోహములమాని నిజమెఱిగింతువేని, మీకొకజాగీరు ఈయగలను.

రసూ—అమ్మా, భయములేదు నిజముచెప్పుడు.

లక్ష్మి—మొట్టో పీడు నాకొడు కేసయ్యా అని దేవుళ్ళాడుతూ వుంటే, వినిపించుకోవు నేనేమిజేతును? ఇద్దరు మనుష్యులెక్కడా వొక్కలాగవుండరని శాస్త్రంచెబుతూవుంటే నాకొడుకు తిమ్మరాజు గార్లాగవున్నాడంటూ విదెక్కడిగ్రహచారంవచ్చింది? బ్రాహ్మనాళ్ళకు డబ్బుండడంపాపమని ఏదోశాస్త్రముఅరుస్తూవుంటే నాకేమిటో జాగీరులిస్తానంటావు, నాకొడుకు నెత్తిని కిరీటంపెడతానంటావేమి పాపం? ఇంకానయం— ఏనుగనిస్తానన్నావు కావు! దానిపొట్టకి గుళ్ళూ బెళ్ళూకూడా ఆటవు!-

రుస్తు—(స్వాములవంక కనుగీటి) కూడ కేషేర్ బక్రీకాబచ్చా నహీహై! (లక్ష్మమ్మతో) సోమిదమ్మగారూ, నామాటవినుడు. ఈ బాలుడు తిమ్మజగపతిరాజు కుమారుడేయైన నీయగసీసింహాసనమునందు నిలిపి నేను రాజమహేంద్రవరము పొందలచుకొంటిని. మీకొకజాగీరు కూడ లభింపగలదు. అందివచ్చిన యదృష్టఫలమును త్రోసిపుచ్చి మీరు బాముకొనునదేమి? నేను మీకాప్తకోటిలోనివాడనని నమ్ముడు. మీయమంకుతనముచే రాజపుత్రునకు కలుగబోవు వైభవమును దూరముచేయకుడు. ఏమందురు? (తనలో) ఈబాలుడు నే దలచినట్లు జగపతియేయైనట్లీమెవలన దృఢపడియెనా నాయదృష్టమెంతనవచ్చును!

సేవ—(ప్రవేశించి) సర్కార్, తోటపల్లినుంచీ గూఢచార్లూ వొక్డూ ఆతీహై!

రుస్తు—తాళు-తాళు, కరీంఖాన్, వీరికాలస్యమైనది. వీరిని జాగ్రత్తగా రాజగృహమున విడిచిరమ్ము. పిమ్మట నేనచ్చటికేగి క్షేమమును గనుగొందును.

కరీ—(సోమిదమ్మ జగపతులతో నిష్క్రమించును.

రుస్తు—అరే, గూఢచారునిప్పుడు ప్రవేశపెట్టుము.

సేవ—(నిష్క్రమించును.)

గూఢ—(ప్రవేశించి) సలాం సర్కార్ !

రుస్తు—వార్తలేమి ?

గూఢ—సర్కార్, తోటక్ పట్టీసున్యాలీకీ తరిమీయేస్ని రమారాజు సుభారాజుల్నే సలీజరాల్తగిలీ నచ్చిపోయార్ సర్కార్. కుమన్ రాఘ్యూ హెక్కడికీ పరారీహువిందీ తెల్సిందీలేదూ.

రుస్తు—(పకపక నవ్వుచు) సెభాస్ ! మంచివార్త చెప్పితివి. మన్యపుజ్వరముకూడ మనయనుచరుడే కావలయును, మనకు మంచి యుపకారమొనర్చె. బాగుగనున్నది. ఇంకనీ వీరత్రియములో కృష్ణారాయడొక్కడు దాటిపోయినాడా ? కానిమ్ము. వీడొక్కడును మిగిలిమాత్రము నన్ను చేయగలుగునదేమున్నది ? ఓరీ, నీవింకపో వచ్చును.

గూఢ—(నిష్క్రమించును.)

సేవ—(ప్రవేశించి) సర్కార్, హింకో ఏగుల్ వాడూ రాజా నగ్రినుంచి-

రుస్తు—రమ్మనుము రమ్మనుము.

సేవ—(నిష్క్రమించును.)

గూఢ—(ప్రవేశించి) సలాముసర్కార్, తమకుమాల్యూ నూరుద్దీన్ సాహెబ్ నిన్నరాత్రిమే ఖైద్ తప్పించుకోని పరారీహైనార్.

రుస్తు—(నిర్లక్ష్యముగా) ఇంతేగదా ! ఏమోయనుకొంటిని. వానినింక కారాగారమునందుంచవలసినపనిలేదు. కాన వానివిముక్తి నాకానందదాయకమే: నీవింకపోవచ్చును.

—

గూఢ—(నిష్క్రమించును.)

సేవ—(ప్రవేశించి) సర్దార్, గోల్కొండానుంచీ నైజామ్ సాహెబ్ తరఫ మనిసీ—

రుస్తు—గోలకొండనుండియా? వెంటనే ప్రవేశపెట్టుము.

సేవ—(నిష్క్రమించును.)

దూత—(ప్రవేశించి) సలామ్ షర్లష్కర్ సాహేబ్। నైజామ్ ఉల్—ముల్క్ వార్నుంచీ తమిక్కీ హుకుం తెచ్చాన్! (లేఖనిచ్చును.)

రుస్తు—(పుచ్చుకొని రసూలుఖానునకిచ్చి) ముఖ్యాంశములను మాత్రమే చదువుము.

రసూ—(అందుకొని విప్పిచదువును.) "నీచర్యలన్నింటిని మేము ఖండించుచున్నాము. మేమొసంగిన సేనతో వెంటనే గోలకొండకు తిరిగిరమ్ము. లేకున్న నిన్ను శిక్షింపకవిడువము."

రుస్తు—(పకపక నవ్వి) నేనింకను తనసేవకుడననియే నైజాము భ్రమించుచున్నాడే! పాపము! రుస్తుముఖానిప్పుడు సర్వస్వతంత్రుడగు పెద్దాపురమునవాబుకాని తన చేతిక్రింది రాజమహేంద్రనరము షర్లష్కర్ కాదని మీనవాబుతో చెప్పుము. రామబారీ, నేను మీనబాబుగారి యాజ్ఞలను మన్నించుకాలము గతించినది. ఇక పొమ్ము. దీనికి జవాబీయుబడదు.

దూత—(కోపముతో) ఇంతా ఘోరం సేసీ—బడా మాయా సేసీ జవాబ్ నఖో సెప్పీ—

రుస్తు—(రోషముతో) ఔ—నంత ఘోరమే చేయుదును—జవాబీయను. మారుమాటాడిన శిరచ్ఛేదముచేయుదును. (కత్తి దూయును.)

దూత—(పాఱిపోవును.)

రుస్తు—(కత్తి వరలోనుంచి పకపకనవ్వుచు) మూర్ఖుడు!—నాకింకను ఈనైజామెవ్వడు? మనము వత్సవాయవారినొకలాగునను నైజామువారి నొకలాగునను సంభావింతుమా రసూల్!

రసూ—నిజము! మనదృష్టిలో అల్లాబక్కే పిల్లాబక్కే!

రుస్తు—సరే, రసూల్, దర్బార్ బంద్ కరో!

రసూ—(లేచి) దర్బార్ బంద్ హోగీ!

(రుస్తుముతప్ప నితరులందఱు నిష్క్రమింతురు.)

రుస్తు—(సింహాసనముదిగి పరిక్రమించుచు సాలోచనముగ తనలో) నూరుద్దీను చెఱతప్పించుకొని పాఱిపోయినందులకు నాకు చింత లేదుగాని వీనినింత నేర్పుతో నభేద్యమగు కారాగృహమునుండి కర్కశులగు కావలివారలకన్నులలో దుమ్ముజల్లి రహస్యముగా తప్పించిన వాఁడెవ్వఁడై యుండునో యని యే నాయాందోళనము!

చారుఁడు—(ప్రవేశించి) సర్కార్, తమకుమార్గపరార్థమైన రాజానగ్రిం ఖైదుగదిలో యీ ఉత్తరం—యీ చోటారాయి—యీ దారంఫూ వ్యాకే సాంకెనాయే సర్కార్! (వానిని యిచ్చును.)

రుస్తు—(అందుకొని) మంచిది, నీవుపోవచ్చును.

చారు—(నిష్క్రమించును.)

రుస్తు—(లేఖ చదివి) సరే, ఇది యబ్బాయి తప్పించుకొనిన విధానమును విశదము చేయుచున్నది. కాని యీలేఖనురచించి వీని విముక్తికిదోడ్పడిన మేధావి యెవ్వఁడు? ఈలేఖ నీరాతికీదారముతో గట్టి కారాగారగవాక్షమునుండి లోనికివిసరి లేఖనందించినవ్యక్తి యెంతనిపుణుఁడు! (దారమును పరధ్యాన్నముగా త్రిప్పుచు పురివిప్పి యాశ్చర్యముతో) ఇదేమి! ఇంతసన్నని దారమునందిన్ని పోచలగుపడుచున్న వేమి? ఇది యొకజందెములోని తునక యగుట నిశ్చయము. అయిన నేయజ్ఞోపవీతధారి—మహాబుద్ధిశాలి—వీరశిఖామణి—యింత చాతుర్యముతో వీనినివిడిపింప—ఆఁ! ఆఁ! తెలిసె—తెలిసె! ఇది యాసుబ్రహ్మణ్యసోమయాజికృత్యమనుటకు సందేహములేదు. ఆతనికి గాక యొరులకెట్టి ప్రజ్ఞాసామర్థ్యములెక్కడ? ఈబ్రాహ్మణునినిక

నిర్లక్ష్యముచేయరాదు. ఓరీ దుష్టబ్రాహ్మణాధమా! అసమాన రాజ్యతంత్రవిశారదుడగునీ రుస్తుంఖానుముందు గోచిపాతరాయడ వగు నీప్రతిభ యెంతరా!

సీ. ఏగవర్ణని ధరణీశుల బ్రార్థింప
కడకు జరిగినట్టి ఘనత యేమి?
విపులశక్తిని రెండువేలబలంబును
గొని తెచ్చినట్టి యాగొప్పయేమి?
ఆనాడు పటవృత్తమందున రాజన్న
నిలుపగానైనట్టి ఫలితమేమి?
ఇపుడు నూరుద్దీనునెట్లొ తప్పించి త
ర్వాతగావించు కార్యంబదేమి?

గీ. నీప్రయత్నములన్నియు నీటిమీది
వ్రాతచందాన నిట్లు నిష్ఫలముగాగ
ఏల యీలీల పెద్దాపురీరమా స
ముద్ధరణదీక్ష వర్తించుచుందు? భేల!

(శ్రమనటించుచు) ఇస్! అబ్బా! కార్యభారాతిరేకమునగాబోలు నిద్రవచ్చుచున్నది. ఇంతప్రయాసముతో నీరాత్రి జగపతిని చూడకున్ననేమి? అరుణోదయాత్పూర్వమేపోయి చూడవచ్చును. అదిగో! అప్పుడే కుముదబాంధవుడు మెల్లమెల్లగ మేఘసోపానములనుండి నభోసౌధమునెక్కుచు హృదయాహ్లాదకరముగ చిఱునవ్వువెన్నెలల గురియుచున్నాడు.

గీ. అశ్రమంబుగ నృపతుల నట్లుజంపి
కడకు నైజామునీగతి కన్ను బ్రామి
పేర్మి పెద్దాపురీసింహపీఠిగొన్న
వీరునిన్ గాంచవచ్చితివే మృగాంక!
(సగర్వముగ నిష్క్రమించును.)

## 2. రంగము—రాజగృహము.

[లక్ష్మమ్మ రాయజగపతిరాజుతో లోననుండ లోడీఖాన్ గాసులు ఖడ్గపాణులై బయట కావలియుందురు.]

జగ—(ఏడ్చుచుండును.)

లక్ష్మ—అబ్బాయీ, నిద్రిపో, జోలపాడతాను.

" జో కరధృతరథాంగ జో సన్నుతాంగా—
జో కరుణాపాంగ జో శుభాభంగ ॥ జోజో॥

౧. శ్రీవెలయు పాలవారిధి బవ్వళింప-దేవబృందములెల్ల దివినన్నుతింప-భావించిభక్తులను బరగబాలింప-దైవరాయుడ మాకు దరమొవర్ణింప ॥ జో॥

౨. గురుతరంబుగ ధర్మగుణముచేబట్టి-దురితదానవకోటి దురమునను గొట్టి- శరణాగతత్రాణబిరుదుచేబట్టి-కరుణతో కౌసల్య గర్భమునబుట్టి ॥ జో ॥

3. కమలసంభవవినుతఘనసుగుణసాంద్రా - యమితదుష్టభుజంగ యహితుండికేంద్రా-విమలవైభవములను వెలయుదేవేంద్రా-రమణతో వెలసితివి రఘురామచంద్రా ॥ జో జో"

లోడీ—(ఆనందముతో) బహుత్ అచ్ఛాగా గానాసేస్తావ్ సోదమ్మా!

గాన్— సోదమ్మాగానా దాయూలాగుంటాదిరా లోడీఖాన్.

లక్ష్మ—(పాడును.)

" పుట్టుభోగివై వరపుత్రుడవై । పూరిపాన్పుపై పవళింపగలేదా-
అయోధ్యారాజ్యంవిడనాడి । అడవులలో సంచరింపగలేదా-

అతిక్లేశమ్ములు పడగవలసెనా ! కారణమిాలాగుననుండగను-
అదితప్పించుట అజునకుశక్యమా!స్వామి మిారుచింతింపగ నేలా?"
(విసవిస బయటకు బోబోవును.)

లోడీ——సైరో సైరో! అస్తమానం యెక్కడిక్కి యెల్తూం టాన్ సోదమ్మా ?

లక్ష్మి——సాయేబయ్యా, యెక్కడికెడతాను నానెత్తిమిాదికే ? ఈదిక్కుమాలినరోగము పట్టుకుచంపకపోతే యిన్నిమాట్లుబయటికి పోతానా ?

గౌస్——మఱి, ఎల్లేదానవు కోటా దాటీయెల్తావెందుక్కు? కోటాలో కూకోకూడ్దూ?

లక్ష్మి——దిక్కుమాలినపరీక్ష ! కానీ, మిాతో నిజంచెప్పకపోవడమే ! ఈకోటలో రాణీలు బలవంతంగాచావడంచేత కామినీ దెయ్యాలయారు. ఆడవాళ్ళు వంటరిగా యేమూలకేనావస్తే పీకపిసికి చంపుతారు. తెలిసిందా ? ఇక్కడికెదయింది: యింకకోకకూడా——

లోడీ——జరుగురునై——జరుగురునై. సర్కార్ మిాకీయింక కోకాపరీచ్చ జరుగురునై సెప్పేర్. సోదమ్మా, ఏక్టుమిారీ గానా సేసీ బయటికీయెల్లిరా సైతాన్పట్టుకూహెంమ్కు సచ్చిపోతావ్ !

లక్ష్మి——(స్వగతము) ఒడిలోనున్న పిల్లవాడు 'కేరు' మని ఏడిచినను వినపడకుండనుండుటకు పాటయేపరమసాధనము! (పైకి) ఓ, దానికేం ! (పాడును.)

"ఒడిలోనపుష్పములు కోయ్యడేరాజూ—— నేధర్మనందనుని యెడబాయలేనే!మునివడ్లుమునిపళ్ళ కోఉుకడేరాజూ——ఆధర్మనందనుని యెడబాయలేనే! అలికివిడిచినగడప దాటిన్నవాడూ——ఆపాపకర్ముణ్ణి నేబొందలేనే! దివ్వెలేనీగృహము చూసిన్నవాడు——ఆపాపకర్ముణ్ణి నేబొందలేనే !——(నిష్క్రమించును.)

**లో**డీ — సోదమ్మా గయ్యాళ్ మస్సీరా గాన్ !

గాన్—నై నై. బహుత్ మంచీమస్సీరా భాయీ।

లక్ష్మి—(ప్రవేశించి పాడును.)

"గోపాలకృష్ణుడూ గోవిందా రామ— గోవుల్ని కాయుచును గోవిందా। గోపికలనందర్ని గోవిందా రామ—గోతులో పడద్రోసె గోవిందా। గోపికలంతటను గోవిందా రామ—"

**లో**డీ—అరే, అరే, సోదమ్మా, గోపాల్ కుట్టుడూ గోవుల్ని కాశాడు పసంద్ గావుంది—గోపికాబీబీల్ని గోతులో హేష్ఫూతో శాడ్ సోదమ్మా, ఆచ్చెరంసెప్తావ్ ?

లక్ష్మి — ఓరి నీకడుపుడక ! మాపురాణాలుకూడా నీకు తెలుసునటా ? గోపాలకిష్టమ్మ గోపికాకన్యల్ని మామూలుగోతులోకి పడద్రొయ్యలేదు. మోహమనే గోతులోకి తోశాడని వేదాంతశాస్త్రం వెయ్యివిధాల చెబుతోంది.

లోడీ } గాన్ }—(విరగబడి పకపకనవ్వుచు) బహుత్ అచ్ఛాహై; బహుత్ తమాష్ హై ! ఆహాహా ! ఆహాహా ! ఆహాహా ! (నవ్వెదరు.)

[రభసముగ సుబ్రహ్మణ్యసోమయాజి నూరుద్దీనులు
ప్రవేశించి ఆకస్మికముగ లోడీఖానుగానులమీ
దబడి కత్తులలాగికొని వారల నాసికా
రంధ్రములచెంత మత్తుపదార్థ
ములనుంచి వారువివశులై
నేలపై వ్రాలె]

సుబ్రి—(గదిలోనున్న లక్ష్మమ్మవంకకుజూచి) ఔనే ! వచ్చుచున్నావా లేదా ?

లక్ష్మ—(సమీపించి) ,ఆ— ఆ—జగపతిని చేబోలుపంపించినారా ?

సుబ్రి—ఆహా ! ఎప్పుడు వానినోడిలోకట్టుకొనివచ్చి నాకిచ్చితివో అప్పుడే యాతనిని చేబోలుపంపినాను. ముందు నీవీనూరుద్దీనుతో చేబోలుపొమ్ము. నేనుప్రొద్దుటనేవచ్చి మిమ్ముకలసికొందును. ఈరక్షకభటులకింతలో తెలివిరాదు. రమ్ము మనమిప్పుడు రహస్యమార్గమున బోవలెను.

లక్ష్మ—వచ్చుచున్నానుండుడు. పిల్లవానిని తప్పించినపని తీరినవెనుక మోయలేని యీకోక నాకెందుకు ? (సగముచీరను చింపి లోనికివిసరివేసి) ఇంక తేలికగా నడచివచ్చెదను.

(సోమయాజి, లక్ష్మమ్మ, నూరుద్దీనులు నిష్క్రమింతురు.)

(తెరలో నౌబత్ ఖానాధ్వని.)

[రాత్రివేషముతో రుస్తుముఖాను ప్రవేశించును.]

రుస్తు—అరేగాస్, అరేలోడీ, బుద్ధిలేదురా యేమిటీనిద్ర ? (గదివంకజూచి) సోమిదమ్మగారూ, సోమిదమ్మగారూ, (గదిలోనికేగి వెదకి సగముచీరను చేతబట్టుకొని ప్రవేశించి)వీరిని మోసపుచ్చి సోమిదమ్మ జగపతినిదీసికొని పలాయనమైనట్లే చీరయే చెప్పుచున్నది ! ఔరా యెట్టియుత్పాతము ! ఎంత మోసము ! (ఇరువురభటులదన్నుచు) అరే గాస్ ! లోడీ !

లోడీ }
గాస్ } —(లేచి కలవిలపడుచు) సర్—కా—ర్,—సర్-కార్ !

(అని వణకుదురు.)

రుస్తు—ధూర్తాధములారా. ద్రోహులారా, సోమిదమ్మ జగపతులేరిరా ?

లోడీ—సర్కార్, హెన్కపాట్ను హొవోనచ్చీ యేమో ముక్కుల్లో పెట్టితే సచ్చిపోయామ్ సర్కార్! దాన్మీదాహంతా సీకటి హాయిపోయింది సర్కార్!

గౌస్—రచ్చించవాలా సర్కార్! గానాసేసీ సోదమ్మ మమ్మల్ని మోసంసేసిందీ సర్కార్! మగ్గయాంహాయినామ్ సర్కార్!

రుస్తు—ఛీ దురాత్ములారా! నోరుమూయుడు. (తెరవంక జూచి) అరేకరీం!—ఇబ్రహీం! తక్షణమిటురండు-

[కరీం ఇబ్రహీంఖానులు ఖడ్గపాణులై ప్రవేశింతురు.]

రుస్తు—వీరి నురిదీయింపుడు. జగపతితో సోమిదమ్మపలాయనమైనది. వారినిపట్టి తీసికొనివచ్చినవారికి పదివేలవరహాల నిచ్చెదమని చెప్పి చారుల నలువంకలకు బంపుడు. (శ్లోకనిచ్చుచు) ఆమెశ్లోకలోని భాగమిది: దీనిసహాయమున నామెనానవాలుపట్టుడు. పొండు.

కరీం—(తీసికొని) అచ్ఛాసర్కార్!

(కరీం ఇబ్రహీంఖానులు రక్షకభటులనిరువుర నిర్బంధించి తీసికొనిపోవుదురు.)

రుస్తు—(విచారముతో పరిక్రమించుచు) అక్కటా! ఎంత దారుణము! అన్నా ఎంతప్రమాదము! నాకోటజొచ్చి నాసేవకులకు మత్తుమందుజూపి నారక్షణమందున్నవారినే గొనిపోసాహసించిరే బందెపోటుకాండ్రు! ఇందులకేమొనర్తు? (ఆలోచనాయత్తుడై యుండును.)

చారు—(ప్రవేశించి) సర్కార్!

రుస్తు—(పరాకుగానుండును.)

చారు—సర్కార్!

రుస్తు—(ఉలికిపడి) ఎవరది?—ఏమి?— ఇట్లులవచ్చితివి? జగపతిపట్టుబడినాడా? చెప్పవేమి?

చారు—ఇజయనగ్రిం యెల్లి వచ్చినచారుణ్ణి సర్కార్!

రుస్తు—ఆఁ జౌనౌను జౌనౌను—చెప్పు చెప్పు: ఏమి వార్తలు?

చారు—విజయరామరాజూ రాఘవరాజూ దండూరస్తాతో యిజయ్‌నగ్రింనుంచి చేబ్రోలుకాడకీ వస్తూన్నార్. కుమన్ రాయ్డు రెండువేల్ అనకాపల్లిబోయపౌజ్తో చేబ్రోల్ కాడకీ వచ్చినాడ్. కళింగసర్కార్ షర్ లష్కర్ అన్వర్దీన్ యిజయనగ్రింమహారాజ్తో కల్సి పాలుజూర్తో లడాయికీ వస్తున్నాడ్ సర్కార్!

రుస్తు—పొమ్ము; పోయి సేనల యుద్ధప్రయాణమున కాయత్తము సేయింపుమని రసూల్ ఖానుతో చెప్పుము.

చారు—అచ్ఛా సర్కార్! (నిష్క్రమించును.)

రుస్తు—సర్వవినాశనము! భూకంపము! అల్లా అల్లా! ఇప్పుడు తెలిసినది. ఈతంత్రమిప్పుడర్థమైనది! అబ్బా! అబ్బా! ఎంతమోస్తు! కృష్ణారాయుడు బోయసేనతో చెబ్రోలులోనుండునా? విజయరామరాజచ్చట వారినిగలసికొనునా? ఇంతలో సోమిదమ్మ జగపతినిదీసికొని యచ్చటకుచేరుకొనునా? ఎట్టిగభీరతంత్రము! ఎట్టిపరిశయవిజృంభణము! ఆ దురాత్ముడు—ఆ బ్రాహ్మణాధముడు—మాయావి సోమయాజియే యీవ్యూహమునిట్లు పన్నెననుటతథ్యము! వీనియౌద్ధత్యమునెట్లడంతు? వీరిబలమునెట్లు చూపుచూపుదు?.........ఔరా! అల్లుడనినిడిచిన కృష్ణారాయుడు నన్నుదుర్కాన వచ్చునంతటివాడైనాడే! అన్వర్దీనుకూడ సాటికులమువానినిజంప నాద్రోహులు—హిందువులలోగలసినాడే! శతృబాహుళ్యమునకై జంకను—చింతింపను-కాని జగపతి చేయిదాటిపోయినాడే! ఇందులకే మొనర్తును? కానీ అన్నిటికీ నల్లాయే యున్నాడు! (నిష్క్రమించును.)

## ౩. రంగము—చేబ్రోలులో శిబిరములు.

[విజయరామరాజు, రాఘవరాజు, నూరుద్దీన్, రాజన్న జగపతినెత్తుకొని లక్ష్మీసోమిదమ్మ (మాఱువేషంతో) కృష్ణారాయుడు, అన్వరుద్దీన్ ఖానుడు ప్రవేశింతురు.]

విజ—అమ్మా, లక్ష్మమ్మా, నీస్వార్థప్రాణత్యాగవిశ్వాసములు చిరస్మరణీయములు. మా కుమారుఁడు జగపతి ప్రాణరక్షణమునకై క్షత్రియోచ్ఛిష్టముగూడ నిశ్శంకముగా భక్షించిన నీవెంత యుదారహృదయవో యూహింపఁజాలను. మీకొంపెల్ల కుటుంబము మా ఆప్తబంధువులగు వత్సవాయివారికొనర్చిన యనంతమహోపకారమును జన్మజన్మములను మఱవకుండ నిలువేల్పువలె నిత్యము నీకు మ్రొక్కుటకంటె మేమేమి చేయఁగలము? (సంతోషబాష్పములతో లక్ష్మమ్మ పాదములకు నమస్కరించును.)

లక్ష్మ—శీఘ్రమేవ విజయసిద్ధిరస్తు! మహారాజా, యీనాటికి నేను ధన్యురాలనైతిని. మీవంటి మూర్ధాభిషిక్తుల సంతోషపెట్టుటకంటె నాపరిశ్రమకు సార్థకమేమి కావలయును? ఇంతకును, రాఘవమ్మాదేవి నాయందుంచినవిశ్వాసమునకు మాటదక్కినదంతియే చాలును.

విజ—(విచారముతో) హా రాఘవమ్మతల్లి! ఆత్మబంధుఁడనయ్యు సాటిక్షత్రియుఁడనయ్యు నీకిట్టియాపత్సమయములో తోడ్పడని మందభాగ్యుఁడనైతినే! అంతయుపరిసమాప్తియైనపిదప నీవిషాదచరిత్రము వినవలబడెఁగాని నేనంతలో పెద్దాపురమునవ్రాలి పరిపంథిజనుల హతమొనర్చి మీదుర్గమును రక్షించియుండనా? మా రాఘవమ్మతల్లి కుమారులతో—కోడండ్రతో—బంధుమిత్రపరివారముతో

దివికేఁగ సంధ్యాసమయమింతలో దాపురించునని యెవ్వరూహించిరి? కట్టా! ఎట్టిసామ్రాజ్యమున కెట్టిపాటు కలిగినది!—

సీ. దైవంబునైన ప్రత్యక్షంబుగావించు
  మహిమాఢ్యులైన బ్రాహ్మణులతోడ
విజ్ఞానప్రతిభచే విశ్వంబునెల్ల గె
  ల్వగజాలునట్టి కవివరులతోడ
పరమేశ్వరుండెత్తివచ్చిన నెదిరింప
  గల్గు ప్రతాపభాస్కరులతోడ
భాసునిగమసంబునైనసద్గ ప్రభా
  న్వితలైన వరపతివ్రతలతోడ
గీ. వత్సవాయప్రభుత్వప్రభాప్రకాశ
  రాజితంబైన పద్దాపురంబు నేఁడు
పతినిగోల్పోయి, పగతురవాతఁజిక్కి,
  శ్రీలనెడబాసి, శిథిలమై చేటువడెను!

రాజన్నా, మీరు మాకేల వార్తనంపలేదు?

రాజ—మహారాజా, మాసర్దారులకు మేమువ్రాసిన లేఖల నన్నిటిని రుస్తుముహరించెగాని యొక లక్షసైన్యము మాదుర్గరక్షణార్థమప్పటికి వచ్చియుండెడిది. సర్దారులనమ్ముకొనుటచే మీకు శ్రమనీయమైతిమి.

సూరు—మహారాజా, రాకొమరులచెంత నేనుండిన నింతపని జరుగనిత్తునా? కోటలో నాతండ్రి కాలు పెట్టియుండునా? ఇంతకు, అల్లాకుమనపై కృపలేదు.

కృష్ణా—కోటలోనుండియే శత్రువుల నెదుర్కొందమన్న నావాక్యముల నొక్కరును వినరైరి. లేకున్న, రామరాజ సుబ్బరాజాదులు, నేనును కోటలోనుండ రుస్తుము చేయగలుగున దేముండును?

విజ—గతమునకింక విచారించినఫలమేమి ? ముందుగతి చూచుకొందను. అన్వరుద్దీన్‌ఖాన్‌సాహెబ్, అయాచితముగ నీవు మాకు తోడ్పడవచ్చినందులకెంతయు సంతసించుచున్నాము.

అన్వ—(ఉగ్రుడై) ఆదగల్బాజీరుస్తుం ఘోరంమీదా ఘోరం సేస్తూహుంటే హమారా పాణం ఘుర్మైసోనా హెట్లాసేస్తుంది జనాబ్ ? రుస్తుంగిస్తుమిన్నా పచ్చడీసేసీ సిఫాయిల్కో సఫాసేసీ ఛోటా జగపత్ మహారాజ్కో తక్తుమీదా కూకోపెట్టి సలాంసేయ్‌వాలాని హుద్దేషంతో గాభరాహైపోతున్నామ్.

విజ—సెబాస్ ! కాని-ఖాన్‌సాహెబ్, యిట్లు నీవు నీయంత మాకు సహాయము చేయవచ్చుటలో నీయభిప్రాయమేమి ?

అన్వ—(స్వగతము.) అసాద్దెంమనిసీ యిజయ్‌రామ్‌రాజ్ ! (పైకి) ఏక్—పరోపకారంజనాబ్ ; దో-మిత్రోనేస్తం ; తీన్—మున్పటీ లాగ రాజమహేంద్రికోటామే కుషీహుండాలని, బస్ !

విజ—(నవ్వుచు) అసాధ్యుడవు ! సరి-అట్లేకానిమ్ము. రాఘవరాజా, వత్సవాయవంశపీఠుడవుగు రాఘవమ్మాదేవి సన్నిహితజ్ఞాతి వియునగునీవు నేటియుద్ధమునందు సర్వసేనానాయకత్వమువహించి విజయమునుగూర్పగోరుచున్నాను. (అందఱివంక దిరిగి) ఇది మీకెల్లరకు సమ్మతమేగదా !

అందఱు—రాఘవరాజునకు జయ్ !

సేవ—(ప్రవేశించి) జయము! జయము ! మహారాజా, ఆర్య గురుదేవులశ్వముమీద శరవేగమునవచ్చుచున్నారు.

విజ—తత్క్షణమేపోయి హాయమునందుకొని వారినిట ప్రవేశ పెట్టుము. సభ్యులారా, రండు, వారికెదురేగుదము.

సేవ—(నిష్క్రమించును.)

(తెరలో గుఱ్ఱపుగిట్టల సవ్వడి.)

[సుబ్రహ్మణ్యసోమయాజి వీరోచితవేషమున రభసముగ ప్రవేశించును.]

అందఱు—(ఎదురేగి నమస్కరింతురు.)

విజ—(పీఠమును జూపుచు) దయచేయుఁడు.

సుబ్ర—(ఆయాసమునటించుచు కూర్చుండకయే దక్షిణహస్తమునెత్తి యాత్రముతో)

గీ. భానువంశాబ్ధిసోముని వత్సవాయ
జగపతిక్ష్మాతలేంద్రుని సర్వభద్ర
లక్షణాకారు మాపురభూరమణు క్షేమ
వార్త వినిపింపరే మహీపాలులార !

అందఱు—రాయ జగపతిమహారాజునకు జయ్ !

లక్ష్మ—(బాలుని భర్త కందించి) ఇదుగో బాబు !

సుబ్ర—(అందుకొని) నాయనా, యింక నీకు భయములేదు. నాకన్నులబడకపూర్వమే రుస్తుము నిన్నపహరింపజాలెనుగాని యింక ని న్నాఖండలుడేని తేరిపారిచూడగలడా ? (బయలునంకజూచుచు రోషముతో) ఓరీరుస్తుం ! మాయావీ, ద్రోహీ !

మ. ధరణీనాథుల నాజిగెల్చుటయసాధ్యంబౌట వంచించి ము
ష్కరవృత్తిన్ దెగటార్చి నాయకులులేకన్ గుందు మాదుర్గమున్
నిరపాయంబుగజొచ్చియేలెదు ఖలా, నిశ్చింతతో నింక నీ
ధరణీదేవుకు నీదురంతములకింతన్ స్వస్తి జెప్పండొకో !

విజ—అందుకుసందేహమేమి ? కాని-ఆర్యా, ప్రస్తుతము వార్తలేమి ?

సుబ్ర—(బాలుని లక్ష్మమ్మచేతికిచ్చి) మనసేనలన్నియు సర్వసిద్ధముగా నున్నవా ?

విజ—ఆ-హా !

సుబ్రి—అయిన వినుడు:-

చ. జగపతిచేయిదాటిన విషాదభరంబున క్రుంగి క్రుద్ధుడై
నగరవనీధునీగిరుల నవ్యచిరంతనభూతలంబులం
దగపడినట్టివారిని ప్రయాసముతోడ పరీక్షచేసి యా
నగదురవచ్చునిట్టులదె సత్వరమాతని దాకవేగుడీ!

విజ—సరే రానిండు. అంతలోనేమయ్యె! క్షణములో మన వారిప్రతాపమాతడు రుచిచూడగలడు. రాజన్నా, లక్ష్మమ్మ గారిని రాణివాసపుగుడారములందు దిగవిడచి మనసైనికులనందఱి నా చేరువకు బిలువుము.

రాజ—చిత్తము. (లక్ష్మమ్మగారిని వెంటబెట్టుకొని నిష్క్రమించును.

సుబ్రి—మహారాజా, రాణివాసపుశిబిరములకు తగినకావలి యున్నదికదా?

విజ—ఉన్నది. త్రినేత్రుడైన యీవంకకు రాజాలకుండునట్టి యేర్పాటులజేసినాను.

రాజ—(ప్రవేశించి) మహారాజా, మనసైనికులందఱదిగో! ఆవంక బారులుతీఱి తమహితోక్తులువిన నువ్విళులూరుచున్నారు.

విజ—మంచిది. ఓ ఆంధ్రవీరవరేణ్యులారా,-

ఉ. భండనభూమి స్వైరగతి బాహుబలోద్ధతిజూపి వైరివే
దండములన్గలంచి మిముదార్కొనవచ్చువిరోధిసేన మీ
చండతరోరుఖడ్గముల జయ్యనజెండుచు విక్రమించి యు
ద్దండపరాక్రమక్రమముతప్పక మీరనిసేయబోవరే!

చ. అదిగదిగో వినంబడెడునయ్యదె మ్లేచ్ఛులసింహనాద మ
ల్లదిగదిగో కనంబడెడునయ్యదె వారలపాదధూళి య
ల్లదిగదిగో యతండు కడుహాసుగనెక్కినదంతి, యాఖలున్
ముదమొదవన్ వధింపుడు చమూదళముల్ వెఱగందిపాఱగన్.

రాఘు—ఓ వాహినీ పతులారా,-

మ. ప్రకటంబై భుజవిక్రమక్రమరణ ప్రావీణ్యమున్ నవ్యది
వ్యకళాలోకము లోకమంతటికి చూపన్ జాలునీ యుద్ధమే
నికషంబై-ఎటులోర్చి యీయవనులన్ నిర్జ్వరమున్ జేసి మీ
రకలంకంబగు కీర్తిగాంచెదరొ వీరాగ్రేసరుల్ హైందవుల్ !

కృష్ణా—ఓ ఆపద్బాంధవులగు అనకాపల్లి బోయవీరులారా,

గీ. కన్నుదోయిని క్రోధాగ్ని కణములురల
ఘోరదంభోళులట్టుల వైరిసైన్య
జీవనంబులహరియించి చేవజూపి
యనియొనర్పరె లోకభయంకరముగ !

రాజ—ఓ వీరావతారులారా,-

శా. శత్రువ్యూహముజీల్చి వారల కవోష్ణక్షోణితంబందు మీ
గాత్రంబుల్ పరిపూతమై వెలయ ప్రక్షాళించి, యుగ్రాకృతిన్
ధాత్రీచక్రముకంపమొందగ జయధ్వానంబులన్ సల్పి, సు
క్షాత్రంబున్ రహియింపజేయరె యశఃకాయార్థులై ధీరులై.

సూరు—సాంగ్రామికకళావేత్తలగు నో శూరులారా,-

గీ. జాలమున రాకుమారులజంపి రాఘు
పమ్మదేవికిచితిగూర్చి బాలునిపుడు
హతమొనర్పగ వెన్నంటు నఘచరిత్రు
ద్రుంపకుండగ నేను నిద్రింపవలదు.

అన్వ—హే ముసల్మాన్ భాయీయో, లడాయిహాంకే పండగ పులావ్ లాగ తయార్ కావాలా. హిప్డు జగపత్ మహారాజ్కొ రచ్చించనాన్కి ప్రాణాల్ దార్ పోయ్ వాలా. ఇజయ్ రామ్ రాజ్ మహారాజ్కొ మాటదక్కించవాలా.

అందఱు—జగపతిమహారాజునకు జయ్ !

(తెరలో)

అల్లాహో అక్బర్! దీన్! దీన్!

[రుస్తుముఖాన్, రసూల్‌ఖాన్; ఇబ్రహీంఖాన్, కరీంఖానులు, ఖడ్గపాణులై సైన్యముతో నట్టహాసముగ ప్రవేశింతురు.]

రుస్తు—ఓరోరి దస్యాధములారా, ఎందుకీప్రగల్భములు!

గీ. కదన మొనరింపగాలేక కన్నగాని
పగిది జగపతిగొనిపోయి పాఱజూతు
రిద్ది పాత్రించె? నిలువు!—మీరెట్టి వీర
వరులొ రవ్వంత గాంతు భూపాలులార!

లుచ్ఛా నూరుద్దీన్, అప్పుడే నీవిచ్చటకువచ్చి నాతో బోర నుంబరపడు చున్నావా? నిలుమొకక్షణములో నీయంతముగుజూతును. ఓరీ అన్వర్, నీచా, జాతిద్రోహీ, స్వార్థముకొఱకై మతాంతరులకు నీ యాత్మగౌరవము విక్రయించికొనుటకు నీకు సిగ్గెంలేక పోయినదిరా?

గీ. జాతిద్రోహమొనగూర్చుజనుని వంశ
మెల్ల నిర్వంశమైపోవు, నిట్టివారి
యునికి దేశంబునకు మతమునకుగూడ
ఘనతతగ్గింపదే? కళంకంబుగాదె?

అన్వ—అరే రుస్తుమ్, నీకీ దొంగయేసాల్ మాకీసాలా తెల్సున్, నోర్ మూస్కొని లడాయికీ తయారుహాయి!

రాజ
నూరు } (పండ్లు పటపటకొఱుకుచు కత్తుల నొఱలనుండిదూసి)

ఓరీ నీవటరా మాకు నీతులనుపదేశించుపాటివాడవు? (రుస్తుముపై బడబోవుదురు.)

విజ—(ఇరువుర నిరువంకలకులాగిపట్టి) ఆగుడాగుడు. వీని కొక్కింతబుద్ధి నేనేగఱపెదను. రుస్తుంఖాన్!

సీ. కనులకుగనిపించు తెనుగుపడంతుల
నవమానపఱచిన యట్టినాడు,
కన్నకుమారుని కరపాదములు కట్టి
పెట్టి యణంచినయట్టినాడు,
తంత్రంబుచే ఘరాఘవులనిర్వురబట్టి
పొట్టయందిడుకొన్న యట్టినాడు,
అబలగొంపోయెడు నర్భకు నిర్దయ
బట్టి బంధించిన యట్టినాడు,
గీ. జాతిమతధర్మమార్గమే జాడబోయె
ఆత్మగౌరవ బాంధవ్యములెగనెటకు ?
నీవు చెప్పిన శ్రీరంగనీతులెల్ల
నప్పుడేత్రోవబట్టెనో చెప్పగలవె ?

సుబ్రి—(రోషముతో)

మ. అరరే! ఘాతుకవృత్తి నైచ్యమున ద్రోహప్రక్రియన్ క్రూరతన్
కరవాలంబులలాగి మాప్రభువులన్ ఖండించినట్లిప్పుడీ
పరసైన్యంబులజంపవచ్చితివె వహ్వా! సాగునే తంత్రముల్ ?
కరపద్మంబులఖడ్గముల్ నెలుగ తాకన్ జాలుదే మమ్ములన్ !

రుస్తు—పోరా బిచ్చగాడా, నీతోనేమి ? ఓ ముసల్మానుదళవాయులారా,-

ఉ. కాఫరులన్ వధించి మసిగాల్చుట శాస్త్రము షక్కి, యిప్పుడీ
రూపముగాలభించిన తెలుంగువరూధినిజంపి వీరలన్
నూపము వెట్ట దైవము సతోషణుడై మనకిచ్చు కామ్యముల్
చాపములన్ శరంబులను శస్త్రములన్ గొని వారిదాకుడీ !

రాఘు—(చేయెత్తి) ఓ ఆంధ్రవీరపుంగవులారా, (గొంతెత్తి)

ఉ. చూచెదరేమి తెచ్చవడి చోద్యముగా నరిసేనమీద నా
రాచపరంపరల్ విడిచి కాలఁగఁగొట్టుడు శత్రుశీర్షముల్ !
రాచబలంబు, వెల్మలపరాక్రమమున్, మనబోయసేన పై
శాచికవిక్రమంబు నొకసారి విజృంభణమొందనీయరే !

(సంకులసమరము జరుగును. రసూల్, ఇబ్రహీంఖాను, రుస్తుమ్, కరీంఖానులు పాఱిపోవుదురు. సుబ్రహ్మణ్యసోమయాజి విజయరామరాజులుతప్ప కడమవారందఱు వారిని వెన్నంటితఱుముచు నిష్క్రమింతురు.)

(తెరలో పెద్దకలకలము.)

విజ—గురుదేవా, ఆవంకఁజూచితిరా మనవీరులెంత యుత్సాహముతో బోవుచున్నారో !

సీ. కంపింపగాభూమి ఘనశతఘ్నులను
బేల్చి యరాతుల జీల్చువారు,
కరమునకై దుమస్సకములం బలిగొని
పగలను జీకాకుపఱచువారు,
వే[illegible] కచ్చిదని ప్రేలికిలంజేసి
యవనులశరీరముల్ చెఱుగువారు,
పోటునకోర్చిపడి పోటునుగలగుచ్చి
శత్రుసంఘంబులనలుపువారు,
గీ. యవనసైన్యమహార్ణవమందు గ్రుంకు
లిడుచు కోకనదచ్ఛాయ నెల్లతను
వులనుదోఁపఁగ వెలువడి పోవుదురట
అహాహా ! ఆంధ్రులశౌర్యమాహాత్మ్యమేమొ !

అదిగదిగో! ఆదెస సమరమంతకంతకు భయంకరమగుచున్నది. ఓహో! నూరుద్దీను ప్రభుభక్తి! అదనైనప్పుడెల్ల తనతండ్రిపై బడుచు రుస్తుమునుచంపుట కెంతప్రయత్నించుచున్నాడు! ఆహాహా! రాజన్న ఒక్కపెట్టున రసూలిఖాన్ ఇబ్రహీంఖానుల నిట్టెపరిమార్చినాడే! సెబాస్! రాఘవరాజా, సెబాస్! వెనుకపాటున రాజన్నను పొడువనుంకించిన మహమ్మదీయవళవాయి నెంతనైపుణ్యముతో తెగటార్చితివి! ఏమీ యీ అనకాపల్లి బోయవీరులప్రతాపము! కృష్ణారాయుని యాజ్ఞానువర్తులై వీరుగావించుచున్న వీరకర్మకంతముగలదా? ......అదేమి! అశ్వారుసైన్యములు వెనుకకుతగ్గుచు నంతయుత్సాహముతో బోరకున్నవేమి?......అరరే! ఏమది?—మనసైన్యములు వెనుకకొదుగుచున్నవే! ఏమి మహమ్మదీయుల విజృంభణము! ఓ ఆంధ్రయోధపుంగవులారా, ఆగుడాగుడు—వెనుకకడుగిడెదరేని మీ మొగముచూడను.

గీ. విజయరామావనీపతి విజయలక్ష్మి
గొనుటయేకాని యపజయమనుట యుంగ
డట్టివానికి నీనాటి కపజయంబె
గూర్తురో జయముగూర్తురో గూడ్పుడింక.

సుబ్ర—అదిగో! మీవాక్యములనువిని కుపితులై కృష్ణారాయని బోయసేన మహారయమునబోయి రుస్తుమఖానుడెక్కియున్న గజమునుముట్టడించి యంబారిత్రాళ్ళను తెగనఱికి తురుష్కప్రభువును తుత్రించయత్నించుచున్నారు. ఓహో! ఈబోయలకుంతాఘాతములకు విపక్షవ్యూహమెంతగ తల్లడిల్లి కలకవడుచున్నదో! ఆహా! నూరుద్దీనెంతవేగముగా అచ్చటికేగి పితృనిర్వాపణమునకై యత్నించుచున్నాడు!

(తెరలో పెద్దకలకలము.)

" జగపతిరాజునకు జయ్ ! ఆంధ్రమాతకు జయ్ !

విజ—గురుదేవా, అదిగో! మనకు జయములభించినట్లున్నది.

సుబ్ర—కాని—మహారాజా, తమకోడిపాఱుచున్న మహమ్మదీయవీరుల నింకను మనవారు వెన్నంటితఱుముచున్నారు. మహారాజా, యిది అన్యాయము, మఱియు సంధ్యాకాలమాసన్నమైనది. ఈనాటికీయుద్ధమాపుట ధర్మము.

విజ—నిజము—ఓ ఆంధ్రవీరవరేణ్యులారా.

గీ. ఓడిపరతెంచువారి వెన్నాడిచంపు
టెంతయునధర్మ, మదిగాక, యిపుడు సంధ్య
దాపురించె సంగ్రామమునాపి నేటి
కింక విశ్రాంతిగైకొన నేగుడయ్య!

(తెరలో కలకలము. 'ఆంధ్రమాతకు జయ్ !' అని జయారావములతో తెరజిమ్ముకొని రాఘవరాజు, నూరుద్దీన్, రాజన్న, కృష్ణారాయుడు, అన్వర్ధీనుఖానులు రక్తసిక్తదేహములతో బ్రవేశింతురు.)

నూరు—(విజయరామరాజువంకతిరిగి రోషముతో) ఇదేమిన్యాయము ?

గీ. ఎవనిజూపెకుతలపున నింతవరకు
గాచియుంటిమో, వీరవిక్రమము నలిపి
యుంటిమో, వానిజంపక యుండ సమర
మెట్లుముగియింపనగును మహీంతలేశ ?

విజ—నాయనా, ఇదిరణధర్మము.

నూరు—శాత్రవులొనర్చిన అధర్మకార్యములకు గునముసంతసించి ధర్మబద్ధులమైయుండుటేమినీతి ?

సుబ్ర—కుమారా, యింతలో యుద్ధముముగిసినగదా నీయాందోళనము? మరల తెల్లవారినదేతడవుగ రణరంగమునందుఱుకుటకివ

కాలముండగ నీవింతలో సంగ్రామమే చాలించినట్లు చిన్నబుచ్చుకొనెదవేమి?

నూరు—చిత్తము.

అన్వ—జనాబ్, హమారామన్ని ఏక్ వుంది. ఇక్కనాకీ సాల్నంత పనిసహీ. హుకుమ్‌హోస్తే రాజామహేంద్రికోటాకీ ఎల్లిపోతాన్.

విజ—(చిఱునవ్వుతో) ఖాన్‌సాహెబ్, యీయుద్ధమునందు నీవుమాకు తోడ్పడినందులకెంతయు నిన్నభినందించుచున్నాను. మన సఖ్యతనిట్లే వర్ధిల్లనిమ్ము. పోయిరమ్ము. రాజమహేంద్రవరదుర్గమును మఱల నీకొసగుటకు మాకెంతయు ముదావహముగనున్నది.

అన్వ—అస్సలామలేకుముజనాబ్! (సలాముచేసి నిష్క్రమించును.)

సుబ్రి—ఈతడీరణమున మనకుతోడ్పడుట రామహేంద్రవర దుర్గమునాక్రమించుకొనుటకేనా లేక మఱేమైన దురాలోచనముండియా!

విజ—ఆఁ—ఏదురాలోచనమున్నను ఈ అల్పుడు మనకు చేయగల అపకారమేమి?

(తెరలో, "ఆంధ్రమాతకు జయ్! జగపతిమహారాజునకు జయ్!")

విజ—అదిగో! విజయానందముచే మనసైనికులు కోలాహలము చేయుచున్నారు. దయచేయుడు. లోనికేగి నేటివిజయకారకులను సంభావింతము.

నూరు—(పరిక్రమించుచు—మధ్యనాగుచు—సాలోచనముగ తనలో) రణధర్మమట! రణధర్మము!! శాత్రవులకే లేనిధర్మము మనకేల? విజయరామరాజునాడు రణధర్మముపేర చీకటిపడకుండగనే యుద్ధమునిలిపెనుగాని నాపితనీపాటికి ప్రేతాలయమునకనిపియుండనా? కానీ, మించినదానికేమిచేయుదును? గురుదేవుడన్నట్లు మరల రేపటి

దినము రాదా ? అప్పుడాతని నేను పరిమార్పనా ? అయిన - నేడస్త్ర
నుని పదునెనిమిది వేలబలమున్నప్పుడే రుస్తుమును హత మొనర్పలేని
మేము శేషాతసైన్యముతో లగిపోవ నెట్లు కార్యనిర్వహణ మొనర్ప
గలము ? తెల్లవారిన నీతడు మఱికొంతబలమును రప్పించుకొనకుం
డునా ? అట్టిఅవకాశము మాకులేదే ! కృత్రిమోపాయకుశలుడగు
నీమాయావి - అసాధారణ మేధావి — రేపు తనకు విజయముదుర్లభ
మనితోచిన తెల్లవారునంతలో నెట్టియింద్రజాలముపన్ని యెట్టిదుగా
గత మొనరించి మమ్మునాశనము చేయనూహించునో యెవ్వడుచెప్ప
గలడు? ఈదురాత్ముడు నేటిపరాజయమును సహించి యూరకుండు
వాడు కాడే! అందుచే నీదుర్జాతిపశువు నీ రాత్రియే - యీక్షణమున నేతు
దముట్టుపవలయును. లేకున్న మాకు క్షేమము లేదు. ఔను, ఈ తల్ప
గతదర్శకరము నిప్పుడే యంత మొందింపవలయు. ఈ కలుషాత్ముని
కడతేర్చుటకు నే జేసినప్రతిజ్ఞ పాలింపదగునదనిది కాదా ? నాప్రతిజ్ఞ
సాధారణమైనదా ? ఔ-నది భీషణప్రతిజ్ఞ ! భీషణప్రతిజ్ఞ ! — కఠోర
కార్యము ! తండ్రిమా తనయుని యెడ ?- మోసమా పోషకురాలిని ?-
ఘోర, నీచ, కుత్సితవధయా కుమారగతుల్యుల ? ప్రభుపరమేశ్వరుల ?
......వలదు — కారణములువలదు. ఏమి ? సామ్రాజ్యసింహాస
నమా ? సర్వాధికారసంపదయా ? మహాభోగవిలాసమా ? — స్వేచ్ఛా
ప్రతిబంధకము లే ! అనర్థకములే ! అనుచితములే ! — ఇందుకొఱకు
రాజ్యద్రోహమా ? ఇందునిమిత్తము మిత్రద్రోహమా ? స్వామి
ద్రోహమా ? ఇందులకై పుత్రనిర్బంధనమా ? వీనికై అసత్యప్రలా
పములా ? ఈ కలుషకౌటిల్యాలింతిక ప్రభాసురీచికాన్తమయకాల
మెప్పుడు? ఈ పవిత్రసుహమ్మదువంశక్షీరరత్నాకరబడబానల క్షీణ
సమయమే నాడు ? ............పితృహత్య ! పితృహత్య ! — ఆ
భీషణప్రతిజ్ఞాపర్యవసానము పితృహత్యయే ! పితృహత్యయే ! (కరవాల
ముపుదూసి యున్మాదముతో రంగమున నిష్క్రమించును )

[తెరయెత్తబడగా రుస్తుముఖాను పటకుటీరమునందలి శయనాగారము గోచరించును. రుస్తుంఖాను దైన్యముతో పచారము చేయుచుండును.]

రుస్తు—ఏబదివేలసైన్యముతో నెత్తివచ్చినను నాకు జయము లభించినదికాదే! అక్కటా! విధివిరోధమునకు నేనేమిచేయుదును? శత్రువులందఱొక్కమాఱేకమై యింతలో నాకైబడెదరని నేనుకల నైనదలచితినా? విజయరామరాజు ముప్పదివేలు అన్వర్దిన్ పదునెనిమిదివేలు మొత్తమేబదిరెండువేలదళముతో నన్నుప్రతిఘటించిరని చింతిల్లుటకాని ఆదురాత్ముఁడు కృష్ణారాయని రెండువేలఅనకాపల్లి బోయవీరులను దలచినయంత నాయొడలు కంపమొందుచున్నది. అబ్బా! ఏమి వారిపరాక్రమము! ఈ బోయవీరుల యీటెలపోటులకువెఱచి సమరోత్సాహముదక్కి విగ్రహమొనర్పనిరాకరించునా సైనికులనిర్బంధించి రేపు జన్యమునకాయత్తముచేయుటెట్లు? నాదళమునందు ముప్పదివేలసైన్యముమరణించుటచే వీరికిఁబ్రధనమన్నంతదిగులుపుట్టుచున్నదే! నాయాజ్ఞనుపాటించి నాసైనికులొకవేళ సంగ్రామమొనరించినను రేపునాకు జయములభించునను నమ్మకమేమి? విజయరామరాజుసైన్యము పదునారువేలును అన్వర్దినువాహిని యెనిమిదివేలును నేటియాహవమునందుమడసినను మిగిలిన యిరువదివేలసైనికులను బోరుటెట్లు? అభూతగభీరమహాతంత్రమునగాని కార్యసాధనమగునట్లులేదు. అందులకేమొనర్తును? బొలజగపతిని మరలచెఱపట్టుదునా? అనకాపల్లిబోయవీరులు కుంతములుచేఁబూని రాణివాసగుడారములకుఁగాపుండుటచే నీప్రయత్నమువ్యర్థము! శిబిరములలోనికి భూసారంగములఁద్రవ్వించి ప్రధానవాహినీపతుల పరిమార్తునా?—లేదు—లాభములేదు. అట్టికార్యకౌశల్యముగల రసూల్ ఇబ్రహీంఖానులు హతులైరి? అన్వర్దీనుని కర్ధరాజ్యమాసజూపి యాతనిసహాయముతో రేపు విజయరాముని నోడించి కార్యానంతరమున నాతనిని

కడతేర్చుదునా? కాని యిదిసాధ్యముకాదే! తనపదవినాక్రమించిన నాతోనాతడు సఖ్యపడునా? అయిన—మఱికొంతసైన్యము నెక్కడి నుండియైన రప్పింతునా? ఇస్! వీరుగాక క్రొత్త ముసల్మానుసైనికు లింకనెక్కడనున్నారు? సోమయాజిమత్ప్రచారదుర్బోధనములవిని వినియున్న రాష్ట్రప్రజలొక్క యంధ్రసైనికునైన నాసైన్యమునజేర నిత్తురనుమాట కల్ల. ఇంక నాకధికసేనలెట్లులభించును? ఇంక నీవిజ యరామునెదుర్కొను వెఱవేది? అయ్యో! తుదకీ రాజతంత్రప్రవీణు డరాతిహస్తములకుజిక్కు దుష్కాలమాసన్నమైనదా దైవమా! విజ యరామునిఖడ్గదేవతకు నేను బలియగుదునా యేమి?

(తెరలో ధ్వని.)

ఇప్పుడీ యమంగళధ్వనియేమి? ఆ—అమంగళమింక మహమ్మదీ యునికేల? హైందవుల సహవాసబలిమిచే నాకుకూడయీపిచ్చియే పట్టినదే!......గసూల్! అయ్యో! యింకెక్కడి రసూల్! కరీం!—

కరీం—(ప్రవేశించి) సర్కార్

రుస్తు—ఆధ్వనియేమో కనుగొనిరమ్ము.

కరీం—(నిష్క్రమించును.)

రుస్తు—ఇంతరాత్రివేళ నీఘంటారవమేమి? ఇది గజఘంటా నినాదముగా దోచుచున్నది. శత్రుసైన్యములాదమఱచి నిద్రించు చున్న నాసైనికుల సంహరింపవచ్చుచుండుట లేదుగద! ఛీ! అట్లె న్నడుజరుగదు. ఈ పిచ్చిహిందువులు మరణమునకైన సమ్మతింతురు గాని రణధర్మమును పరిత్యజింపరు!—(ఎదుటకుజూచి) ఏమికరీంఖాన్!

కరీ—(ప్రవేశించి) అన్వర్దీన్ యిజయరామ్‌రాజ్తో మోసం చెప్పి పెద్దాపురంకోటాపట్కొని కుపీహుండాలని వాబుద్దేషంతో చెల్గయా సేస్తూన్నట్టు మనయేగుల్ వాఖ్యాసెప్తార్ సర్కార్!

రుస్తు—(ఆగ్రహోన్మాదముతో) ఛీ! దురాత్మా, యెంత దుర్వార్తనాతో చెప్పసాహసించితివి! అందులకిదే శిక్షయనుభవింపుము. (ఖడ్గముదూసి కరీంఖానుని నఱుకును.)

కరీ—(చచ్చిపడిపోవును.)

రుస్తు—(విషాదాందోళనములతో) అయ్యో! ఇప్పుడెంత పాడు పనిచేసితిని! కట్టా! శేషించిన యీసేనానాయకునొక్కనిని చేజేతుల జంపుకొంటినే! ఛీ పరమవిశ్వాసియగు కరీంఖానుని ఖండించిన యీ కరవాలము నాకేల? (కత్తి విసరివేసి పర్యంకముపై గూలబడును.) నాకంత్యసమయము మేతెంచినదా యేమి? సన్నిభూమ్యాకాశములు మ్రింగునా యేమి? శత్రువిషాగ్నికలలు నన్ను నలువంకలను గ్రమ్మి భస్మీకృతముగావించునా యేమి? (నిట్టూర్పువిడచును.)

[నూరుద్దీను ప్రవేశించును.]

నూరు—(ప్రక్కనొదిగియుండి తనలో) ఇదియదను! అదిగో రుస్తుంఖాన్! అదే యాతని నిశ్వాసధ్వని! ఇదది ఘనవిశ్వాసముగాక! రాజ్యకాంక్షచే గావించిన స్వామిద్రోహ-మిత్రద్రోహ పుత్రద్రోహ కిల్బిషమిప్పుడే యంతరించు!

రుస్తు—(లేచి) ఏమీచింత రుస్తుమా విచారముచే వికలహృదయుడై కుంగిపోవువాడు?—ఇకచింతింపను. వేఱాలోచనము చేయను. ఈయుసర్దీనేగి పెద్దాపురముకోటను స్వాధీనముచేసుకొనునుగాక! నాకిదియునొకమేలే! అన్వర్థనఱుగ పదివేలదళముతఱుగుటచే నిప్పుడు పదునెనిమిదివేలు బలముమాత్రమేగల విజయరామరాజుపై నాయిరువదివేలబలముతో నీక్షణమునబోయిపడిన నాకెందులకు విజయములభింపదో చూచెదను. శత్రువీరులజీల్చి చెండాడి చిత్రవధ గావించెదను. ఈహిందువులపురాణములలోని అశ్వత్థామరూపము నీరాత్రిప్రత్యక్షముగా చూపెదను. ఈ చెంబ్రోలులో నేటిరాత్రి రుస్తుంఖానుగావించిన దారుణచిత్రవధాచరిత్రమును కవీశ్వరులు గానము చేయుదురుగాక! ఈరుస్తుంఖానుచర్యలు ముసల్మానులోకమునకు



పెద్దాపురము ముట్టడి.

పుట ౯౭.

ముదావహమగుగాక! సోమయాజితంత్రములు-రాజన్నపరాక్రమము-విజయరామరాజుశక్తియు నిప్పుడేమగునో చూచెదను. నూరుద్దీను మరాత్ముడీ రుస్తుంఖానుని సామర్థ్యమునకు విస్మయపడుగాక! శత్రునిర్మూలన మొనరించుదనుక పట్టినకత్తి విడువను! —విడువను!!—
(క్రిందనున్నకత్తి నందుకొనబోవును.)

నూరు—(అకస్మాత్తుగ రుస్తుముఖానుపైబడి కుత్తుకపట్టుకొని వెనుకకునెట్టి పాన్పుపైకూలనేసి సాటూతరోషముతో) చిత్రవధ! చిత్రవధగావింతువేమి? అంతవరకు—అంతవరకు—నీవీలోకమునందుందువా? మునల్మానులు నీచర్యలకు సంతసింతురనుకొంటివా కలుషాధముడవగు నీవలన మతమునకు—వంశమునకు కళంకమువచ్చినదని విలపించునుగాని నీవంటి ఘోరకర్మునే మహమ్మదీయుడు సభినందింపడు. ఇటుచూడుము—నూరుద్దీనిప్పుడు నీదుస్థితిచూచి యానందించుచున్నాడుగాని నీప్రతాపసామర్థ్యములగాంచి నివ్వెఱపడుటలేదు. దురాత్మా, తలంచినంత ప్రత్యక్షమైన వీడెవడో తెలిసికొంటివా?—వీడు!—వీడు!—వైరినిర్యాతనకఠోరప్రతిజ్ఞానిర్వహణదీక్షాపరాయణుడగు నూరుద్దీన్! ఇంకనీవు? నీవు?—అప్రతిమానరాజ్యాంగతంత్రకళావిశారదుడవే! అనిందితసాహసవిక్రమసంపన్నుడవే! పరిపంథిమస్తకవిచ్ఛేదనక్రియాచతురుడవే! కాని—కాని—అమృతమధురక్షీరముల హాలాహలము కలసినది! జ్యోత్స్నామయజ్యోతిర్మండలమును సాంద్రశ్యామలధారాధరములాచ్ఛాదించినవి! అంతయు విపాకము! అంతయునంధకారబంధురము!—రాజ్యవిజిగీషను ప్రభురక్తస్రోతస్వినుల ప్రవహింపజేయుదువా? దుర్మదాంధమున నమానుషమాయాకార్యకలాపమునకు దొరకొందువా? ఏ మహారాజ్యమునుపాలించు మహోత్కర్షమున నిన్ని—యిన్ని—మత్సరదురంత దారుణహింసాకార్యముల నాచరించితివో ఆరాజ్యపు పొలిమేరలో

నైన నీకు చావుమూడుయోగ్యత లేదు! ఎవ్వరు నిన్ను చేరదీసి కూడు గుడ్డనిచ్చి—మహాధికారపదవులిచ్చి——ద్వాదశవర్షములు పారములేని ప్రేముడిని రక్షించి పోషించిరో అట్టి రాజచూడామణుల భక్షించిన దుర్నయమునకు నూరుద్దీనిప్పుడీ ప్రళయఖడ్గ నిర్ఘాతమున నీశీర్షము సహస్రశకలములుగ వ్రక్కలుగావింపనున్నాడు! ద్రోహీ! ఈపాటికి నీ పాపకృత్యములకు పశ్చాత్తాపపడుము. అల్లాను స్మరించుకొనుము. నిరుపమాన రాజ్యతంత్రవిశారదా! నీకిక విమోచనమసాధ్యము! ఆత్మ విమోచనము తథ్యము! అల్లా! హుం!! (రుస్తుంఖానుని చంపి పాఱి పోవును.)

### 4. రంగము—పెద్దాపురముకోటసమీపమున.

---

[విజయరామరాజు, రాఘవరాజు, కృష్ణారాయుడు, సుబ్రహ్మణ్యసోమయాజి, రాజన్న, నూరుద్దీనులు, యోధవేష ములతో ఖడ్గహస్తులై ప్రవేశింతురు.]

విజ—రుస్తుంఖానువధకును నూరుద్దీను రాజభక్తికిని సంతసించిన మనకింతలో నిట్టిదుర్వార్తయా? ఈయన్వర్దీసింత నురాగితము నిట్లు మిత్రద్రోహము చేయునా?

సుబ్ర—మహారాజా, యీయన్వర్దీనుకుక్షిలో నేదియో కుట్ర యున్నదని నేను నిన్ననే యనుమానించితిని. కాని, యీవిధముగా నీతడు మనల మోసముచేసి రాజమహేంద్రవరదుర్గమున కేగక పెద్దాపురమే వచ్చి మనకోటనే స్వాధీనము చేసికొనునని గ్రహింపనైతిని.

విజ—గురుదేవా, పోనిండు. మఱియొకసారి మనచేతులకు పనికలిగినదే కాని యింతకంటెవిశేషములేదు. ఈయన్వరు బలమిప్పుడు

పదివేలకు మించిలేనప్పుడును మనకు పదునెనిమిది వేలవరకున్నప్పుడును వీనిని మనము లక్ష్యపెట్టవలసినపనియేమున్నది?

సుబ్రి—మహారాజా, యీకోట అభేద్యమను మాటను మీరు మఱచితిరి. మనమిప్పుడు కోటను ముట్టడించిన అందున్న పదివేలును మనపదునైదు వేలనేగాక మఱియొక పదివేలసైనికులగూడ అవలీలనోర్వఁగలదు.

కృష్ణా—ఇందతిశయోక్తి లేశమును లేదు: ఈదుర్గమట్టిదే! ఇదిగాక వీరిప్పుడు మనరాకనుగాని రుస్తుమురాకనుగాని యెదురుచూచుచు సర్వవస్తుసంచయములతో యుద్ధమునకు సంసిద్ధులైయుండుటయేగాక మఱికొంతసైన్యమునుగూడ యీపాటికి రావించుకొనియుందురనుటకు సందేహము లేదు.

రాఘు—అట్లయిన పదిపదునైదు వేలసైన్యమును విజయనగరమునుండి రావించుకొనువరకు రణమును మానినఁ?

నూరు—సర్వసేనాధ్యక్షా, అంతవరకు మనసైనికుల నింకఱ నెందు దాచెదరు? కోటకంత చేరువగా గట్లులప్రక్కలను చెట్లుల ప్రక్కలను నక్కియున్న మనవీరులు భళ్లున తెల్లవారుటతోడనే శత్రువుల కంటబడరా?

రాజ—అయిన నిప్పుడే ముట్టడినిప్రారంభించి యింతలో విజయనగరసైనికులకొఱకువార్త నంపి వారువచ్చునంతలో శత్రుమారణమొనరించుచు కోటలోని కాహారపదార్థముల పోనీయకుండ జేసిన కోట మనకు లోబడదా?

సుబ్రి—అట్టిప్రయత్నములన్నియు ననవసరము. దైవమనుకూలించిన దుర్గమొకక్షణములో మనకు స్వాధీనమగునుపాయమొందు కలదు. రుస్తుముఖానువలన నిర్బంధితులైన మన పదివేలసైనికులింక నీ దుర్గమునందున్నారు, వారిని విడిపించి వారిచేతులకుఖడ్గములొసగి

మనకు సహాయపడగలరు. శత్రువులెఱుగని రహస్యమార్గమొకటి యీకోటలోనికికలదు. ఇది మహాశివర్ఘామురాత్రి. అరాతివీరుల నిద్రాదేవియావేశించియుండును. పదివేలఖడ్గములతో సమగ్రయోధుల దోడ్కొని మేములోనికి ప్రవేశించి సైనికులవిడిపించి దుర్గద్వారములదెఱచియుంతుము. మీరంతలోనికిదుముకుడు. అప్పుడు మనకప జయశంకయుండదు.

విజ—సెబాస్ ! గురుదేవా, మీయుపాయము సర్వోత్తమముగానున్నది. అట్లేయొనర్తమురండు.

సుబ్రి—వీరవరేణ్యులారా, రండు. తెల్లవారునప్పటికి పెద్దాపురదుర్గముపై వత్సవాయసూర్యపతాకము మరల ప్రతిష్ఠింపబడవలెను.

అందఱు—(నిష్క్రమింతురు.)

[అంతట తెరయెత్తబడగా దుర్గాంతర్భాగము గోచరించును. సోమసూరి, రాజన్న, నూరుద్దీను, కృష్ణారాయను ఖడ్గపాణులై కొందఱుసైనికులతో బ్రవేశింతురు.]

---

సుబ్రి—సద్దుచేయవలదు. సైనికులారా, మీప్రభుభక్తిని చూపు తరుణమిప్పుడు వచ్చినది. మీరేగి ముందుగ దుర్గద్వారములను దెఱచి మనసైన్యమును లోనికిప్రవేశపెట్టుడు. పొండు.

సైనికులు—(నిష్క్రమింతురు).

సుబ్రి—వీరులారా, రండు, అందఱమన్నిదిక్కులకేగి యీ యన్వర్ధుని పట్టుదము.

అందఱు—(నలుతోవల నిష్క్రమింతురు.)

[అన్వర్దీను ఖడ్గధారియై ప్రవేశించును.]

అన్వ—(నలువంకల బరిశీలించుచు ఆందోళనముతో) ఇంత రాత్రియేళా గడ్‌బిడాహాయితుంది సిత్రం! కత్తుల్ సప్పుడూలాగ దర్వాజా సప్పుడూలాగా యిన్పడుతుంది! (ఎదుట చూచి) అద్మీ మన్సీ నీడాకదుల్తూవుంది! (సమీపించి) అల్లా! అల్లా! కొత్తామన్సీ— ముసల్మాన్‌లాగావుంది! (పరికించిచూచి) అరే! అరే! యీమూ నూరుద్దీన్! మాకీహిత్మానక్కీ సూస్తాం. (ప్రక్కనుదాగియుండును.)

[నూరుద్దీను ఖడ్గహస్తుడై ప్రవేశించును.]

నూరు—ఈయన్వరు దురాత్ముడెందును గోచరింపడు. వీనిని పట్టి బంధించుదనుక నాహృదయాగ్ని చల్లారదు!

అన్వ—(వెనుకభాగమున వచ్చి నూరుద్దీనుని పొడిచి) బద్మాష్! దీన్కో నీఅగ్గీ సల్లారిందీతో సచ్చిపోతావ్ సైతాన్!

నూరు—(క్రిందవ్రాలి) హా! హా!— రాజన్నా! కృష్ణారాయా! గురుదేవా! రండు రండు—అన్వర్దీనిక్కడ—అన్వర్దీనిక్కడ!

అన్వ—(కత్తి నెత్తి రోషముతో) అల్లా! అల్లా! నీకీకాక హింకా ఆళ్ళని హాండర్కీ తెచ్చ్యితో సువర్! ఈదెబ్బాతో హిస్దేసుర్గ యాంహాయిపోతావ్ సూసోక్! (నూరుద్దీనుని చంపబోవును.)

[రాజన్న రభసముగ ఖడ్గపాణియై ప్రవేశించును.]

రాజ—(అన్వరుద్దీను నీవలకులాగి) అరే దురాత్మా!

గీ. అర్భకునినూరుదీనుని హతమొనర్చి
సంతసించుటగాదు నీశక్తినెల్ల
దండితారాతి రాజన్నదండజూపి
ఖ్యాతివడయుము నినుమెచ్చునపుడె జగము!

అన్వ—కోటాలోకీ ఘుస్కేలాగా హిమ్మత్‌వచ్చేర్ హిస్తే మీ పౌరుసం—బలా హం తో తెల్సింది. కాయాకూతల్ సదవాక కత్తీ పట్టూ! ఘుర్కే బిడ్డా తో హాత్ సూంపిన్సుమ్!

(ఇరువురును పోరాడుదురు. అన్వరుకత్తినుపాఱిపోవ రాజన్న వానిని తఱుముచు నిష్క్రమించును.)

నూరు—అక్కటా! ఈయన్వరునకు ప్రతీకారమొనరింపకుండగనే నేను పరలోకమున కేగుదును కాబోలును! కానిమ్ము! రాజన్న చేతులతోనైన వీనికి నేఁడు మరణముతప్పదు! (ఎదుటచూచి) ఓరీ పిఱికివందా! ఆడుదానివలె వెనుక పాటునవచ్చిపోషించితివేమిరా? దురాత్మా! మాతో నెయ్యమొనరింపవచ్చినట్లు వచ్చి, మమ్ము మోసగించి—యిట్లు మాకోటజొచ్చి, నీదొంగపోటునకు సగముచచ్చిపడిన నన్ను చంప కత్తినెత్తుటకు నీకు సిగ్గేలలేకపోయినదిరా! (నిట్టూర్పు విడిచి) రాజన్న వీనిని చంపగలడో లేడో! నేను సహాయపడబోవుదునా? (లేచి తూలుచు) పోగలనా?—పోగలనా? —అన్వరెక్కడ?— ఏమి? ఏమిది?—అబ్బా! ఏమి దురదృష్టమిది? కన్నులుపచ్చనై కానరాకున్నవేమి? కాలుసాగకున్నదే! శరీరమునిలువబడదే!—నా ప్రాణములు—నా ప్రాణములు నాయొడలియందున్నవా? ఓహో! నిక్కముగనుండిన అన్వరునుచంపవలదని రాజన్నను బ్రతిమాలి నేనే యీ భారమునువహించి అమ్మగారిఋణముతీర్చుకొందునుగదా! అమ్మా రాఘవమ్మాదేవీ, కుమారుడు కుమారుడని నీవెల్లప్పుడు సంబోధించి కన్నసంతానమువలె కన్నులలోబెట్టుకొని కడవరకు పోషింపబడిననేను నీ కుమారుల కాపాడలేక కాలునిబారికొప్పగించి యిప్పుడుమీ సన్నిధి కేమొగముతోవత్తునమ్మా? అమ్మా, నన్ను క్షమింపుము, నీ చెంతకువచ్చెదను. (కిందపడి) నాఆత్మబంధులగు మీరందఱేలోకమునందుంటిరో యచ్చటనేగాని నేనుండజాలను. అమ్మా, యిదెవచ్చెద. కాని—కాని విజయముమాట!—విజయముమాట యింకను వినఁబడలేదే! ఎట్లువత్తునమ్మా?—

( తె ర లో )

" జగపతిమహారాజునకుజయ ! ఆంధ్రమాతకుజయ్ !"

నూరు—(ఆనందముతో లేచి తూలుచు ముందునకుసాగి) సంతోషము ! సంతోషము ! విజయకోలాహలమువినబడినపిదప నా—కిచ్చట—నేమిపని—యున్నది ? నిశ్చింతతో ప్రాణములవిడిచెదను. (క్రిందపడి) రాజన్నా,—రాజాలను ! —నేను—నీకు—సహాయము చేయుటకు—రాజాలను ! (ఉలికిపడి లేచి కళవళపాటుతో) అన్నట్లు జగపతికుమారుని—క్షేమము!- ఓ ఆంధ్రయోధులారా ! ప్రభుభక్తిపరాయణులారా ! రాయజగపతిమహారాజును మరల శత్రుహస్తములబడకుండ రక్షించుకొనుడు ! జాగ్రత్త !- జాగ్రత్త !- గురుదేవా !- కృష్ణారాయా !- రాజన్నా !- సలామ్ సలామ్ !- అల్లా ! అల్లా !—(క్రిందబడి మరణించును.)

[కృష్ణారాయడు రభసముగ ప్రవేశించును ]

కృష్ణా—(నూరుద్దీను మృతదేహమునజూచి విచారాశ్చర్యములతో) నూరుద్దీన్ ! నూరుద్దీన్ ! ఏమిది! అన్నా! పడియుంటివేమి ? హా రక్తము! హా రక్తము! (కదపిచూచి) కట్టా ! నీకింతలో నెట్టిదారుణ మరణము సంభవించినది ! గురుదేవా, రాజన్నా, రండు, రండు.

[సుబ్రహ్మణ్యసోమయాజి వేగముగ ప్రవేశించును.]

సుబ్ర—(ఆశ్చర్యముతో) ఏమిది ? కృష్ణారాయా, యేమిది ?

కృష్ణా—(విచారముతో) గురుదేవా, యేమనిచెప్పుదును ?

గీ. తానుగొల్చినప్రభువుల దారుణముగ
జంపెననుక్రోధమున తనజనకుజంపి
స్వామిభక్తిని జగతికిజాటె నట్టి
మాన్యుడనఘుడు నూరుదీన్ మనకులేడు !

సుబ్రి—అక్కటా! కుమారా, నీవంటిసచ్ఛీలుడగు మహాత్ము డీయవీరుని నేనెందుజూతును? ఓమృత్యుదేవతా, నీహృదయమున కేమందును! (దుఃఖాశ్రువులతో)

గీ. పృథివీపతుల నిర్యాణమువిన్నయపుడు
సాధ్విరాగమ్మ జోహారుసలిపినపుడు
మించి జగపతినిన్ జెఱనుంచినపుడు
నేనెఱుంగని యశ్రువుల్ నేడుదొరలె!

(తెరలోకలకిలము.)

రాజ—(రోషముతో)

గీ. ఓరి యవినీతుడా, జాల్మ, యువిదపగిది
నింతవరకుజూపినశౌర్య మేటగలిసి
పాతెదేటికి?-నూరుదీన్ ప్రాణములను
గొన్నసిన్నేలవిడుచు రాజన్న నేను?

సుబ్రి—ఏమది కృష్ణారాయ?

కృష్ణా—(వికసించినమొగముతో) అదిగో! మన రాజన్న అన్వర్దీనుని మదమణంచి యిటేపువచ్చుచున్నాడు!

[రాజన్న రక్తసిక్తదేహముతో ప్రవేశించును.]

రాజ—(ఆయాసముతో) గురుదేవా, అన్వర్దీను హాతకుడు నాఖడ్గప్రహారణములకు రక్తములోడ ఖడ్గకవచశిరస్త్రాణములూడ కాలికొలదిబాటి యొక యరబ్బీయశ్వము పైబడి తెఱచియున్న దుర్గద్వారమునుండి యావలకుదాటి ప్రాణములుదక్కించుకొన్నాడు. ధర్మలోభులగు తమకువెఱచి యూపాటుబోతును విడచివచ్చినాను.

(తెరలో "జగపతిమహారాజునకు జయ్" అనుజయారావములు.)

కృష్ణా—అదిగో! మహారాజు సైన్యముతో లోనికివిచ్చేయు చున్నాడు. నాయకులులేని మహమ్మదీయులు సంధిధ్వజమునెత్తినారు, రండు-అచ్చటికేగి మనవారినభినందింతము.

సుబ్రి—కృష్ణారాయా,

గీ. జన్మకారణగునజేసి జాతిమతము
లందు భేదంబువర్తిలెనంతెకాని
యితడు మనదేవిమూడవసుతుడుగాడె!
యిట్టివానినివిడిచి నేడేగుటెట్లు?

నీవుముందేగి విజయరామరాజ, రాఘవరాజాదుల వెంటనిడుకొని యిచ్చటకురమ్ము. నూరుద్దీనునకీదుర్గమునందే నేటిదర్బారువేళకు గోరీ నిర్మింపబడవలయును. రాజన్నా, నీవేగి ఖాజీనితీసికొనివచ్చుట కెవ్వరినైన నియోగింపుము.

రాజ—చిత్తము. (నిష్క్రమించును.)

కృష్ణా—(నిష్క్రమించును.)

సుబ్రి—ఓహో!

చ. సతతము రాజ్యరక్షణము సర్వవిఘంబులజేయుదీక్షతో
పితనెవఘంచి, శాత్రవుల వేలకొలందిగజంపి, యిట్లు జీ
వితము నుధారవోసి తనువెంచినవారిఋణంబుదీర్చి, వి
స్తృతయశమునె గడించిన సుశీలునియాత్మకు శాంతికల్గుతన్!

గీ. జాతినిమహమ్మదీయుడై సహమలనగు
ప్రేమవిశ్వాసముల నాంధ్రపృథివిపతుల
నోమగొల్చినవీనిగోరీ, మహమ్మ
దీయహైందవులకు బుణ్యతీర్థమగుత!

(తెరపడును.)

## 5. రంగము—రాజసభాభవనము.

[విజయరామరాజు, సోమయాజి, రాజన్న, కృష్ణారాయడు, రాఘవరాజు, జగపతిసహితముగా లక్ష్మీనసోమిదమ్మ యథోచితాసనముల నందురు. ఇరువంకల సైనికులు బారులుతీరి నిలచియుందురు.]

---

విజ—(లేచి నిలువబడి) ఆంధ్రవీరవరేణ్యులారా, ప్రియసుహృద్బాంధవప్రముఖులారా, లక్ష్మమ్మతల్లీ,-పెద్దాపుర సామ్రాజ్యము నాచ్ఛాదించి పీడించిన తమోగ్రహములందు రాహువస్తమించినాడు. కేతువు తిరోహితుడైనాడు. విపన్మేఘముల నుత్తరించుకొని మరల స్వాతంత్ర్యచంద్రుడు సహజలావణ్యకాంతులతో నరుగుదెంచి యీ కిమ్మూరుసీమకు జీవకళ కలిగించుచున్నాడు. కాని మన రాష్ట్రమునకీ నడుమ వాటిల్లిన యుత్పాతములు హృదయవిదారణ మొనరించుచు దుఃఖప్రదములై యెన్నటికిని మఱువ సాధ్యము గాకున్నవి. శ్రీ కళాతిమ్మజగపతి మహారాజును, శూరాగ్రేసరుడును బాలుడును నగు బలభద్రరాజును ఆశ్రితమందారమగు సాధ్వి రాఘవమ్మాదేవియు నామె పెద్దకోడలు రామయ్యమ్మదేవియు సామ్రాజ్యహితులైన రామరాజు సుబ్బరాజుగార్లును స్వామిభక్తిపరాయణుడగు నూరుద్దీన్‌ఖాన్ మొదలగు వారెందఱెందఱో నిర్యాణము నొందిరి! ఎన్నెన్ని యిక్కట్లు ఘటిల్లినను వెనుదీయక నిలచి సంస్థానసంరక్షణ మొనరించి పీఠికాపురాధీశ్వరుడగు నీ రావు వేంకటకృష్ణరాయనింగారును, దళవాయి చల్లా రాజన్నయు, వత్సవాయవారికిని తమ్ములముగా మా పూసపాటివారికి నొనర్చిన సేవ యపారము. కుమారరాయజగపతిమహారాజును చెఱనుండి తప్పించి సామ్రాజ్యపునరుద్ధారణమునకై యీకొం

పిల్లవంశచూడామణులు—గురుదేవుడగు నీ సుబ్రహ్మణ్యసోమయాజియు మాత లక్ష్మీసోమిదమ్మయు సలిపిన సహాయత్యాగసాహసముల నుపమేయములు. ప్రాణసర్వస్వముల ధారవోసి విజయముచేకూర్చిన మన ఆంధ్రవీరుల విక్రమవిశ్వాసముల ప్రతిమానములు. పెద్దాపుర సామ్రాజ్యోద్ధారకులగు మీకెల్లరకు నాకృతజ్ఞతాపూర్వకాభివాదముల నర్పించుచున్నాను. ఈసందర్భమున మా జగపతుల పక్షమున మేముగావించిన కొన్నిశాసనముల చదివెదము; వానిని మీరు దయయుంచి వినవేడెద. (శాసనముల నొక్కొక్కటొక్కటెతీసి పఠించును.) "శ్రీరాజా రావు వేంకటకృష్ణారాయనింగారింతటినుండి పెద్దాపురసంస్థానమునకు పన్నుగట్టనక్కరలేదు."

అందఱు—కృష్ణారాయనింగారికి జయ్!

విజ—"దళవాయి చల్లా రాజన్నకు సర్వసేనాధిపత్యమును సంగ్రామచక్రవర్తి బిరుదమును పదివేలవరహాలును పసదనము."

అందఱు—చల్లా రాజన్నకు జయ్!

విజ—"చీమకుర్తిచెంత లక్ష్మీపురాగ్రహారమను పేర నొక అగ్రహారమునీ కొండపిల్లవారికుటుంబమునకు దానవిక్రయాధికారములతో నొసంగుచున్నాము."

అందఱు—కొండపిల్లవారికి జయ్!

సుబ్ర—(తటాలున లేచి) సభ్యులారా, ఆగుడాగుడు. మహారాజా, యిదేటియాచి! ప్రతిఫలమును పరిగ్రహించుటకా యీబ్రాహ్మణదంపతులు మీకై పాటుపడినది?

గీ. పుష్పమో, పత్రమో, ఫలమోయొసంగి
మమ్ముబోటిబ్రాహ్మణుల సమ్మదముపఱుప
వలయునేగాని ధనములో పట్టణములో
యేల యర్పింపమాకు మహీమహేంద్ర!

విజ—(మందహాసముతో) గురుదేవా, చంద్రునకొక నూలు పోగు—అనుగ్రహింపవలయును.

గీ. అగ్నులిష్టులు జపతపోధ్యయనములును
సర్వమునువీడి రాజ్యరక్షణముకొఱకు
కాగ్నికంబుల శరముల ఖడ్గములను
దాల్చినమహాత్ములకు నిట్టిదాన మెంత?

అందఱు—(కరతాళరవము) గురుదేవునకు జయ్ !

విజ—“గండ్రేడు వత్సవాయవంశసంజాతులగు నీరాఘవ రాజుగారిని రాయజగపతిమహారాజునకు యుక్తవయస్సువచ్చువరకు రాజప్రతినిధిగా నియమించితిమి.”

అందఱు—రాజప్రతినిధి రాఘవరాజునకు జయ్ !

విజ—“నూరుద్దీనుఖానుగోరీని దుర్గమునందే నిర్మించియుంచుటకు అనుమతినొసంగితిమి.”

అందఱు—(లేచి) నూరుద్దీను ఆత్మకు శాంతియగుగాక ! (అని కూర్చుందురు.)

విజ—“పట్టాభిషేకానంతరము పెద్దాపురపక్షపు వీరు లందఱును నూతనగతి బహుమానములొసగబడును.”

అందఱు—ఆంధ్రవీరులకు జయ్ !

విజ—గురుదేవా, యిక్కడికన్నియు పూర్తియైనవి. పట్టాభిషేకమున కాలస్యమెందులకు ?

సుబ్రి—ఆలస్యములేదు. కాని సభ్యులారా, మన మొక సుకవి లుని మఱచి వారి కాశీర్వాదములనిడకుండగనే సాగిపోవుచున్నాము. అదిధర్మము కాదు. వారినిట్లుకోరుదము,

సీ. ఏరాజసింహుని స్నేహయుంబు సర్వదా
బంధుపక్షులతచే బరిఢవిల్లు,

ఏమహీపతి ధైర్యమెవ్వేళ మేరువు
నట్టులకంపితమగుచుదనరు,
ఏనరపాలుని యనలేనివిక్రమం
బరులకు నద్భుతమగుచు వెలుగు,
ఏ తేనిధీయుక్తి బాలజగపతి
రాజ్య సంస్థాపనార్థంబు నెగడు-
గీ. నాతడు మహోపకారి మహామహుండు
ఆప్తబంధుండు పూసపాట్యన్వయార్ణ
వాబ్జుడనఘుండు విజయరామావనీశు
డాయురారోగ్యసుఖముల నలరుగాత !

అందఱు—విజయరామభూపాలునకు జయ్ !

సేవకుడు—(ప్రవేశించి) జయము ! జయము ! మహారాజా ! గోలకొండనవాబుగారు తమదర్శనార్థమువచ్చి యావలవేచియున్నారు.

అందఱు—(తొట్రుపాటుతో పరికింతురు.)

విజ—ఏమీ ! నైజామ్—ఉల్—ముల్కు యిటకు స్వయముగ విచ్చేసెనా ? సరే, అట్లయిన తక్షణమే ప్రవేశపెట్టుము. సభ్యులారా, యిందాశ్చర్యపడవలసిన దేమియును లేదు. రండు, నైజామున కెదురేగుదము.

[నైజామ్—ఉల్—ముల్క్ ప్రవేశించును.]

అందఱు—(ఎదురేగుదురు.)

నైజా—అస్సలామలేఖుమ్ మహారాజ్

విజ—వాలేకుమ్ సలామ్ జనాబ్, దయచేయుడు. సరిగా మంచిసమయమునకు విచ్చేసినారు. మీరాక మాకెంతయు ముదావహము.

నైజా—(అందఱను కూర్చుండసంజ్ఞచేసి తానునుగూర్చుండును.)

అందఱు—(కూర్చుందురు.)

నైజా—(లేచి) మహారాజా, సభ్యులారా. రుస్తుంఖానుని దండింపవచ్చిన నేనిట్టి మంగళోత్సవములగాంతుననుకొనలేదు. అందును విజయరామభూపాలునిచ్చట దర్శింపగలుగుట నాభాగ్యము! రుస్తుముకపటాలోచనముల గ్రహింపజాలక మీయొద్దనుండి జుమ్మాగొని తెమ్మని పంపి మీయెడ చాలయపచారమొనర్చితిని. ఈ క్రూరుడు మీకొనర్చిన యపకారమునకు చింతించుటయేగాక వీనివలన మాజాతికే కళంకమువచ్చినదని విలపించుచున్నాను. వీనినిజంపి నూరుద్దీను మాకెంతయు మదమొనగూర్చినాడు. మరల మావలన జగపతులకుకలిగిన నష్టపరిహారముగ సుహృద్భావముతో జగపతులేటేట మాకు చెల్లింపవలసిన జుమ్మాను వదలివేసి పెద్దాపురసంస్థానమును స్వతంత్రరాజ్యముగానంగీకరించి మేముస్థిరపరచుచున్నాము.

అందఱు—(కరతాళధ్వనులు.) జగపతులకు జయ్!

విజ—జనాబ్, మీయౌదార్యమునకు మేమెంతయు సంతసించుచున్నాము.

ఉ. ఈవిధినైకమత్యమున హిందువులల్లమహమ్మదీయులుఁ
బావనమైత్రిభాసిలెదు భాగ్యముకల్గుటనేడుచిత్ర. మా
దైవమె నాడు రుస్తుముదుర్వారయటుల్ కడగండ్లబెట్టి యిం
పావహిలన్ సుఖంబొసగెనందఱకున్ గరుణాలుడై తుదన్!

సుబ్ర—నిజము! నిజము!

విజ—(వేఱువేఱ నిరూపించుచు) జనాబ్, యిటుతిలకింపుడు.

సీ. తనజీవితమును సంస్థానరక్షణమందు
వినియోగపఱచిన విప్రుడితడు!

తనవిక్రమాగ్ని బ్రిత్యర్థి కాంతారదా
హము చేసినట్టి రాజన్నయితఁడు !
తన సుహృత్సరణి సంస్థానశత్రులఁజంప
వ్రాలిన శ్రీకృష్ణరాయఁడితఁడు !
తన బంధువాత్సల్యమున గోటగాపాడ
గ్రాలిన రాఘవరాజితండు !

గీ. స్వామిభక్తిచే దండిగ్రనిజంపినట్టి !
గుణవరేణ్యుని నూరుదీన్ గోరి యదియె !
తమపరాక్రమములను శాత్రవుల జెండి
విజయమును గొన్న వారలీ వీరవరులె !

నైజా—సామ్రాజ్య శ్రేయోభిలాషులగునిందఱు ఘనుల నెఱింగి ధన్యుడనైతిని.

విజ—గురు దేవా, యింక పట్టాభిషేక మహోత్సవమును నిర్వర్తింపుడు.

సుబ్ర—మహాప్రసాదము. (రాయజగపతిరాజును సింహాసనమునందు నిలిపి కిరీటమును చేతధరించి సభ్యులవంక దరిగి హర్షోత్సాహములతో) ఓహో !

గీ. శ్రీకళా తిమ్మజగపతిక్షితిపతిసుతు
జగపతిక్ష్మాతలేంద్రు రాజ్యంబునందు
నిలుపు భాగ్యమునీనాడు కలిగె నాకు
అహాహ ! నాజన్మసార్థకమయ్యె నేఁడు !

చ. జగతిని నేలజాలుగుణజాలము, సంగరరంగమందునన్
బగతురగెల్వజాలు పటుబాహుపరాక్రమశక్తియుక్తులున్
నిగమమనీషులప్డెసుపు నిర్మలనిశ్చలధీవిశేషమిం
జగపతికబ్బుగాక నికసంతతమున్ బరమేశుసత్కృపన్ !

(జగపతిమూర్ధముపై కిరీటమునుంచి యాశీర్వచనమంత్రము నిటు గానముచేయును.)

" అగ్నేయశస్విన్ యశసే మమర్పయేంద్రావతీమప
చితీమిహావహ । అయంమూర్ధాపరమేష్ఠీసువర్చా
స్సమానానాముత్తమశ్లోకో అస్తు ॥"

అందఱు—జగపతిమహారాజునకు జయ్! లక్ష్మీనృసింహస్వామికిజయ్! (సింహాసనమునకు తలలువంచి మ్రొక్కుదురు.)

లక్ష్మి—(మంగళముపాడి శ్రీరాయజగపతికి హారతినిచ్చును.)

సుబ్రి—శ్రీ లక్ష్మీనృసింహస్వామికృపచే నీసుముహూర్తమున నిది పఠించుభాగ్యము కలిగినది!

స్వస్తిప్రజాభ్యః పరిపాలయంతాన్
న్యాయ్యేనమార్గేణ మహీం మహీశాః
గోబ్రాహ్మణేభ్యశ్శుభమస్తునిత్యం
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు!

ఇది తృతీయాంకము.

సర్వము



సంపూర్ణము.